

ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక


వెల 4 అణాలు ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY 9-8-1



ఉన్నత విద్యార్థులు ఒక సాహసంగానూ, తదితర దేశాలతో సాంస్కృతిక వైజ్ఞానిక, సంబంధాలను పెంపొందించుటకు ప్రపంచ పర్యటన తలపెట్టి, దేశదేశాలూ తిరుగుతూ ఢిల్లీకివచ్చిన కొంతమంది అమెరికన్ యువతీ యువకులతో జూలై 25 నాడు ప్రధాని పండిత నెహ్రూగారు ఇష్టాగోష్ఠి జరిపారు.



ఆసియా ఆటలసభవారు జూలై 31 వ తేదీనాడు ఢిల్లీలో సమావేశమైనారు ఫిలిప్పయిన్స్, ఆఫ్ఘనిస్తాన్, సిలోన్, థాయిలాండ్, ఇండోనీషియా, బర్మా - ఈ యేడు ఆసియా దేశాలున్నూ అందులో పాల్గొన్నవి



ప్రఖ్యాత ఆంగ్లనాటక రచయిత జార్జి బెర్నార్డ్‌షా 94 వ జన్మ దినోత్సవం జూలై 26 వ తేదీని జరుపబడింది.

సంవత్సరచందా రు. 12-0-0 విడిప్రతిక 4 అణాలు	ప్రతిబుధవారము ప్రకటింపబడును. ఒరులేయవియొనరించిన నరవర, యప్రియము తనమనంబున కగు దా నొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మపథముల కెల్లన్. (మహాభారతము) **Founder : K. NAGESWARA RAO**	సంపుటము **42** సంచిక **49**

వికృతి సంవత్సర నిజాషాఢ బహుళ ఏకాదశి బుధవారము



కురుక్షేత్రంలో కొరియా యుద్ధం

వస్తుసంభారాల ధరలను దినదినానికి విపరీతంగా పెంచుకొని పోతూవున్న వాణిజ్యవ్యాపారులను మందలిస్తూ శ్రీ హరికృష్ణమెహతబ్ సుగ్రీవాజ్ఞగా గట్టి హెచ్చరిక చేశారు.

*



ఆంధ్రపత్రిక

1950-వ సం॥ ఆగస్టునెల 9-వ తేది బుధవారము

పరిపాలనా వ్యాసంగం.

"సంగ్రామజ్వాలలు ప్రస్తుతము కొరియాకు మాత్రము పరిమితమై యున్నను, ఈ అంతర్యుద్ధము క్రమముగ ప్రపంచ పరివ్యాప్తము కాగలదను భయము ప్రజానీకమును ఆవహించినది. ప్రపంచశాంతికి సంఘటిల్లిన ఈ మహాప్రమాదదుష్ఫలితములను అన్ని దేశములు అనుభవించవలసియుండును. ఇందువలన దేశఆర్థికరంగమున ప్రమాదభరితమైన అనేకసమస్యలు ప్రభవించుటకు సావకాశ మున్నది. ప్రమత్తతతో ప్రవర్తించి ధరలు ఇంకను పెరిగిపోకుండ కఠినమైన చర్యలు తీసుకొనవలసియుండును. ప్రజలు ప్రభుత్వశాఖలన్నియు వీలైనంతవరకు తమ ఖర్చులను తగ్గించుకొని మితవ్యయమును సాధించుటకు కృషి చేయువలెను."

అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ పార్లమెంట్ కార్యక్రమమును ఉపక్రమించుచు చేసిన సమగ్ర సమీక్షయందలి ఈ వాక్యములు వర్తమానజాతీయ, అంతర్జాతీయ పరిస్థితులు ఎంత విషమముగ, ఎంత ప్రమాదకరముగ నున్నవో హెచ్చరించినవి. ద్వితీయ ప్రపంచసంగ్రామము పరిసమాప్తమై అయిదు సంవత్సరము లైనవి. ఒక్క అమెరికా తప్ప మరి ఏ దేశము ఇప్పటికి కోలుకొనలేదు. ఆయుధనిర్మాణమును, సైనికబలాభివృద్ధిని నిలుపుచేసి ప్రజాభ్యుదయకార్యక్రమముల నిర్వహణకు, జాతీయసంపదను వినియోగించుటకు ఈనాటివరకు ఏ దేశమునకు అవకాశము లభించలేదు.

మూడేళ్లుగ యావత్ప్రపంచమును తిరిగి యుద్ధభీతి ఆవహించినది. రష్యా దురాక్రమణను నివారించుటకు అమెరికాఆయుధప్రమాణము, సైనికబలము వృద్ధి కావలెనను ప్రచారము ఎక్కువగ జరుగుచుండెను. రష్యాకూడ "ప్రజాస్వామ్యముల దురాక్రమణ" ను నివారించుటకు కాకపోయినను, కమ్యూనిస్టు ప్రపంచస్థాపనకు తన ఆశ్రితరాజ్యముల యుద్ధనిర్వహణశక్తి వృద్ధికావలసియున్నదని హెచ్చరించుచుండెను.

ఇట్టి పరిస్థితులలో గాఢముగ శాంతి నాకాంక్షించుచున్న దేశములుసైతము స్వీయస్వాతంత్ర్య సంరక్షణకు సైనికబలమును వృద్ధిచేసుకొనవలసిన అవసరము ఏర్పడినది. భారతదేశము జాతీయాదాయములో నూటికి అరవైవంతులు రక్షణశాఖకు వినియోగించుచున్నను, నేటి దేశసైనికబలము దురాక్రమణను ప్రతిఘటించుటకు గాక, కేవలము దేశమునందు కమ్యూనిస్టుకల్లోలమును అణచివేసి ప్రశాంతపరిస్థితులను స్థాపించుటకు మాత్రమే సరిపోవును.

కొరియాయుద్ధము విశ్వవ్యాప్తమైన, పార్లమెంటు కాంగ్రెసుపక్షమునకు పండిట్ నెహ్రూ తెలిపినట్లు భారతదేశము, ఇష్టము లేకపోయినప్పటికిని, ఆ యుద్ధములో చిక్కుకొనక తప్పదు. కాని అట్టి ప్రపంచ పరివ్యాప్తమైన సంగ్రామములో భారతదేశము ప్రస్తుత సైనికబలముతో దురాక్రమణను ఎంతవరకు ప్రతిఘటింపగల దనునది సందేహాస్పదమే. కమ్యూనిస్టు నాయకుడు యస్. ఎ. డాంగేగారు "నూటికి అరువది చొప్పున జాతీయాదాయమును సైన్యముపై ఖర్చు చేయు నెహ్రూప్రభుత్వమును దౌర్జన్యచర్యలద్వారా కూలదోయుట సాధ్యముగాదు" అని ప్రకటించవచ్చును. కాని కొరియాయుద్ధము ప్రపంచయుద్ధముగ పరిణమించిన నేటి భారతీయసైన్యము దేశమున శాంతిని కాపాడుటకుకూడ చాలకపోవచ్చును.

ఈ పరిస్థితులలో భారతదేశము పూర్వముకంటెను ఎక్కువగ రక్షణకార్యములకు ధనము వినియోగింపవలసియుండును. దేశ ఆర్థికస్థితినిగురించి, అనేకప్రాంతములందు ఏర్పడిన క్షామపరిస్థితినిగురించి అధ్యక్షుడు తెలిపిన వివరములను గమనించిన సైనికవ్యయమును పెంచుటకు ఇంతలో అవకాశమున్నట్లు కన్పింపదు. పై పెచ్చు ప్రజలు ప్రభుత్వశాఖలుకూడ మితవ్యయమును సాధింపవలెనని డాక్టర్ రాజేంద్రప్రసాద్ ఆదేశించెను. ఇప్పటికే ధరలు విపరీతముగ పెరిగినవి. యుద్ధము రావచ్చుననుభావము ప్రబలగనే వ్యాపారస్థులు వస్తువుల ధరలను పెంచిరి. బీహార్‌నం ఏర్పడిన క్షామపరిస్థితులకు ఆహారపదార్థముల కొరత గాక, అధికధరలే కారణమని స్వయముగ స్థితిగతులను విచారించిన కేంద్రఆహారశాఖామంత్రి కె. యం. మున్షీ గారు ప్రకటించిరి.

ప్రభుత్వవ్యయము తగ్గి, యుద్ధకాలమున ప్రారంభమైన ద్రవ్యోల్బణము తగ్గినగాని వస్తువుల ధరలు తగ్గి ప్రజలు తమ నిత్యావసరవస్తువులను పొందజాలరు. ఒకవైపున ధరలుతగ్గించుటకు ప్రయత్నించుచు మరొకవైపున ధరల పెరుగుదలకు దోహదము చేయగల చర్యలను ప్రభుత్వము తీసుకొనజాలదు.

స్వాతంత్ర్యప్రాప్తివలన కలిగిన క్రొత్త బాధ్యతలను, ఏర్పడిన విధులను నిర్వహించుటకు ప్రజలు, ప్రజాప్రతినిధులుకూడ మూడు సంవత్సరముల తరువాతగూడ సిద్ధముగ లేరు. సర్వసామాన్యముగ ప్రజలు, - ఇవి అన్నితరగతులవారికిని వర్తించును- తమ అవసరములను పెంచుకొనుచు, వాటిని తీర్చుకొనుటకు తగిన వరుమానము లేదని, ప్రస్తుతఆదాయముతో వాటిని తీర్చుకొనుట సాధ్యము గాకున్నదని ఆందోళన చేయ మండిరి. ఇందువలన ధరలు తగ్గు అవకాశము లేదు. అన్నివర్గములవారును ప్రధానముగ పైవర్గములవారు వీలగునంతవరకు తమ అవసరములను తగ్గించుకొని, బ్లాక్‌మార్కెట్‌లో ఎంత ధరకైనను వస్తువులను కొనుపద్ధతిని - ఇది దాదాపు ఈ వర్గములకు అలవాటైనది - విరమించుకొని ధరలను తగ్గించుటకు తోడ్పడవలెను.

రాజకీయస్వాతంత్ర్యసముపార్జనకు ఎంతటి త్యాగము చేసిరో, ఎట్టి దీక్షతో కృషి చేసిరో నేడు దేశమును ఎదుర్కొనుచున్న విపత్కరఆర్థికపరిస్థితులను తొలగించి, స్వాతంత్ర్యమును సుస్థిరము చేయుటకును, ఆర్థికాభివృద్ధిని సాధించుటకును కృషి చేయవలెను. ప్రజాబాహుళ్యమును ఇట్టి త్యాగమునకు, సన్నద్ధము చేయవలసిన బాధ్యత ప్రభుత్వమునకు, ప్రజాప్రతినిధులకును సమానముగ గలదు. పార్లమెంట్‌లో అధ్యక్షుని ప్రసంగముపై జరుగు చర్చలు వీ రుభయులు తమ బాధ్యతలను ఎంతవరకు గుర్తించిరో వెల్లడిచేయును.

బ్రిటన్ గతసంగ్రామములో దాదాపు పూర్తిగ శిథిలమైనది. ఆర్థికవ్యవస్థ విచ్ఛిన్నమై పోయినది. అమెరికా మార్షల్‌పథకము, ప్రత్యేకఋణము ద్వారా ఎంత సహాయము చేసినప్పటికిని, బ్రిటిష్ ప్రభుత్వము, ప్రజలు ఏకలక్ష్యముతో, ఆ లక్ష్యసాధనకు తదేకదీక్షతో కృషిచేయకపోయిన కోలుకొనియుండెడిదిగాదు. భారతప్రభుత్వము, భారతప్రజలు కూడ అదేవిధముగ వ్యవహరించినగాని దేశఆర్థికసమస్యలు పరిష్కారము కాజాలవు. తృతీయ సంగ్రామమే తప్పనిసరియైన, ఆ సంగ్రామమునందు దురాక్రమణను ప్రతిఘటించి తమ స్వాతంత్ర్యమును సంరక్షించుకొనజాలరు.

శాంతి సంరక్షణ

దేశమున శాంతిని సంరక్షించుటకుగాను ప్రభుత్వము సర్వాధికారములను ప్రయోగించుటకు వెనుదీయదని భారతప్రభుత్వ అంతరంగికశాఖామంత్రి సర్దార్ పటేల్‌గారు పార్లమెంటులో నిష్కర్షగా చెప్పినారు. శాంతిని సంరక్షించు హేతువుపై ప్రభుత్వము విచక్షణారహితముగ వ్యక్తుల వ్యక్తిగతాధికారములను భగ్నమొనర్చుచున్నదని పండిట్ కుంజ్రూగారు విమర్శించియుండిరి. దానికి సమాధానముగ, లక్షలాది ప్రజల స్వేచ్ఛను కాపాడుటకై ఆగ్రహావేశపూరితులు, ఉన్మత్తులు నైనవారి వ్యక్తిగతస్వత్వములను భంగమొనర్చుట నిరాక్షేపణీయమైనదని పటేల్ గారి వాదము.

శాంతిని భంగము చేయ దలచువారు మూడు విధముల నున్నారని పటేల్‌గారు చెప్పిరి. విప్లవమును తెచ్చుటకు యత్నించు కమ్యూనిస్టులు, హిందూరాజ్యమును బ్రాహ్మణసాంప్రదాయమున కనుగుణ్యముగ స్థాపించ యత్నించు హిందూమత రాజకీయవాదులు, భాషాప్రయుక్తరాష్ట్రవిభజనమిషపై మత రాజకీయములను నడుప యత్నించువారు. ఇందు హిందూమహాసభకు చెందిన రెండవవర్గమువారు గాంధీమహాత్ముని హత్యతో తృప్తిపడక జవహర్లాల్ నెహ్రూగారినికూడ హత్యచేయ యత్నించుచున్నారని యారోపించిరి. ఇం దనుమానించ దగిన విషయ మేమియు లేదు. కాని ఈనాడు బ్రాహ్మణసాంప్రదాయానుసారముగ హిందూరాజ్యమును స్థాపించదలచు అవివేకు లున్నా రన్నచో విశ్వసించుటకు వీలుగాకున్నది. బ్రాహ్మణసాంప్రదాయ మను మాటకైన స్పష్టమగు యర్థము నెవ్వరైన చెప్పజాలరు. దోష మారోపించునెడ స్పష్టముగ నుండజాలనిచో వ్యక్తుల నిర్బంధము గాని, ప్రభుత్వము గైకొను చర్యగాని సమర్థనీయములు కాజాలవు.

ఇట్లే కమ్యూనిస్టునాయకుల నిర్బంధమునగూడ యస్పష్టమగు యారోపణచే వారి విడుదలకు హేతువైనది. కమ్యూనిస్టులు దేశమున నింతగా అరాచకమును రెచ్చగొట్టుచుండగా స్పష్టమగు హేతువులను ప్రభుత్వము చూపజాలకున్నచో న్యాయస్థానములు నిర్బంధితులను విడిచిపెట్టక మరేమి చేయగలవు?

వ్యక్తినిర్బంధశాసనమును పార్లమెంటులో చర్చించునప్పుడు అనేకులు 14 వ నిబంధనకు ఆక్షేపణ తెలిపిరి. ప్రభుత్వ మానాడు గమనించక శాసనము చేసినందువలననే ఇప్పుడు దానిని సవరణచేయవలసిన యగత్యము పట్టినది.

చెన్నరాష్ట్రమున ఇట్టి శాసనములకు మితి లేదు. ముందు శాసనము గావించుట, తరువాత సవరణ చేయుట ఇది యొక్కటియే శాసనసభకర్తవ్య మని తోచుచున్నది. శాసనములు చేయునపుడు రిపబ్లికన్ రాజ్యాంగసాంప్రదాయములకును, ప్రజాభిప్రాయమునకును అనుగుణ్యముగ నున్నదీ లేనిదీ విచారించు శ్రద్ధ ప్రభుత్వములకు లేకున్నది. దీనివలన శాసనసభల సమావేశము లధికమై ఖర్చు లధిక మగుచున్నవి. అసలు శాసనము లెందుకు చేయబడుచున్నవో, వాని యాంతర్యమేమో, ప్రభుత్వము కోరున దేమో ప్రజల కర్థమగుట లేదు. కావుననే శాంతిసంరక్షణయందే గాక తదితర పాలనావ్యవహారములందుగూడ ప్రజలకు గాని ప్రభుత్వోద్యోగులకు గాని శాసనాధికారముల పరిమితి తెలియరాకున్నది.

ఈ విషయములందు ప్రభుత్వము లికనైన శ్రద్ధ వహించి ప్రజల సొత్తును పొదుపుగా వాడెదరని యాశించవలసియున్నది.

విషయానుక్రమణిక

9 ఆగస్టు 1950

నేటిప్రపంచం

భారతప్రభుత్వ విదేశాంగ విధానం *


భారత రిపబ్లిక్ పార్లమెంటు ఈవారం విదేశాంగవిధానంపైన ముఖ్యంగా కొరియా యుద్ధంపైన చర్చ జరిపింది. చర్చ ఉపక్రమిస్తూ పండిట్ జవహర్లాల్ నెహ్రూ కొరియాయుద్ధంపట్ల తమ విధానాన్ని వివరించారు. శాంతికీ యుద్ధానికీ మధ్య ప్రపంచం ఊగులాడుతున్నదనీ ఏ స్వల్ప హేతువుపైనైనా ప్రపంచవ్యాప్త సంగ్రామం ప్రజ్వలించవచ్చుననీ వారన్నారు. అందువల్ల భారతప్రభుత్వం అపేక్షకు లోనుకాకుండా అత్యంత జాగ్రత్తతో ప్రవర్తించవలసిఉంది.

కొరియాకు సంబంధించినంతవరకూ నాలుగు ముఖ్యాంశాలపైన భారతప్రభుత్వ విధానం ఆధారపడిఉంది. 1 ఉత్తర కొరియా దురాక్రమణ నేరానికి బాధ్యత వహించవలసిందే. 2. కొరియాయుద్ధాన్ని అన్యప్రాంతాలకు వ్యాప్తికానివ్వరాదు 3 వీలైనంత త్వరలో ఈ యుద్ధాన్ని ఆపుదలచెయ్యడానికి యత్నించాలి. 4 కొరియాభవితవ్యాన్ని కొరియావాసులే (రష్యా అమెరికాలు కాదు) నిర్ణయించవలసినవారు. ఈ అంశాలకు లోబడే భారతప్రభుత్వం భద్రతామండలి మొదటి రెండు తీర్మానాలను ఆమోదించింది. ఈ అంశాలననుసరించే కమ్యూనిస్టుచీనాను భద్రతమండలిలో ప్రవేశపెట్టాలని సూచించింది. రష్యాను తిరిగి భద్రతామండలిలో చేరాలని కోరింది.

ప్రపంచంలో తిరిగి శాంతి చేకూరాలంటే ఐక్యరాజ్యసమితి పునరుజ్జీవనం పొందాలి. అంటే కమ్యూనిస్టుచైనాకు ప్రవేశం కలిగి రష్యా తిరిగి పాల్గొనగలగాలి. కాని కమ్యూనిస్టుచీనాసభ్యత్వసమస్యతో కొరియాసమస్యను ముడిపెడుతున్నారనీ, రష్యాను తృప్తిపరచడానికే అనుచితమైన కార్యాలను అంగీకరించమంటున్నారనీ అమెరికాలో విమర్శ వచ్చింది. రష్యాకు ప్రీతి చేకూర్చడానికి యత్నించడమంటే అందులో అర్థం లేదు. అమెరికన్ల విమర్శ సరైనదే. కాని ప్రీతి చేకూర్చడంకోసం అంగీకరించమంటున్న కార్యం ఉచితమైనదా అనుచితమైనదా అనేదే సమస్య. ఉచితమైనదని భారతప్రభుత్వంఅభిప్రాయం. అనుచితమైనదని అమెరికాఅభిప్రాయం.

ఇక్కడే ఆసియావాసుల అంతరంగాన్ని అమెరికాగాని యూరప్‌గాని గ్రహించలేకున్నారని పండిట్ నెహ్రూ అన్నారు. చీనాలో కమ్యూనిస్టు ప్రభుత్వం వచ్చినంత మాత్రంచేత అది అంటరానిదని అమెరికా భావించడం పొరపాటు. ఆసియాఖండంలో పరిస్థితుల్ని గమనిస్తే ఈ విషయం బోధపడుతుంది. ప్రస్తుత ప్రపంచరాజ్యకూటముల్లో ఏ కూటంతో చేరాలి? ఏ కూటంతోనూ చేరకుండా తటస్థంగా ఉండడం సాధ్యమేనా? సాధ్యమేనని కొందరి అభిప్రాయం. సాధ్యంకాదని భారతప్రభుత్వం అభి

(38-వ పేజీ చూడుడు)



పండిట్ జవహర్లాల్ నెహ్రూ

నవల:



శ్రీ నోరి నరసింహశాస్త్రి

౪౩

అదిగో, యెత్తినవారు పట్టణము మ
　　ధ్యశ్రోణి సింహధ్వజం
ఒదిగో, కట్టినవారు నింబదళమా
　　లాతోరణ వ్రాతముల్
విదితం బయ్యె మహోత్సవంబు తెలుగా
　　వీథీవిటంకంబులం
జదిగో, నిల్పినవారు పూర్ణకలశం
　　బాబాలగోపాలముల్ !

క్రీడాభిరామము.

శ్రీ రుద్రదేవమహారాజులు ధర్మారామభీమేశ్వరమునుండి పంపిన యాజ్ఞల ననుసరించి ఏకశిలానగరమున విజయోత్సవములు మహావైభవముతో సాగుచుండెను. ఇది మోటుపల్లిని త్రిపురాంతకుడు జయించినప్పుడు జరిపిన యుత్సవము కంటె నెన్నియో రెట్లు మించి యుండెను. ఇప్పుడు కొప్పెరుంజింగడు సంపూర్ణముగా విజితుడయ్యెను. గొంటూరు మండలికుడగు నాగదేవుడు హతుడయ్యెను. అతని మిత్రు లందరు పట్టుపడిరి. మోసలపట్టణము వశమయ్యెను. చోళ నాకలన్నియు పలాయితము లైనవి. మహోత్సవము జరుగకుండు టెట్లు ?

మరియు మహారాజు లాజ్ఞాపించిన ప్రకారము ఓరుగల్లునుండి యొక మహాసేనను తీసికొని తిక్కచమూపతి ఆగ్నేయమునుండి వచ్చుచున్నారని తెలిసిన చోళుల నెదిరింపబోయెను; గోన గన్నారెడ్డి నైరృతినుండి వచ్చుచున్నట్లు తెలిసి కర్ణాటసేనల నెదుర్కొన మఱియొక మహాసేనతో కదలిపోయెను. ఇప్పుడు చూడ ఓరుగల్లు కేవల మరక్షితముగా నున్నట్లున్నది !

రాజప్రతినిధిగా రాజకార్యము లన్నియు మొదటినుండి చూచుచున్న రుయ్యమ్మగారే యీ రాజాజ్ఞ లన్నియు ప్రవర్తింపజేసెను. ఆ యాజ్ఞలును రుయ్యమ్మ పంపిన వార్తల ననుసరించియే రుద్రుడు పంపినట్లు స్పష్టమయ్యెను. అందుకు రుయ్యమ్మకు నుండెంతో సంతోషమయ్యెను. ఎంత ప్రేమగల తల్లియైనను, తాను సూచించిన కార్యము తల్లికిని సమ్మతమై, తన సూచనప్రకారము ఆజ్ఞలు ప్రవర్తింపజేయబడినచో పిల్లకు సంతోషము కలుగదా ?

తిక్కచమూపతియు గోనగన్నారెడ్డియు సేనలతో కదలుచుండగా రుయ్యమ్మను ఆనందమే ఆవేశించెను.

కాని ఆ సేనలు కదలిపోయి మూడుదినము లైనవి. అంతలో నాకస్మికముగా రుయ్యమ్మ హృదయములో పెద్ద బరువువచ్చి పడినట్లయ్యెను. మనస్సు అంతయు శూన్యమైనట్లు తోచెను. ఇప్పుడు ఏకశిలానగరమునకు సైన్యబలమగు రక్ష లేదు. శిలాప్రాకారము సంపూర్ణముగా లేనేలేదు. పుట్టకోటరక్షణ చాలదు. అయినను భయమేమున్నది ? రాదగిన శత్రు వెవరు ? దేవగిరిరాజు ఉత్తరదిశాభిముఖుడై దేహళీప్రభువుల సేనల నెదిరింపబోయెనుగదా ! భయ మేమి ?

"అది మోస మైనచో ?"

రుయ్యమ్మ గుండెలలో రాయిపడినట్లయ్యెను. ఇప్పుడు తా నెవ్వరితో నాలోచింపగలదు ? మహాప్రధాను లగు గోవిందనాయకుడును బయ్యననాయకుడును పని చాలించుకొనిరి. ఇన్నాళ్లును తిక్కచమూపతి తన కెంతయేని సహాయముచేయుచుండెను. ఇప్పు డెవ్వరి నడుగగలదు ? తనకు విశ్వాసయోగ్యమగు మంత్ర ముపదేశించు పెద్ద లెవరు ?

అర్ధరాత్రి యైనది. కాని విజయోత్సవచిహ్నములు చెవుల దూరమునుండి పడుచునే యున్నవి.

"అకలంకస్థితి శీధుపానరుచులై
　　యాపాదు లుప్పొంగి యో
యాకర్రో యమ్మకర్రో యమక్కర్రో యది
[illegible] యట్టట్టకో యంచు బా
యక్[illegible]త్తెప్పెట్లును దళ్లెతాళములు నిం
[illegible]పై సొంపు రంజిల్లగా
జకజుంజుం జకజుంజు జుమ్మ్మనుచున్
　　సాగుం గడున్ వాద్యముల్"

అని యొక్క కవి వర్ణించినవిధముగా తప్పెట్లు తళ్లెతాళములు వినవచ్చుచున్నవి. ఆ శబ్దములు వినవచ్చుచున్నకొలదియు రుయ్యమ్మకు ఆవేగ మెక్కువయ్యెను. ప్రశాంతమగు నిశాసమయమున దూరమునుండి వినవచ్చుచున్న యీ వాద్యములు వింత యగు దడ కల్గించును. అవి యీనాడు రుయ్యమ్మగుండెలను దడదడ లాడించివేయుచుండెను.

(౩౨-వ పేజీ చూడుడు)

పహాటా - పంతీ:

శ్రావణ భాద్రపదాలు

మళ్లీ వొస్తున్నారు శ్రావణభాద్రపదాలు. సెనగలు మినప్పప్పు వగైరా దినుసులు నిలవచేసుకోవాలి. నిలవ చేసుకోవాలను కోడమే కాని ముందు దొరకాలిగా. సెనగలు కావాలంటే రేషన్ షాపుల్లో కూడా దొరకడం లేదు. చిత్రం వొచ్చినన్ని పాకిస్తాన్ నించి తెచ్చుకోవచ్చునన్నారు, ఈ మధ్య ఒక ఢిల్లీ మంత్రిగారు. అంటే ఇంకవొచ్చినట్టే ఈ యేడాదికి.

పుక్కిటికథలో శ్రావణభాద్రపదాలు మినప్పప్పుకోసం సెనగలకోసం వొస్తే, మన శ్రావణభాద్రపదాలు బియ్యం కరువుకీ, "చోడవరం ఆకలిచావులికీ," మన రాష్ట్ర మంత్రుల బీద అరుపులికీ వొస్తున్నారు.

ఈ మధ్యకాలంలో ఏ శ్రావణభాద్రపదాలూ కరువు అల్లరు లేకుండా వొచ్చి పోలేదు. ఈ మాటు ఈ ఇద్దరిపురుషులికీ తోడు మరో పెద్దమనిషి సిద్ధమయ్యారు— కొరియా యుద్ధంగారు. ఈ పెద్దమనిషి రావడంరావడం పెద్దదుమారంతో వొచ్చి లోకమంతా చుట్టి పొగల్తో నింపేశాడు. దెబ్బతో మనకి మిరపకాయలూ, నూనీ, చింతపండుధరలూ చిరాకుకొమ్మెక్కి కూచున్నాయి. యుద్ధంలో బహుశా వీటినే వాడతారేమో కొత్తనేపాళం బాంబుల్లోనూ రాకెట్లలోనూ. పోనీ మిరపకాయలు కారం కళ్లలో కొడతారనుకోవచ్చును. మరి పాత చింతపండుముద్ద కేం వొచ్చిందో తెలీదు.

శ్రావణభాద్రపదాలకి ముందే వొచ్చారు మున్షీగారు, హరికృష్ణ మెహతాబ్ గారు. వీరిలో మున్షీ గారు ఒకప్పుడు కంట్రోల్స్ ఉండకూడదనేవారు. కాని మంత్రిగారైన తరవాత మతం మార్చుకున్నారట. మతం మార్చుకోడానికి కారణంకూడా వారే సెలవిచ్చారు. అప్పుడు బాధ్యత అధికారం లేవు కాబట్టి కంట్రోల్స్ తీసెయ్యాలని అల్లరి చెయ్యడంలో తప్పు లేదుట. ఇప్పుడా రెండూ వొచ్చాయి. కాబట్టి కంట్రోల్స్ ఉండాలంటే తప్పులేదుట. అంటే మతం మార్చుకోడానికి మంత్రిపదవి మందన్న మాట. పార్లమెంటులో వేరే పని లేక కొందరు సభ్యులు మరీ అల్లరిచేసి మితిమీరి పోతున్నారు. కాబట్టి వాళ్లకికూడా ఏదో కొంచెం పసుపుకుంకం పెట్టేస్తే ఊరుకుంటారని కాబోలు ఓ పాతికమందిని, డిప్యూటీమంత్రుల్ని నియమించే విషయమై ఆలోచిస్తున్నట్లు భారతప్రభుత్వంలో కొందరు పుకార్లు పుట్టించారు. కొందరు కేవలం అందుకోసమే కనిపెట్టుకున్నారు. తనకికూడా ఏ కొద్దిపాటి వాయనమేనా ఉండక పోతుందా అని కళా వెంకట్రావుగారు రాష్ట్రశాసనసభ విడిచిపెట్టి పార్లమెంటు రంగ మెక్కబోతున్నారు. రంగాగారికి కాంగ్రెస్ అధ్యక్షపదవికి ఆశ అంతరిస్తే కనీసం డిప్యూటీమంత్రిపదవేనా లభించదా? వారు శ్రావణభాద్రపదాలకోసం కనిపెట్టు కూర్చున్నారు. ఇన్నాళ్లనుంచి దేశమంతా దుమ్ము రేగ్గొట్టి తాము సతమతమై తమ బృందాల్ని ఊళ్లూ వాడలూ తిప్పింది ఎందుకూ? వాయనం రాగానే తీసు కెళ్ళి ఎర్రగా బుర్రగా ఉన్నాడు కదా అని నిన్న మొన్నటి తిరుమలరావుగారికి ఒప్పగిస్తూంటే చూస్తూ ఊరుకోడానికా?

ఆకలిఅరుపుల్తోపాటు కంట్రోళ్ల అరుపులూ వస్తాయి. మంత్రిపదవులు వగైరా లేకపోబట్టే కాబోలు ప్రకాశం, విశ్వనాథం, వగైరాలందరు చేరి కంట్రోళ్ల సంహారానికి కత్తులు దూస్తున్నారు. ఆవేటు రాజన్ గారికి, కుమారస్వామిరాజాగారికి గోపాలరెడ్డిగారికి తగలక పోతుందా అని.

ఇంతవరకూ ప్రకాశంగారు ఢిల్లీ మొదలు మళయాళంవరకూ చిందుల్తొక్కి సాము చేస్తూ తిరిగారు కాని ఒక్కటీ గురికి తగల్లేదు, శ్రావణమేఘంమీద కత్తి దూసినట్లు. రంపచోడవరంచావులు మన్యాలు పట్టేశాయి. పోయిన వాళ్లెలా పోయారో (వాళ్లపాపాన్ని) తెలీదు గాని, వాళ్ళని పట్టుకు వేళ్లాడినవారికి శుక్రతోక పట్టి గోదావరీదినట్లయింది. ఇది శ్రావణభాద్రపదాలనే మహాపురుషుల ప్రభావం కాక పోతే మరేమిటి? ఇంక ఇప్పుడు కుమారస్వామిగారికి నిశ్చింత, ప్రతియేడూ పార్టీ లీడర్ ఎన్నికనే కర్మకాండ లేకుండా పోయింది. ఇదీ వీరి ప్రభావం కాక పోయినా శ్రావణ భాద్రపదాలవంటివారి ప్రభావమే.

అసలు శ్రావణభాద్రపదాలు ఏ కాలంలోనూ ఏ రంగంలోనూ, ఏ సందర్భంలోనూ ప్రత్యక్షం కాకమానరు. ఎక్కడ వెతికినా కనపడతారు. ఏదో పని తలపెడతారు. వీరొచ్చి తిరగదోస్తారు. తిరగదొయ్యడానికి శ్రావణభాద్రపదాల మని చెప్పుకుంటారు. ఉన్నది కాస్తా కాజేసి తలపెట్టినవారికి శృంగభంగం చేసి ముందే ఎవరూ కానకుండా చక్కా పోతారు. వర్షాల అలజడిలో భాద్రపదం ఎప్పుడు తప్పుకుంటుందో సరిగ్గా తెలియదు.

అల్లాగే ఆకలిఅరుపులూ కంట్రోల్స్ని బిగదీసే రంకెలూ, కంట్రోల్స్ని సంహరించే గర్జనలూ ఆశ్వయుజంలో చల్లారిపోతాయి. శ్రావణభాద్రపదాలు పోగా ఇంకా యుద్ధం నీడ మిగుల్తుంది.

[ఎస్సార్]

*

మనదేశం

పార్లమెంట్ *

ఢిల్లీలో పార్లమెంటు, చెన్నపట్నంలో శాసనసభ సమావేశాలు ప్రారంభమైనాయి. ఉభయసభల్లోనూ ఆహారసమస్యగురించిన చర్చ జరిగింది. పార్లమెంటులో భారత ప్రభుత్వవిదేశాంగపాలనావిధానంగురించీ, ముఖ్యంగా పండిట్ నెహ్రూ ప్రపంచ శాంతి ప్రతిపాదనలగురించీ చర్చ జరిగింది ఈమారు పార్లమెంటుకి కొత్తకళ వచ్చింది. ప్రపంచసమస్యల్ని గురించి ప్రధానమైన



రాజేంద్రప్రసాద్

చర్చ జరిగింది. సభ్యులు అంతర్జాతీయ వ్యవహారాల్లో చెయ్యితిరిగినవారనిపించుకున్నారు రిపబ్లిక్ స్థాపనానంతరం శ్రీ రాజగోపాలాచారిగారు ప్రప్రథమంగా పార్లమెంట్‌లో ఉపన్యసించారు.

కొత్త ఆనవాయితీప్రకారం ఢిల్లీ పార్లమెంట్ రిపబ్లిక్ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్‌గారి ఉపన్యాసంతో ప్రారంభమయింది చెన్నపట్నంలో రాష్ట్రశాసనసభల సమావేశాలు గవర్నరుగారి ఉపన్యాసంతో ప్రారంభమైనాయి

ఆసియాఖండంలోని దేశాలు పరస్పర సహకారం సాధించి స్వాతంత్ర్యాన్ని భద్రపరచుకోవాలని రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ సందేశ మిచ్చారు. ప్రపంచంలో యుద్ధమేఘా లావరించిన ఈ క్షణంలో భారతదేశం కర్తవ్యాన్ని బోధించారు. కొరియాయుద్ధం అన్యప్రాంతాలకు విస్తరించకుండా నివారించడానికీ, కొరియా సమస్యను తిరిగి భద్రతామండలిలో ప్రవేశపెట్టి శాంతియుతంగా పరిష్కరించడానికీ పండిట్ నెహ్రూ స్టాలిన్ ఎచిసన్‌లకు చేసిన శాంతిప్రతిపాదనలు విఫలమైనందుకు విచారం ప్రకటిస్తూ, అమెరికా కూడా నెహ్రూ ప్రతిపాదనల్ని అంగీకరించి ఉండినట్లయితే, భద్రతామండలి రెండు తీర్మానాల్నీ రష్యచేత కమ్యూనిస్టుచీనాచేత అంగీకరింపచేసి ఉండేవారని చెప్పారు.

వానదేవుడు పెడుతున్న తిప్పలు, పంటల నష్టంగురించీ చెపుతూ, దేశంలో ఆహారపరిస్థితి కొన్ని ప్రాంతాల క్లిష్టంగా ఉన్నదనీ, పరిష్కారంకోసం మంత్రులు యథాశక్తిని కృషిచేస్తున్నారనీ రాజేంద్రప్రసాద్ చెప్పారు కొత్తపార్లమెంట్‌లో కొత్త మంత్రులు, హైద్రాబాద్ సభ్యులు 16 గురు ప్రమాణస్వీకారాలు చేశారు.

రాష్ట్రపతి ఉపన్యాసంపైన జరిగిన చర్చలో ఆహారసమస్య దేశంలో రాజకీయ ఖైదీలసమస్య శరణార్థులసమస్య ముఖ్యంగా వచ్చాయి. విచారణ జరపకుండా అనేకుల్ని నిర్బంధంలో ఉంచి వ్యక్తిస్వాతంత్ర్యాలను ప్రభుత్వం మన్నించడం లేదని పండిట్ కుంజ్రూ అన్నారు. ప్రభుత్వం సమగ్రమైన వ్యవసాయకకార్యక్రమాన్ని అనుసరిస్తేగాని దేశంలో క్షామం తప్పదన్నారు. వస్తూత్పత్తిపరికరాల్ని పూర్తిగా ప్రభుత్వం వశంచేసుకోవాలనీ, అలా చెయ్యని పక్షంలో పూర్తిగా కంట్రోల్స్ తొలగించెయ్యాలనీ, అటూగాకుండా ఇటూగాకుండా ప్రభుత్వం మధ్యరకం కార్యక్రమాన్ని ఎంతగా అనుసరించ యత్నించినా వ్యర్థమేననీ ప్రొఫెసర్ కె. టి. షా అన్నారు

ఈ విమర్శల్ని పురస్కరించుకుని సర్దార్ పటేల్, మున్షీ, చింతామణిదేశ్‌ముఖ్ గార్లు సమాధానా లిచ్చారు. కులమత



సర్దార్ వల్లభాయిపటేల్

భాషావైషమ్యాలను రెచ్చగొడుతున్నవారినీ అరాచకం రెచ్చగొడుతున్నవారినీ శాంతిభద్రతలను కాపాడవలసిన ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని పటేల్ చెప్పారు ఈనాడు జాతీయైక్యతకూ శాంతికీ భంగం కలుగచేస్తున్నవారు "బ్రాహ్మణరాజ్యాన్ని స్థాపించాలని కోరుతున్న హిందూమహాసభ" వారు, భాషాప్రయుక్తరాష్ట్రవిభజనమిషతో కులమతద్వేషాలను రెచ్చగొట్ట యత్నిస్తున్నవారు, కమ్యూనిస్టులూ నని పటేల్ చెప్పారు

అయితే భాషాప్రయుక్తరాష్ట్రవిభజన సిద్ధాంతాన్ని కులమతద్వేషాలను రెచ్చగొడుతున్నవారు పంజాబ్‌లోనూ గుజరాత్‌లోనూ ఉన్నారేమో, మనకు తెలియదు కాని మన ప్రాంతంలో లేరు ఎక్కడో ఎవరో తప్పుచేస్తున్నారని ఒక ఆదర్శాన్ని విసర్జించడం, ఆ దోషాన్ని అందరికీ ఆపాదించడం పటేల్‌గారి మనోగతి సూచిస్తుంది సమస్య ఒకచోట ఉత్పన్నమైతే మరొకచోట పరిష్కారానికి యత్నించడం,

(35-వ పేజీ చూడుడు)

కథానిక:

ప్రతిజ్ఞ

శ్రీ యర్రమిల్లి చలపతిరావు
“శ్రీవత్సవ”



సాయంత్రం ఆరుగంట లవుతోంది. శారద వీథిఅరుగుమీదకు వచ్చి ఆకాశంలోకి చూసింది. ఆకాశంమీద దట్టంగా అలము కొన్న ఆషాఢమేఘాలు వడివడిగా పరుగెడు తున్నాయ్. వర్షాగమనాన్ని సూచించే చల్లని పిల్లగాలి, ఆమె ముంగురులతో సయ్యాట లాడుతోంది. ఆమె అతి వేల తనంగా ఆకాశంలోకి చూస్తూ నిలబడింది. మూర్తి ఇంకా ఆఫీసునుండి రాలేదు. రోజూ ఈపాటికే వచ్చేవారు. ఏం చెప్మా! ఇంకా రాలే దీవాళ! అనుకుంది శారద. భర్తవిషయం జ్ఞాపకం వచ్చేసరికి, అప్పటి వరకూ నిర్మలంగా ఉన్న ఆమెమానసాకాశంలో భావమేఘాలు దట్టంగా క్రమ్ము కున్నాయి. చిటపటమంటూ చిన్న పువ్వుల వర్షం కూడా ప్రారంభ మయింది.

వాకిట్లో చెంగల్వలన్నీ మొగ్గలతో పొట్టలు పగలడానికి సిద్ధంగా ఉన్నాయి. శారద మెట్లు దిగి నాలు గడుగులు వేసి ఒక చెంగల్వదో దదగ్గర నిలబడింది మొగ్గలు చూస్తూ. ఒక మొగ్గ తెంపబోయింది శారద. అప్పుడే ప్రళయనిర్ఘాతంలా ఎక్కడో పడింది ఒక పిడుగు ధనధనా మని.

పెనుగాలికి విరిగిపోయిన లేత గన్నేరు కొమ్మలా కంపించిపోయింది శారద - కెవ్వున కేక వేసి రెండు చెవులూ మూసు కుంది.

అప్పుడే, “అర్జునః ఫల్గునః పార్థః” అంటూ మెట్లెక్కి వచ్చాడు మూర్తి. “ఏం శారదా ! భయపడ్డావా పిడుగుశబ్దానికి.” అంటూ ఆమెను సమీపించాడు.

అశనిపాతంలో, కర్ణకఠోరంగా, ధ్వనించిన శబ్దానికి చెంగల్వ మొగ్గలన్నీ, పొట్టలు పగిలి ఒక్కసారిగా విడిచాయి. “చూడండి పిడుగుశబ్దానికి నా గుండెలు బ్రద్దలయాయి. చెంగల్వమొగ్గ తెంప బోయాను. పాపం ఈ చెంగల్వకన్నె హృదయంకూడా బ్రద్దలయింది. చూడండి, మొగ్గలన్నీ ఒక్కసారి ఎలా విడిచాయో” అంది శారద.

“అందుకనే స్త్రీలు కుసుమకోమలు లన్నారు. రా పోదాం” అంటూ పకపక నవ్వేడు మూర్తి. శారద, విడిచిన ఒక చెంగల్వ పువ్వును త్రెంపి, మూర్తిచేతి కందిస్తూ, “చూడండీ, ఎంత అందంగా ఉందో” అంది అమాయకంగా.

మూర్తి చిరునవ్వు నవ్వుతూ, “ఇది నీ జడలో, ఇంకా అందంగా, కనుపిస్తుంది.” అన్నాడు.

ఇద్దరూ మెట్లెక్కి లోపలికి వచ్చారు.

కుంపటిమీద కాఫీనీళ్లు త్రెళ్లుతున్నాయి. మూర్తి ఎదురుగా వున్న కుర్చీలో కూలబడి వార్తాపత్రికను ముఖానికి అడ్డంగా పెట్టుకుని వార్తాప్రపంచంలో మునిగిపోయాడు.

శారద కాఫీకలుపుతూ “ఏమండీ, జీతాలు ఇవ్వాళా ఇవ్వలేదుటండీ ?” అంది ... ప్రత్యుత్తరంకోసం యెదురుచూడ్డంలో పది నిమిషాలు గడచాయి. కాని మూర్తి జవాబు ఇవ్వలేదు. కాఫీగ్లాసు చేతి కందిస్తూ, ఏమండీ అడిగినదానికి జవాబైనా యివ్వరేం? మంచివారండీ ? ఈవేళేనా తగలేశారా లేదా జీతంరాళ్లు ?” అంది శారద.

మూర్తి కాఫీగ్లాసు అందుకుంటూ, “ఈ వాళా యివ్వకపోవాలి ? జీతంరాళ్లూ తగ లేశారు ఈ వేళతో ఉద్యోగానికీ స్వస్తి జరిగింది.” అన్నాడు.

శారద నిర్ఘాంతపోయింది. “ఏమిటీ ఉద్యోగానికి స్వస్తా !” అంది ఆశ్చర్యంగా.

“అవును. పదిహేనవతారీఖైనా జీతాలు యివ్వకపోతే యెలా యేడవడం ? నెల్లాళ్లూ ఒళ్ళు వంచి పనిచేస్తే, ఆ తగలేసే నల్లైరాళ్లయినా ఫస్టుతారీఖునాటికి ఖచ్చితంగా తగలేస్తేగాని వీల్లేదని చెప్పాను మేనేజరుతో. కాస్త సీరియస్‌గానే చెప్పాను. అతడు మాట్లాడకుండా నల్లైరూపాయిలూ ఇచ్చి, “మొదటితారీఖునాటికే జీతం దొరికే ఇంకో ఉద్యోగం ఏదయినా చూసుకోండి రేపటి నుంచి. మాకూ ఈమధ్య లాభాలు తగ్గా

యాయి అన్నాడు. తర్వాత విచారించాను నేను పొరపాటు చేశానని. మళ్ళీ అడుగుదాం అనుకున్నాను. ఇంత హఠాత్తుగా ఉద్యోగం మానిపించేస్తే ఏం చెయ్యాలని. కాని, వెధవ ఆత్మాభిమానం! అదే నా జీవితాన్ని ఇలా నాశనం చేస్తోంది. దాన్ని విడిచిపెట్టేస్తే యీపాటికి నేనూ అందరిలాగే సంపాదించేవాణ్ణి. వెధవ డబ్బు" అంటూ నిట్టూర్చాడు మూర్తి.

శారదముఖంలో కత్తివాటుకి నెత్తురు చుక్క లేదు. "పోనీ! ఇంకో ఉద్యోగం ఏదయినా దొరికేదాకా, యీ నెల్లాళ్ళయినా, ఉండనివ్వమని అడగలేకపోయారు టండీ? ఎందుకొచ్చిన అభిమానం? అభిమానం ఉంటే కూడు పెడుతుందా టండీ? ఈ తెచ్చిన నలభైరాళ్లూ, చేసిన అప్పులికి సరిపోతే, మళ్లీ ఉద్యోగం దొరికేదాకా ఏం తిని బ్రతుకుతాం? చెప్పండి? తినేతిండి అన్నం ఇలా కాళ్లదన్నుకుంటే ఏం చేసేది?" అంది.

ఆమెమనస్సులో ఊహాతరంగాలు వెల్లువలై ప్రవహిస్తున్నాయ్. రాబోయే భయంకరమైన సమస్యను ఎలా ఎదుర్కొనడమా అన్న భయం, ఆవేదనా ఆమెముఖంలో ప్రస్ఫుటంగా కనబడ్డాయి. ఒక్కసారి తన బాల్యజీవితం, తలిదండ్రులూ, ఊరూ-అన్నీ జ్ఞాపకం వచ్చాయి. తను మూర్తినే చేసుకుంటానని పట్టుబట్టినప్పుడు తండ్రి అన్న మాటలు జ్ఞాపకంవచ్చాయి. 'చూడమ్మా, వెనకాల యేమీ ఆస్కారం లేక, ఉండటానికి స్వంతఇల్లయినా లేక, రెక్కలమీద ఆధారపడి జీవించవలసిన, అతన్ని చేసుకుని నువ్వేం సుఖం అనుభవిస్తావు?'

అప్పుడీమాటలు తన బుర్రకేమీ ఎక్కలేదు. అప్పుడు తన కళ్లకి మూర్తే సర్వస్వంగా కనుపించాడు. విద్యార్థి జీవితంలోనే, మూర్తిని, శారద మనసారా ప్రేమించింది. మూర్తిని ఆమె కోరి, వలచి, ప్రేమించి, బంధువుల కెవరికీ యిష్టం లేకపోయినా పట్టుబట్టి పెళ్లి చేసుకొంది. మూర్తియొక్క ఉత్తమగుణాలూ, తెలివితేటలూ, రూపమూ ఆమెను ఆకర్షించేయి. శారద చదువుకొనేటప్పుడు ఎంతమందో శ్రీమంతులయిన యువకులు ఆమెకోసం తమ భవిష్యత్తుకి నిచ్చెనలు వేశారు. కాని శారద హృదయంలో ఎవరూ స్థానం ఆక్రమించుకోలేకపోయారు. విద్యా, రూపం, గుణాలు మూడూ మూర్తీభవించిన 'మూర్తికి' ఆమె హృదయంలో స్థానం లభించింది. మూర్తినే ఆమె తన ఆరాధ్యదైవంగా ఆరాధించింది. తలిదండ్రుల్నీ బంధువుల్నీ యావన్మందినీ కాదని మూర్తినే వివాహం చేసుకుంది. అతను ఏమీ లేనివాడనీ, రెక్కలమీద బ్రతకవలసినవాడనీ అందులోనూ గడియలని పెళ్లాడిన ఏ ఆడదీ సుఖపడలేదనీ కావలసిన వాళ్లంతా చెప్పారు. కాని ఆమె వినలేదు. రచయిత అంటే స్థిరబుద్ధి లేనివాడని ఉన్నతాశయాలు కలవాడనీ వాళ్ల భావం. ఉన్నతాశయాలు కలవాణ్ణే దరిద్రం అంటిపెట్టుకుని ఉంటుందనికూడా వాళ్ల నమ్మకం.

ఎలాగయితే నేం అందర్నీ కాదని అతన్నే పెళ్లాడింది. శారద పెళ్లి అయి మూడుసంవత్సరా లయింది. పెళ్లి అయిన మరుసటిసంవత్సరమే మూర్తి ఒక పంచదారఫ్యాక్టరీలో గుమాస్తాగా చేరాడు. బ్రాహ్మణజన్మ ఎత్తినకారణంగా బి. ఏ. ప్యాసైన తనకి అంతకన్నా గతి దొరకలేదు. ఆ వచ్చే నలభైరూపాయల జీతంతోటే క్లుప్తంగా గడుపుకుంటూ వచ్చేవారు. ఆ స్వల్పఆదాయంతోటే తృప్తిపడుతూ, అన్యోన్యంగా ఆ ఇద్దరూ ఈ భూలోకంలోనే స్వర్గం సృష్టించుకున్నారు.

మూర్తి ఉదయమే ఎనిమిదింటికి ఆఫీసుకు పోయి మధ్యాహ్నం పన్నెండు గంటలకి యింటికి చేరుకొనేవాడు. తిరిగీ రెండుగంటలకి ఆఫీసుకు పోయి సాయంత్రం ఆరుగంటలకి ఇంటికి చేరుకొనేవాడు. ఈలోగా శారద తనపనులన్నీ ముగించుకుని ముస్తాబయి వాకిట్లో మూర్తిరాకకోసం ప్రతీక్షిస్తూ కూర్చునేది. సాయంత్రందాకా పనిచేసి అలసి ఇంటికి చేరుకున్న మూర్తికి వాకిట్లోకి రాగానే కళకళలాడుతూన్న శారదచిరునవ్వుముఖం స్వాగతం ఇచ్చేది. దాంతో దినమంతా పడిన తన శ్రమంతా మరిచిపోయేవాడు మూర్తి. తను తెచ్చే జీతం చాలకుండా బ్రతకడానికి మాత్రమే సరిపోయినా, అనుకూలమయిన ఆ దాంపత్యంముందు తమకి తక్కిన లోటులన్నీ ఆనేవి కావు. ఆకలిదప్పులే ఉండేవిగావు. శారదతండ్రి కాస్త ఇంత సంపాదించినవాడే. తనకి ఆ వొక్క కూతురూ, స్కూలుఫైనల్ చదివే ఇంకో కొడుకూ తప్ప మరెవరూ లేరు. ఆయన భార్య పోయి నాలుగేళ్ళయింది. శారద పెళ్లి అయినతర్వాత ఆయన ఒకసారయినా వచ్చి కూతుర్ని చూడలేదు. తన రమ్మని కోరలేదు. కారణం, ఆ వివాహమే ఆయనకిష్టం లేదు — తనని కాదని మూర్తినే స్వతంత్రించి పెళ్లిచేసుకున్నకారణంగా తండ్రి ఇప్పటివరకూ, తన ముఖం ఎత్తి చూడలేదుగదా, కనీసం, ఉత్తరంముక్కయినా లేదు. కాని ఇప్పటివరకూ ఆ లోటూ ఏమీ కనబడలేదు. అనుకూలుడైన, అన్నివిధాలా నచ్చిన భర్తతో, ఆ వచ్చే స్వల్ప ఆదాయంతోటే, జీవిస్తూన్నా, అదే స్వర్గంలా ఉండేది.

కాని మళ్లీ తన జీవితంలో ఏదో మార్పు రానున్నదనీ, భయంకరమయిన పరిస్థితుల్ని తను ఎదుర్కోవలసివస్తుందనీ ఆమె ఊహించలేదు. అప్రయత్నంగా ఆమెకళ్లల్లో నీళ్ళు తిరిగాయి. ఆ విషయం మూర్తి గ్రహించకపోలేదు. "ఏం శారదా? ఉద్యోగం పోయిందని విచారిస్తున్నావా? నే నీపాటికి ఇంకో ఉద్యోగం సంపాదించనూ? ఏలటానికి ఊళ్లు ఉండవుగాని, ఏరుకుతినడానికి ఊళ్లు ఉండవా? సన్యాసికి ఒక పాయ్యేమిటి? ఇది గాకపోతే మరో కూలిపని? దీని కంత విచారించడం ఎందుకు? నే నప్పుడే ఇంకో కంపెనీలో మాట్లాడే ఉంచాను. రామగోపాల్, కంపెనీలో నెలకు యాభై రూపాయలు ఇస్తామన్నారు. వారంరోజుల్లో తిరిగీ చేరతాను. ఈమాత్రం దానికే విచారిస్తే ఎలా?" అన్నాడు ఆమె కళ్లల్లోకి చూస్తూమూర్తి—

శారద అతిప్రయత్నంమీద లేనినవ్వుని తెచ్చుకుని, "అచ్చే! అందు కాదండీ? మొన్న ప్లీడరుగారి పెళ్లాందగ్గర పుచ్చుకొన్న అయిదూ, పాలవాడికి పదీ, చిల్లరకొట్లో పదీ, చాకలిదానికి అయిదూ, ఇంటిఅద్దె అయిదూ ఇచ్చేస్తే మళ్లీ మీకు ఉద్యోగం దొరికేదాకా, జీతం వచ్చేదాకా, ఏం తింటాం? అదీ నా ఆలోచన" అంది.

"దాని కేమేం వెర్రిదానా? చచ్చిపోతామా? ఏ స్నేహితుణ్ణో ఎక్కణ్ణో, అడిగి బదులుతీసుకుంటాం. మొన్న నేను వ్రాసి పత్రికకు పంపిన కథకి అధనం అయిదు

రూపాయిలైనా, ఆ సంపాదకుడు పంపుతా నన్నాడు. సంవత్సరంగాబట్టి, ఆ పత్రికకి ఎన్ని కథలు వ్రాశాను! ఆమాత్రంసహాయం అతనివల్ల జరక్కపోదు." అన్నాడు మూర్తి.

"చాల్లెండి. ఈ కథలు వ్రాయడంవల్లనే మీ కీ గ్రహచారం పట్టుకుంది. ఈ దుర్వ్యసనం మానేసే మీరు ఏనాడో బాగుపడే వారు. పనవకథలు కూడు పెడతాయా, గుడ్డపెడతాయా? మీ పిచ్చిగాని. నాలుగేళ్ళబట్టి రాస్తున్నారు. కాగితాలూ, సిరా ఖర్చూ. నిద్రలేక ఆరోగ్యం పాడవటంతప్ప ఏమేనా లాభంవుందా? ఇంకా ఎప్పుడో ఏదో, ఎవరో పంపుతారని ఆశించడం? మీ అమాయకానికి నవ్వాలో యేడవాలో, అర్థంగాకుండా వుంది. ఈ మహావ్యసనానికి స్వస్తిచెప్పి హాయిగా, ఏదో ఉద్యోగాన్ని నమ్ముకొని, బ్రతక్క ఎందుకొచ్చిన కథలు చెప్పండి? నామీద ఒట్టువెయ్యండి? ఈ రోజు మొదలు కథ వ్రాసి ఏ పత్రికకీ పంప నని." అంది శారద.

మూర్తి నవ్వుతూ, "ఎందుకే అవంటే నీ కంత కోపం? ఏనాటి కయినా శ్రమ ఫలితం దక్కకపోదు." అన్నాడు.

ఇంతలోనే టపాబంట్రోతు వచ్చాడు. మూర్తి గభాలున లేచివెళ్ళి, ఒక కవరు చేత్తో పట్టుకొచ్చాడు. "ఎక్కణ్ణించండీ?" అని అడిగింది శారద. మూర్తి కవరుచించి చదవసాగాడు. క్రమంగా అతని ముఖకవళికలు మారిపోసాగాయి. ఆ ముఖంలో ఏదో ఆశ ఎంతో ఉత్సాహం కనిపిస్తున్నాయి.

"ఏమిటండీ ఆ సంతోషం? ఆ దేమిటో నాకు చెప్పకూడదూ?" అంది శారద. "ఏమీ లేదే! చూశావా? 'ఎందుకొచ్చిన కథలు, కూడుపెడతాయా' అన్నావు అవే యీనాటికి నా జీవితంలో క్రొత్తవెలుగు చూపించాయి. భవిష్యత్తుకి నిచ్చెనలు వేశాయి" – అన్నాడు.

"ఏమయిందండీ? ఏమయినా పంపుతా మన్నారా?"

"అది కాదే! నాతో చదువుకొన్నవాడే ఒక స్నేహితు డున్నాడు. బాగా డబ్బున్న వాడు. చిన్నప్పట్నించీ మా యిద్దరికీ ప్రాణస్నేహం. అతడు మద్రాసులో క్రొత్తగా ఒక వారపత్రికను స్థాపిస్తున్నాడు. అందులో నన్ను సహాయసంపాదకుడిగా ఉండమనీ, నూటయాభై రూపాయలు జీతం యిస్తాననీ వెంటనే రమ్మన్నాడు.

"ఏమిటీ" అంది శారద – ఒళ్ళు తెలియని ఆనందంలో, "రేపే నా ప్రయాణం. ఉదయం మెయిలుకే వెళ్తాను. వెళ్ళి అక్కడ వెంటనే ప్రవేశించి, నెలయిన తరువాత, జీతం తీసుకునివచ్చి నిన్ను తీసికెళ్తాను. ఈ నెల్లాళ్ళూ నువ్వు ఇక్కడ ఒంటరిగా వుండే కంటే, మీ......"

"గ్రహించాను. కాని నేను మావాళ్ళ ఇంటికి వెళ్ళలేనండి? మూడేళ్ళయింది. ఎక్కడున్నావమ్మా? ఏం చేస్తున్నావని అయినా ఉత్తరం రాయలేదు. కన్నతండ్రయినా ఏముఖం పెట్టుకుని వెళ్ళను చెప్పండి." అంది శారద.

"అదేమిటే వెర్రిదానా? ఏదో పెంచి పెద్దదాన్ని చేసిన ఆయనమాట నువ్వు విన్నావుగావని ఆయన అలా మొండికెత్తి కోపగించారుగాని. ఈవేళ కాకపోతే రేపయినా, ఆయన తన పొరపాటుని గుర్తించక పోరు. ఈలోపుగా నీఅంతట నువ్వే వెళ్ళి ఈ విషయాలన్నీ చెప్పి, నేను మద్రాసు వెళ్ళాననీ, ఉద్యోగం దొరికిందనీ, నెల్లాళ్ళలో వచ్చి తీసికెళ్తానని చెప్పు. ఆయన సంతోషిస్తారు. ఇది జీడిబొట్టు కాగుకదా? తుడిచేసుకోడానికి – ఎంత లేదన్నా కన్నతండ్రి. కూతురు గుమ్మంలో కొస్తే కాదంటాడా? నువ్వే కాస్త ఆలోచించు." అన్నాడు మూర్తి.

శారద గట్టిగా నిట్టూర్చి లోపలికి వెళ్ళి పోయింది. మూర్తి లేచి, భుజంమీద తువ్వాలు వేసుకుంటూ "అలా వీధిలోకి వెళ్ళొస్తాను – కొంచెం ఆలస్యం అవుతుంది. నాకోసం కని పెట్టుకోకు" అన్నాడు.

* * * * *

ఆ మరునాడు ఉదయం బండికే మూర్తి మదరాసు వెళ్ళాడు. వెడుతూ, వెడుతూ, "శారదా, త్వరలోనే వస్తాను సుమీ. నువ్వు అదృష్టవంతురాలివి. ఇదంతా నీ అదృష్టమూ నీ చలవే, వెళ్ళగానే వివరాలతో ఉత్తరం వ్రాస్తాను జవాబు రాయి. నువ్వుమాత్రం సాయంత్రం బండికే ఇంటికి వెళ్ళు" అన్నాడు. స్టేషన్‌కికూడా భర్తతో వెళ్ళింది శారద. మూర్తి ఎక్కిన మెయిల్, శారద నిలబడి చూస్తుండగానే వెళ్ళిపోయింది. ఆసాయంత్రం ప్యాసింజర్లో బయల్దేరి రాత్రి పదిగంటలకి తన పుట్టింటి గుమ్మంవద్ద తలుపు తట్టింది శారద – ఆయిదు నిముషాలకి తలుపులు తెరవబడ్డాయి తండ్రి వచ్చాడు. అకస్మాత్తుగా వచ్చిన కూతుర్ని చూసి నిర్ఘాంత పోయాడు. మూడు సంవత్సరాలైంది

(34-వ పేజీ చూడుడు)

"ప్రజాస్వామికమా-నియంతృత్వమా"

శ్రీ బసిరెడ్డి ఈశ్వరరెడ్డి

మానవులను క్రమబద్ధమైన పద్ధతిలో నడిపించడానికి ప్రభుత్వం తప్పనిసరి. రూసో పండితునిచే చెప్పబడిన "ప్రభుత్వమూ పన్నులూ గూఢాలూ లేకుండా అందరూ సర్వసములై అందరూ భూమిపై సమిష్టి హక్కుదారులుగా ఉండే, పరిపూర్ణ స్వరాజ్యం కేవలం కాల్పనికమే. ఈ విధంగా జరగనప్పుడు అరాజకమన్నారు పూర్వీకులు. ప్రభుత్వ మనేకవిధాలు. అన్ని విధాలూ ప్రజాస్వామిక, నియంతృత్వములనే రెండుపద్ధతులలోనే యిమిడి పోతాయ్. ప్రస్తుతం యీ రెంటినిగురించీ మనం తెలిసికొనవలెను.

ప్రజాస్వామికముల చరిత్ర అతిప్రాచీనం. ఇతిహాసంలోనికి వచ్చే కాలంయొక్క మొదటినుంచీ నేటివరకూ ప్రజాస్వామిక సామ్రాజ్యములు భారతదేశంలోనో యూరప్‌లోనో ఏదోవిధంగా ఎక్కడో ఒకక్కడ వెలుస్తూనే ఉన్నవి. యూరప్‌లో మొట్టమొదట సిటీస్టేట్లరూపంలో ప్రజాస్వామికం ప్రారంభించబడింది. అక్కడి ప్రతిపట్టణం స్వపరిపాలన చేసికొనే స్వరాజ్యం. యితరప్రపంచపరిపాలనతో దానికి సంబంధంలేదు. రాజు పేరుకు మాత్రం ఉండేవాడు. యీ సిటీస్టేట్లకన్నిటికీ ఏథెన్సు ప్రముఖమైనది. యీ నగరమే ప్రజాస్వామికమునకు పేరెన్నికగన్నది. పరిపాలనంతా ప్రజలదే. ప్రతినాగరికునకూ పరిపాలనలో సంబంధముండేది. పరిపాలనమంతా నాగరికసభద్వారా జరిగేది. 20 ఏండ్లు నిండిన ప్రతిపౌరునికీ ఓటు హక్కుండేది. యీ నాగరికసభలు ప్రతివారమూ ఏకొండచరియలోనో సమావేశమయ్యేవి. అధికారులు పరిపాలనపై ఉపన్యసించేవారు. ప్రజలు అధికారుల ప్రతిపాదనకు సమ్మతినో అసమ్మతినో తెలియజేయడంద్వారా ప్రముఖసమస్యలన్నిటినీ పరిష్కరించేవారు. యిదీ వాళ్ళ ప్రజాస్వామికం. కానీ శతాబ్దాలుగా ఏథెన్సులో నివసించినా, ఏథెన్సు తల్లిదండ్రులకు పుట్టని విదేశీయులకూ, వేలకొలదిగా ఉన్న బానిసలకూ పాలనలో సంబంధమూ పౌరసత్వ హక్కూ ఏమీ ఉండేవి కావు. ఏథెన్సు ప్రజాస్వామికంలో పరహితం లేకుండినా యూరప్ ప్రజాస్వామికానికంతటికీ నాందీ ప్రస్తావనవంటి దాని మహత్త్వం గణుతింపదగినది. ఏథెన్సుతరువాత రోం. ఇదికూడా సిటీ స్టేటు. కాని రోం ఏథెన్సు అంతటి ప్రజాస్వామికం కాదు. సెనేట్, నగరసభలద్వారా పరిపాలన జరిగినా రాజులకుమాత్రం, విపరీతాధికారం ఉండేది. ఉద్యోగాలద్వారా దేశసేవా ఘనమైనకీర్తిని సంపాదించిన రిటైర్డు ఉద్యోగులందరూ సెనేట్‌సభ్యులై రాజులకు సలహాలిస్తూ పరిపాలనలో పాల్గొనేవారు. దండయాత్రల వంటి ప్రముఖవిషయాలలో రాజు ఓటింగు ద్వారా ప్రజాభిప్రాయమును తెలిసికొనేవాడు. న్యాయమూర్తులు ఓటింగు జరిపేవారు. రాజుల ప్రతిపాదనకు "ఔను, కాదు" అని అభిప్రాయము వెలిబుచ్చడంవరకే ప్రజలబాధ్యత. యిదీ రోం ప్రజాస్వామికం. ఇక భారతీయప్రజాస్వామికమును గురించీ గణతంత్రరాజ్యముల ఔన్నత్యమును గూర్చీ పూర్వమొకవ్యాసంలో నివేదించాను. ఐతిహాసికకాలంనాటి ప్రజాస్వామికమునకు యీ మూడు దేశములే ఆధారం. తక్కిన దేశచరిత్రలలో ప్రాచీనప్రజాస్వామికమునకు నిదర్శనములు కన్పించినా అవి అన్నీ ఏవో కొన్ని వర్గములకూ కులములకూ మాత్రమే సంబంధించినవి.

నిరంకుశత్వమూ ప్రజాస్వామికంవలె ప్రాచీనమైనదే. ఈ వ్యవస్థలో ప్రజల భావాలకు అభిప్రాయాలకు ఎక్కువస్థానముండదు. ఒక వ్యక్తికే సర్వాధికారాలు కల్పించబడును. అతనిని రాజుగానో నాయకుడుగనో ఉంచుకొందురు. అతనిలో అసామాన్యమైన దైవశక్తులనుకూడా ఆరోపింతురు. హిందువులతనిని, "నావిష్ణుః పృథివీపతిః" అంటారు. యూరపియన్లతనిని దైవదత్తాధికారం ద్వారా పాలించే మహిమోపేతుడంటారు. రాజు దైవాంశసంభూతుడనడానికనేకమైన కథలనుకూడా కల్పించారు. బాబిలోనియా చక్రవర్తి హమ్మురైరిగారికి సూర్యదేవత పరిపాలనచేయడానికి గాను న్యాయశాస్త్రములన్నిటినీ యిచ్చెనట. గతంలో మధ్యయుగంనాడుకూడా అనేకమంది రాజులు తమ మాటనే శిరసావహించవలసినదనీ తామే దైవాంశసంభూతులమనీ శాసించారుకూడా. లింకన్ గవర్నమెంటు ప్రజలది. ప్రజలచే, ప్రజలకొరకు, అంటే బిస్మార్కు "ఉపన్యాసాలద్వారా మెజారిటీ తీర్మానాలద్వారా వచ్చేదేమీ లేదు. నిరంకుశత్వం ఉండవలసినదే అంటాడు. యీ రాజులలో ప్రజలను చల్లగా కాపాడిన అశోకుడు ఫెడరిక్ ది గ్రేట్‌వంటి సమగ్రశాసకులూ ఉన్నారు కానీ తమ విచిత్రోన్మాదాలకు ప్రజాశ్రేయస్సును బలియిచ్చిన ఔరంగజేబువంటి ప్రపంచకళ్యాణవిధ్వంసకులూ విశ్వాన్నే కబళించటానికి అపారప్రజాక్షతిని కల్గించిన అలెగ్జాండర్ నెపోలియన్లవంటి స్వార్థపరులే ఎక్కువ. రాజుల అధికారం ప్రజల అజ్ఞానంపై ఆధారపడిఉంటుంది.

ఒక్కొక్కసమయంలో వ్యక్తినిరంకుశత్వంకూడా అత్యవసరమే. దేశం విషయమై తమ బాధ్యతనూ కర్తవ్యాన్నీ తెలిసికొనని ప్రజలుకల దేశానికి నియంతృత్వమే పనికివస్తుంది. ప్రతివిషయంలోనా పూర్తిగా వెనుకబడిన దేశాలకూడా ఒక్కొక్క సమయంలో నియంతృత్వం అవసరమే కావచ్చు. పూర్తిగా అజ్ఞానాంధకారంలో ఉండే ఏ రాజ్యమైనా కలకాలం తన స్వాతంత్ర్యాన్ని నిలుపుకొనలేదు. ప్రజాదరణ పొందిన పలుకుబడిగల వ్యక్తులు అవకాశం లభించగానే భవిష్యత్తును దూరంగా ఆలోచించలేని దేశవాసుల సహకారంతో తామే నియంతలై కూర్చొంటారు. ప్రతిదేశంలోనా యిటువంటి సంఘటనలు జరిగినవి, జరుగుచున్నవి.

రోమ్‌సీజర్ ద్వారాను గ్రీసు ఫిలిప్ ద్వారాను ప్రజాస్వామికాని కంతమొందించుకొనడం యిదే విషయాన్ని రుజువుచేస్తున్నది. వ్యక్తి పరిపాలనవల్లనగలిగే భయంకరదుష్ఫలితము లెన్ని యుండినా కొన్ని సుగుణములుకూడా లేకపోలేదు. గతంలోని చరిత్ర చాలాభాగం యీ నిరంకుశప్రభువులదే కానీ యీ చరిత్ర నంతా తుచ్ఛమని తిరస్కరించలేము. వ్యక్తి ప్రాధాన్యమును గుర్తించినంతకాలం నియంతృత్వభయం తప్పనిసరిగా ఉండితీరుతుంది. నియంతృత్వ, ప్రజాస్వామికములలోని భేదములు సుస్పష్టమే. కానీదూరదృష్టి లేకపోవడం మానవసహజం. ఒక కాలంనాటి మానవుల పొరపాట్లనూ లోట్లనూ తరువాత పుట్టే చరిత్రకారుడు తెలిసికొనునేగానీ ఆకాలంనాటి మానవుడు తెలిసికొనలేడు. అందువల్లనే ప్రజలు తమ కేది కావాలో తామే తెలిసికొనలేకపోవడంవల్ల ఐతిహాసిక సమయంలో అనేక దుష్ఫలితములు సంభవించినవి. ఫ్రాంసలో ప్రజలు చక్రవర్తి నిరంకుశత్వం పనికిరాదన్నారు. లూయిస్ చక్రవర్తినీ రాజవంశీయులనూ ప్రజలు నిర్దాక్షిణ్యంగా చిత్రవధ చేశారు. ప్రజాస్వామ్యాన్ని స్థాపించుకొన్నారు. యీ విషయాలన్నీ మరచిపోకపూర్వమే ఉద్భవిస్తుండే మరొక్క నిరంకుశత్వానికి నెపోలియనుకు స్వాగతమిచ్చారు. నిరంకుశత్వాన్ని నిష్కరుణత్వంతో అంతమొందించిన తామే తమ చేతులతోనే యింకా భయంకరమైన మరొక్క నిరంకుశత్వానికి నీరాజనాలివ్వడం అపహాస్యాస్పదమని వారు భావించలేదు. యింగ్లండులోని ప్రజాస్వామ్యవాదులు రాజునిరంకుశత్వం పనికిరాదన్నారు. విప్లవంచేసి విజయులై చార్లెస్ రాజును బంధించి ఉరిదీశారు. తరువాత వాళ్ళ సేనానాయకుడే క్రామ్‌వెల్ స్వయంగా నియంతయైపోయి వాళ్ళ ముఠాను పార్లమెంటును రద్దుచేసి వాళ్లనే కుక్కలన్నాడు. క్రామ్‌వెల్ చావగానే తండ్రిని నిరంకుశుడని ఉరిదీసిన ప్రజలు కొడుకు చార్లెస్‌ను ఏరికోరి పట్టంగట్టి నిజమైన రాజభక్తులవలె అతని అవకతవక లన్నిటినీ సహించుకున్నారు. యీ విధంగా ప్రజాస్వామికనియంతృత్వముల పునరావృత్తులు చరిత్రలో సాధారణమే.

నియంతృత్వము లనేక విధములు. అన్నిటికంటే వ్యక్తి నిరంకుశత్వమూ సంఘ నిరంకుశత్వమూ ముఖ్యమైనవి. అన్నిటికంటే వర్గ నిరంకుశత్వం భయంకరమైనది. వర్గ నిరంకుశత్వంవల్ల కలిగే దుష్ఫలితాలను గతచరిత్రలో చూచాం. యిప్పుడూ రష్యాలో చూస్తున్నాం. ఒకని నిరంకుశత్వమును సహించుకొనవచ్చునుకానీ పదిమందినిరంకుశత్వమును సహించడము దుస్తరం. ప్రాచీన కాలంలోకూడా ప్రజాస్వామ్య దేశపాలకులు అభిజాత్యగర్వంతో గర్విష్టులై వర్గనిరంకుశత్వమును చలాయించినందుననే ఒకటో రెండో నిలిచిన ప్రజాస్వామ్య ప్రభుత్వములునూ నశించిపోయినవి. వర్గనిరంకుశత్వముద్వారా ప్రజలు దుర్భరమైన పరాధీనతను పొందే అవకాశము లున్నవి. ప్రజాస్వామ్యంతరువాత రెండవది నిరంకుశత్వమే. పరనిరంకుశత్వాధీనమై మానవుని కొనఊపిరంకంటె అతిప్రధానమైన స్వాతంత్ర్యమును కోల్పోయిన దేశం శాశ్వతంగా చైతన్యరహితమైన మానవయంత్రపాలనతో క్రుంగిపోతుంది. కనుక వర్గనిరంకుశత్వ మెప్పటికీ అవాంఛనీయం.

మనం ప్రాచీనకాలంనాటి నిరంకుశ ప్రజాస్వామిక రాజ్యాలను పూర్తిగా వర్గీకరణచేయ ఆనాటి ప్రభుత్వాలకు యీనాడున్న సమస్యలూ సౌకర్యాలూ లేవు. ప్రజాస్వామిక రాజ్యాలు నిర్మించబడేవి. ప్రజాధిపతులే రాజ్యపాలకులయ్యేవారు. కాని కొంత కాలానికే ఆ అధిపతులే రాజు లయ్యేవారు. వాళ్లు నిరంకుశత్వం చేయడం ప్రారంభించగానే వేరుని తొలగించినట్లు తొలగించి యింకొకరి స్థానంలో కూర్చోబెట్టేవారు. కొన్ని రాజ్యాలేనాడూ ప్రజాస్వామికాన్ని చూచియుండలేదు. కొన్ని చూచీ నిలుపుకొనలేకపోయినవి. పూర్వం వ్యక్తిపరిపాలనే ముఖ్యమైనా ఏ వ్యక్తీ అంత తెంపరి రాజైనా ప్రజాభిప్రాయాన్ని తిరస్కరించలేదు. స్వయంగా దైవాంశోద్భూతులమని చెప్పుకుంటూ కూడా వారు ప్రతిరాజ్యాంగ విషయాన్నీ, పరిస్థితినీ, ప్రజాభిప్రాయాన్నీ చూచి అమాత్యుల సహాయంతో పరిష్కరించేవారు. కాని వర్గనిరంకుశత్వంలో యిది అసంభవం. ఆధునికనిరంకుశత్వానికీ నేటి నియంతృత్వానికీ ఉన్న భేద మిదే.

వర్తమానయుగం బుద్ధివాదంది. విశ్వాసములను విడిచి ఆలోచనల శరణుజొచ్చిన కార్యశూరులది. సమత్వం స్వాతంత్ర్యం యీనాటి మానవుని ప్రాథమికహక్కులు. ఆభిజాత్యగర్వం వంశబద్ధమైన పాలనాధికారం గడచిపోయినకాలంనాటి విషయములైపోయినవి. యోగ్యతనుబట్టి వ్యక్తి విలువ నిర్ణీతమైనది. వ్యక్తినిరంకుశత్వం అసభ్యతాచిహ్నంగా భావించబడుతున్నది. ప్రపంచం మానసికంగా ఎక్కువ పురోగమించినందువల్ల సౌష్ఠవమైన ప్రజాస్వామికమునకు నెలవేర్పడినది. ప్రపంచములో అత్యధికభాగం ప్రజాభిప్రాయబద్ధమైన ప్రభుత్వములచే పాలించబడుచున్నది. 'సంఘే శక్తిః కలౌయుగే' అనుసూక్తి సార్థకమైనది. రాజ్యాంగంలో రాజుకు స్థానమున్నా బ్రిటన్‌లోవలె కేవలం నామమాత్రానికే. కానీ వ్యక్తిగతనిరంకుశత్వాన్ని నిరసించే దేశాలే సంఘబద్ధమైన నిరంకుశత్వాన్ని పాటిస్తున్నవి. అభిజాత్యతయే అసహ్యమైన రష్యాపార్టీయొక్క సర్వోత్తమత్వం న్యాయమైనది. సమత్వసూత్రానికి విరుద్ధమైన అర్థములు కల్పించబడినవి. పూర్వం బలవంతులైన రాజులు తమ రాజ్యకాంక్షకు చిన్నరాజులను ఆహుతిచేస్తే నేడు వృద్ధినొందిన రాజ్యాలు వికసించని రాజ్యాలను ధర్మకర్తృత్వం న్యాయంమొదలైన పెద్ద పేర్లతో కబళించివేస్తున్నవి. అగ్రరాజ్యాల కుత్సితాలను చూస్తే నాడూ నేడూకూడా బలవంతునిదే రాజ్య మనిపిస్తున్నది. కానీ యిది పరిణామయుగం. మనంకూడా రూసోవలె భవిష్యత్తులో నిరంకుశత్వరహితమై లోపరహితమైన పూర్ణ ప్రజాస్వామికం ప్రపంచమంతటా ఏర్పడునని ఆశిద్దాం.

సాలెపట్టు

మూలం :
నర్గీష్ కొథవాలా

అనువాదం :
శ్రీ జి. లక్ష్మినారాయణ

వీధితలుపు కొట్టుతున్నచప్పుడు అకస్మాత్తుగా వినిపించటంతో కుమార్ పండిట్ ఆశ్చర్యపోయాడు. పుస్తకం పక్కన పెట్టి కుర్చీలో కూర్చున్నవాడల్లా లేచాడు. ఇల్లాంటి వేళ కానివేళ వచ్చింది. ఎవరై వుంటారు! తలుపు తీయటానికి ప్రయత్నం చేసే, మళ్లా చిన్నగా త్వరత్వరగా తలుపు తట్టుతున్నచప్పుడు వినిపించింది. త్వరగా వెళ్ళి తలుపు తీశాడు. కాని అతనెంత ఆశ్చర్యపోయిందీ, కనపడకుండా ఒకయువతిని చూడటంలోనే తెలుస్తున్నది.

'నేను లోపలికి రావచ్చునా!' మృదువుగా అడిగిందా యువతి.

కుమార్ కళ్లు చెదిరినై. 'పొరపాటున ఎవరిల్లో అనుకుంటున్నారో..' అని ఇంకా ఏదో చెప్పబోతూంటే వేటకాడు తరుముతున్న లేడిలా తనభుజంమీదుగా వీధిలోకి దృష్టిసారించి; వెంటనే జారుకుంది గదిలోగి. వైగా తలుపు వేసింది. కుమార్ ఆశ్చర్యానికి అంతులేకపోతున్నది. ఆ యువతిని పరిశీలనగా చూశాడు. చిన్న మనిషి, మృదువుగా కుదురైన రూపం మెత్తటి నల్లటి వంకుల జుట్టు. విశాల నేత్రాలు. ఆకుపచ్చపట్టుచీర కట్టుకున్నది. చేతిలో లెదర్ బ్యాగు. ఆమె మాట్లాడతుందేమో చూచాడు కాని ఆమె ఏమీ పలకక పోయేసరికి, అతనే ప్రారంభించాడు.



'సరే, లోపలికి రానే వచ్చావు! కూర్చోతే. నీ వెవరో, ఎందుకిలా వచ్చావో తెలుసుకోవచ్చా?'

నిమిషకాలం నిశ్శబ్దంగా వుండి తడబడుతూ అన్నదామె: 'కాసేపు మీ యింట్లో తలదాచుకోవటానికి దయవుంచి ఆశ్రయమిస్తారా?'

'ఆశ్రయమా! తల దాచుకోవటానికా" ఏమొచ్చింది?' ఆశ్చర్యంగా అడిగాడు కుమార్.

'ఆఁ - ఏం లేదు, ఏమీ లేదు.. వాన.'

'వానా?' కుమార్ పండిట్ పరిశీలనగా చూశాడు, ఆమె కట్టుకున్న పట్టుచీరకేసి. పూర్తిగా పొడిగానే వుంది. 'వాన లేదే!' అన్నాడు.

'లేదు, లేదు... తుఫాను వచ్చేట్లుగా వుంటే... ఇబ్బందిపడతానేమో నని...' ఆమెముఖంలో ఆందోళన స్పష్టంగా కనిపిస్తోంది.

కుమార్ కిటికీదగ్గరికి వెళ్లి బయటికి వంగి చూశాడు. ఊహుఁ. వానచుక్క ఒక్కటే లేకపోతే! బాగా నక్షత్రాలు మెరుస్తూంటే! 'అబ్బే, ఏమీ...' అంటూ వెనక్కి తిరిగాడు. ఆందోళన, వికారం స్పష్టంగా పూర్తికట్టిన ఆమె ముఖం చూసి, వెంటనే ఆగాడు. తెలతెలపోతూన్న ఆ

యువతి చిన్న ముఖం, తీర్చిదిద్దినట్లు కనిపించే కనుబొమ్మలు, బ్యాగును పట్టుకున్న సీతాకోకచిలుక రెక్కల్లాంటి చేతులు... ఇలా కనిపించటంతో కుమార్ పండిట్‌కు అదోలా అనిపించింది. అందమైన ముఖభంగిమ చూడటంతోనే విరహతాపం అనుభవించే రకం కాదు కుమార్ పండిట్. పైగా సరిగా చెప్పాలంటే ఆమె అందకత్తె కాదు. కాని ఏమిటో అదోవిధమైన ఆకర్షణ ఆమెలో వుంది.

'నీవు ఎందుకు వచ్చింది చెప్పటం అంత యిష్టంలేకపోతే చెప్పటం మానేయ్ లే. సరే, ఆ కుర్చీలో కూర్చో!' కిటికీదగ్గర వున్న కుర్చీ చూపెట్టి అన్నాడు.

'మీరు మరోలా అనుకోకుంటే మరో కుర్చీలో కూర్చుంటా. కిటికీదగ్గరగా కూర్చుంటే ఈదురుగాలి.' అన్నదా యువతి.

'ఈదురుగాలా?' కిటికీకేసి చూశాడు. ప్రశాంతమైన రాత్రి. పట్టుతెరలుకూడా చలించటం లేదు. 'సరే, నీ యిష్టం' అన్నాడు కుమార్.

'మిమ్మల్ని ఇబ్బందిపెట్టటం నాకు కష్టంగానే వుంది. ఇల్లు చాలాదూరంలో వుంది. ఇప్పటికే అలసిపోయాను?'

'నీ తల్లిదండ్రులతో వుంటున్నావా?' మరేమీ తోచక అడిగాడు.

'బాబాయియింట్లో...' అని ఆమె మొదలుపెట్టి 'కాదు కాదు మా అన్నయ్య యింట్లో వుంటున్నాను.' అంది.

కుమార్ 'నీ సంగతి పసికట్టానే.' అన్నట్టుగా చిరునవ్వు నవ్వాడు. అబద్ధాలు చెప్పటంకూడా చేతకాదే, అనిపించింది కుమార్‌కు.

'సరే! బాబాయో లేక అన్నయ్యో తేల్చుకుని చెప్పు. అది కాదు పిల్లా; ఏదైనా చెప్పదలచుకున్నప్పుడు, ముందుగానే ఆలోచించుకోవాలి!'

కాసేపు నిశ్శబ్దంగా వుండి, కుమార్ తనలో తాను అనుకున్నట్టుగా 'ఒక్క అబద్ధం చెప్పటానికి నూరు అబద్ధాలతో సాలీడుగూడు అల్లాలి!' చిన్నగా అన్నాడు.

ఆ యువతి పెదవులు వణికినై. బిగ్గరగా నిశ్వసించింది. కుమార్ పైకే అన్నందుకు నొచ్చుకున్నాడు.

'క్షమించు! నిన్నిలా వేయిప్రశ్నలు వేసి బాధపెట్టను లే!... కాఫీ తీసుకుంటావా? ఈ వేళప్పుడు నా కలవాటు. నౌకరుకుర్రాడు అప్పుడే గుర్రుపెడ్తుంటాడు. అంచేత స్వయంగా నేనే పెట్టుకుంటాను.'

ఆ యువతి వంటింటిలోకి కుమార్‌ని అనుసరించింది. కాఫీ కాచటంలో సాయం చేసింది. ఇప్పటికి ఇద్దరిమధ్యా దూరం తగ్గి పాతస్నేహితుల్లాగానే మాట్లాడుకుంటున్నారు. కాని ఆ యువతి అలా ఎందుకు వచ్చిందనేవిషయం మాత్రం మళ్లా రాలేదు.

కాఫీ తాగినతర్వాత ఆమెముఖం ప్రకాశించింది. ఆమె మందహాసం చేసింది. చెక్కిళ్లు గుంటలు పడినై. —ఎన్నడూ ఏ యువతీ కుమార్‌ను ఇలా ఇంతగా ఆకర్షించలేదు. ఆ మందహాసమూ, తనపై ప్రసరించే ఆతియ్యటిచూపు—ఆయువతీ తనంటే మంచిఅభిప్రాయమే కలిగినట్లుంది. ఆ కుదురైన చిన్న ఆకారాన్ని చూస్తుంటే తనే ఆమెను రక్షించాల్సినట్లు; ఆమెకు కలిగిన సమస్యలన్నీ తనే తీర్చాల్సినట్లు భావించాడు కుమార్. కాని ఆమెను మళ్లా అడగలేదు, పాతప్రశ్నలు—ఆ విచారముద్ర ఆ ముద్దుముఖాన కనిపిస్తోందేమో నన్న భయమే.

హఠాత్తుగా డోర్ బెల్ వినిపించింది. కాఫీకప్పు జారవిడుస్తోందేమో నన్నంతగా ఆమె నిశ్చేష్టురాలయింది. ముఖం వివర్ణమైంది. 'పోలీస్!' అన్నది భయంగా.

'పోలీసా!' కుమార్ ముఖంలో తీవ్రత కనిపిస్తోంది. 'ఏమిటి గొడవంతా?' అన్నాడు.

పెదవి కొరుక్కుంటూ మాటలకోసం తపబడింది ఆమె. "అంతా యిప్పుడు చెప్పటానికి వీల్లేదండి. దయవుంచి, దయవుంచి రక్షించండి. ఇక్కడ ఎక్కడైనా దాక్కోమంటారా?' అంటూ పక్కగదిలోకి వెళ్లింది.

మళ్ళా డోర్ బెల్ వినిపించింది. కుమార్ వెళ్లి తలుపుతీశాడు. లావాంటి పోలీసొకడు లోపలికి ప్రవేశించాడు.

'మిమ్మల్ని ఇబ్బందిపెట్టున్నానేమో; క్షమించండి! ఎవరైనా ఆడమనిషి లోపలికి వచ్చిందండి?'

క్షణకాలం కుమార్ ఆలోచించాడు... ఆందోళన, విచారం వుట్టిపడే ఆమెముచ్చటైన ముద్దుముఖం తనకళ్ళ యెదుటగా కనిపిస్తోంది. రక్షించమని ప్రార్థించటం తన చెవుల్లో గింగురుమంటోంది.

'నన్నలా అడగటమే....' నిస్సందిగ్ధంగా అన్నాడు కుమార్.

'నాకు తెలుసండి! కాని ఈ వీధిలో వున్నవాళ్లందర్నీ అడుగుతున్నాం. ఎంతో దూరం వెళ్లివుండదు. ఇక్కడిక్కడే ఎక్కడో తలదాచుకుంటుంది కాసేపు. అయితే ఏ ఆడమనిషీ ఇటు రానట్టేనాండి?'

మళ్లా కుమార్‌కు సమస్య వచ్చింది...ఆ యువతి రక్షించమని ప్రార్థేయపడటం చెవుల్లో మారుమ్రోగుతోంది. 'నే చెపుతున్నాగా; నే నీలాంటిరకం కాదని నా జీవితం యింతవరకూ ఏ ఒడుదుడుకులు లేకుండానే సాగిపోతున్నది. ఎప్పుడన్నా మా యింటికి వస్తూ పోతూ వుండేది ఒక్క మా చెల్లెలే.'

'క్షమించండి. నాపని నేను చేస్తున్నాను. మీ ఖ్యాతి వినివుండే మీయిల్లు సోదా చెయ్యటం అనేది పెట్టుకోదలచుకోలేదు.' అని నమస్కరించి వెళ్లిపోయాడు.

తలుపు మూశాడు కుమార్. పోలీస్ పాదధ్వని అంతకంతకూ దూరమై తగ్గిపోతోంది. నెత్తిన బరువు తీసినట్లుగా నిశ్వసించాడు.

పోలీసు అంతగా గట్టిపట్టు పట్టనందువల్ల సరిపోయింది.

'రా, వెళ్లాడు లే!' మృదువుగా అన్నాడు.

అటూ యిటూ అనుమానంగా చూస్తూ, మెల్లిగా వచ్చింది ఆమె. 'మీకు నా కృతజ్ఞత ఎలా తెలియపర్చాలో తెలియటం లేదు. అంటూ అతనిచేతులు పట్టుకుంది. వణుకుతున్న చేతిలోంచి బ్యాగ్ జారిపడి, తెరచుకుంది. కుమార్ వంగి, తీసియివ్వబోతూ, నగలూ, రిస్టువాచీ దానిలో చూశాడు. ఆమె అతనిదగ్గిర్నుంచి తీసుకుంది. కుమార్ ముఖంలో తీవ్రత కనిపిస్తోంది.....పోలీస్ ఎంతోదూరం వెళ్లివుండడు. పిలిచి రిపోర్టుయిస్తే...అతని ఆలోచనను ఆమె మృదుసంభాషణ ఆపింది.

'మీ రంటే చాలా దయగా వుంటున్నారు. మీ ఋణం ఎలా తీర్చుకుంటానో?' —ఆమెకేసి చూశాడు కుమార్. ఆ విశాల నేత్రాలు, ఆ ముచ్చటైన ముద్దుముఖం, ఏమిటో మళ్లా ఆకర్షణకు లోనయ్యాడు.

'ఈ గొడవ కాస్త తగ్గనీ. కాసేపు కూర్చొని వెళ్దువుగాని ఈసారి మైదానం అడ్డంబడిన దాటిపోగూడు గాని...నిన్ను పోలీసులు

ఎందుకు వెదుకుతున్నారో నీవేమీ చెప్ప నప్పటికీ నీకు సాయంచేస్తున్నా...'

'క్షమించండి, మీకు చెప్పాలనే వుంది. కాని...కాని నన్ను ప్రశ్నించకండి' ఆ యువతి కనురెప్పలు ఆర్పింది. కనబొమ్మలు తిప్పింది.

ఆ సమాధానంతోనే కుమార్ సంతృప్తి పొందవలసివచ్చింది. 'ఓవిధమైన ఆలోచనలు బయలుదేరినై. అమ్మో ఏమో పోలీసులు తన కోసం ఎందుకు వెదుకుతున్నదీ,-ఆ రహస్యం చెప్పదు. పోలీసులా ఆమె కోసం తీవ్రంగా శోధిస్తున్నారు. తన యింట్లోంచి వెళ్లగానే, ఎక్కడికి వెళ్తుందో, ఏమి చేస్తుందో తనకి తెలియదు. తన జీవితంలోకి ఎంత అకస్మాత్తుగా వచ్చిందో అంత హఠాత్తుగాను అంతర్ధానమౌతున్నది. ఈ కొద్ది కాలంలోనే ఏ యువతీ చేయలేని పని చేసింది. తనని ఆకర్షించి, తన హృదయాన్ని ఆక్రమించింది.

'మనం మళ్లా కలుసుకునే అవకాశాలు లేవా?' కుమార్ అడిగాడు.

'మిమ్మల్ని మళ్లా చూడటం నా కిష్టమే కాని ఏమో చెప్పలేను'

'నన్ను నమ్మలేవా? ఇంతవరకూ పరీక్షలో నెగ్గలేదూ? ఏమీ లేదు. నీ స్నేహం పోగొట్టుకోవటం నాకు కష్టంగా వుంది. మళ్లా మనం ఒకరినొకరు చూసుకునే...' ఆ యువతిచేయిపట్టుకుని చెప్తుంటే అతని కళ్ళల్లో జ్యోతులు వెలిగినై.

ఆ యువతి మెల్లగా నవ్వుతూ అంది. 'మిమ్మల్ని నమ్మకపోవటం కాదు. నమ్మకుండా ఎలా వుంటాను? మీ పరిచయం ఇంతటితో ఆఖరవటం నాకూ యిష్టం లేదు. ...రేపు రండి!'

'ఎక్కడికి?' ఆనందంతో ఆత్రుతగా అడిగాడు అతను.

'మీకు తెలుసుగదూ, ప్రతాప్ బిల్డింగ్స్... ఆ చివర కొత్తగా కట్టేరు. అక్కడో మూడు రోజులు మా స్నేహితురాలిదగ్గిర వుంటాను. రేపు సాయంకాలం నెంబరు మూడు గదికి రండి. నన్ను చూడవచ్చు... అంతా సక్రమంగా గడిస్తే...'

'అంటే పోలీసులు పట్టుకోకుండా వుంటేననా?'

విచారపూరితమందహాసంతో తల వూపింది. 'నేను చిక్కుల్లో పడ్డాను. ఊఁ. కాని వ్వండి!... సరే నే వెళ్లాలి, ఇహ లేచి తలుపుతీసి వెళ్ళింది. కుమార్ తనూ వచ్చి దిగబెడతానంటే అనంగీకారం చూపి, కృతజ్ఞతాసూచనగా కరస్పర్శ చేసి వెళ్ళింది.

ఆమె కూర్చున్న కుర్చీలో కూర్చుని ఆలోచనలో నిమగ్నుడైనాడు... ఈ రాత్రి వేళ ఎంత వింతయిన సంఘటన జరిగింది! పోలీసులు వెదుకుతున్న స్త్రీనే తను కలుసుకుని ప్రేమించాడు! ఏమో ఎవరికి తెలుసు. దీని కంతా ఏదో కారణం వుండివుంటుంది. సమయమొస్తే చెప్పకుండా వుంటుందా...'

మర్నాడు ప్రొద్దున్న కాఫీకప్పు పుచ్చుకుంటూవుంటే ఓవిధమైన ఆనందం అతనిలో ఝల్లున ప్రవేశించింది. తనజీవితమార్గం ఇలా మలుపుతిరుగుతుందని ఎన్నడూ అనుకోలేదు. ఆనాటిసాయంకాలంకోసం ఎంతో ఆత్రుత పడుతున్నాడు కుమార్. తనకు ఆమెపేరైనా తెలియదు. ఈసారి కలుసుకున్నప్పుడు తప్పకుండా ఆమెనుగురించిన విశేషాలన్నీ సేకరించాలి. మరెందుకో కాదు. వీలైతే ఆమెకు చేతనైన సాయం చేయటానికే.

కాఫీ త్రాగుతూ అవ్వాళ్టి పత్రికలోని ముఖ్యమైన శీర్షికలు చూస్తూ పేపరు తిప్పుతున్నాడు. "కాశ్మీర్ సమస్య - సర్ ఓవెన్ డిక్సన్ ఇండియాకు రాక." వగైరాలు. అలా పైపైన చదువుతూ, ఉన్నట్లుండి నిటారున కూర్చున్నాడు. 'అమర్ అజిత్ వీధిలో హత్య' అని చూశాడు. అమర్ అజిత్ వీధి? తను వుండేవీధే. ఆ శీర్షిక క్రింద వున్నదంతా చదివాడు. 'అమర్ అజిత్ వీధిలోని నగలవర్తకుడు రూప్ నాథ్ జరిగినరాత్రి హత్యచేయబడ్డాడు. అతనిదగ్గిర్నుంచి ఒక నగలసంచి దొంగిలించబడ్డది. హత్యచేసింది స్త్రీ అని ఇక్కడివారంతా భావిస్తున్నారు. రివాల్వరు మోగిన శబ్దం వినిపించినప్పుడు వారు చూడటానికి వచ్చారు. ఒకస్త్రీ పారిపోతూవుండటం గమనించారు. పోలీసులు వెనువెంటనే చుట్టుప్రక్కలప్రాంతాల ఇళ్లు కూడా సోదాచేశారు. కాని ఇంతవరకూ హంతకురాలినిగురించిన విశేషాలు ఏమీ తెలియరాలేదు.

వణుకుతున్న చేతులతో పత్రిక పక్కన పెట్టాడు...రాత్రి తనతో పరిచయ మేర్పడిన స్త్రీ రహస్యగాథ కొంస్తా బయట పడిపోయింది. అబ్బ, తనెప్పుడూ ఆ స్త్రీ

మాకాదిమహాకవులు కొందరు భగవత్సాక్షాత్కృతిప్రేరిత కృతికర్తలు. రాజసన్మాన ఋణము తీర్చుకోవలెనని రచనకుపక్రమించి బాణాదుల వంశము చాల జనాభాకలిగినది.

ప్రాకృతాంధ్రమహాకవి గుణాఢ్యుని గుణాఢ్యభారతికి రాజతిరస్కారము పురస్కారహేతువైనది. రాజు రాణుల పట్టుదల అప్రాకృతగ్రంథము బృహత్కథామంజరిగా కథాసరిత్సాగరముగా సంస్కృతీకరింపబడుటకు మూలహాలుని సప్తశతిలోని ప్రాకృతముక్తకకవులు కవయిత్రులు - వీరికానాటి లలితాంధ్రదేశసౌభాగ్యము అనేక విధములుగా ప్రోత్సాహమిచ్చినది. ఆ సంఘటనలను సహృదయతతో ఊహించి ఖుషీనిపావనుభవించుట రసికుడు నందనవనము దారితప్పి మలుపు మలుపునకు ఒకొక్క అచ్చరను కలిసికొనుటవంటిది.

ఆంధ్రసారస్వతములో అడుగుపెట్టేసరికి నన్నయ్యకు రాజరాజుఆదేశము ఉద్దీపన. తెలుగు కవులలో ఈ శ్రేణి ఎక్కువ అంకెలు గలది. తిక్కనగారి రామాయణము ఎర్రనగారి రామాయణము సూరన రాఘవపాండవీయము మొదలైన రచనలు ఎన్నో రాజాజ్ఞలచే వ్రాసిన గ్రంథములున్నవి.

దైవికము స్వాప్నికము ఐన ప్రేరణ ఆంధ్రకవులలో ఒక విశిష్ట భావుకలక్షణముగా కన్పించును. సహజపండిత కవిపోతన్నగారికి రామభద్రుడు రాయలవారికి ఆంధ్రమధుమథనుడు - కవిబ్రహ్మకు, ప్రబంధపరమేశ్వరునకు తండ్రి తాతలు - కృతిప్రేరకులు. ఈ ప్రవరలో ప్రసిద్ధుడు కూచిమంచి తిమ్మకవి. కుక్కుటేశ్వరుడెన్నోసారులు ఈయనచేత కృతులు వ్రాయించి అంకితము గొనియుండెను. ప్రపంచములో కావలసిన విషయమును కలలలో అనుభవించగల్గిన సిద్ధజాతి మన ఆంధ్రజాతి.

కొందరు మహాకవులకు రాజాజ్ఞ దైవాజ్ఞయుకూడ అర్ద్రిభావము నిడజాలవు. “ధీరం నిలోకయతి చాటుశతైశ్చభుంక్తే”వంతగా గల వారు వీరు. వారికి పంచేంద్రియతర్పకములైన కొన్ని సన్నివేశములు కావలయును. శ్రీగాథుడీకోవలో ప్రథమస్మరణీయుడుమత ప్రవక్త మహమ్మద్ వంటివానికిఅమ్మాయిలో అత్తరువులో, కైపుతలిగించేవట. కవితకే జీవితమును మీదుగట్టిన శ్రీనాథునివంటి రసప్రబంధవిషయ మిక నెట్లాశ్చర్యజనకము ? అత్తరులు మత్తకాశినుల మాటల్లోంచి షడ్రసోపేతమైన భోజనముకూడ అతనికి నవరసభరితమైన కావ్యరచనలో దీపకమయ్యెడిది. ఇక చంద్రాంశునవసుధాసారధార కల్హారమాలికా గళదలహరి దిక్పూరిత కర్పూర గంధసారసౌరభము వంటివి. ఆయనను రెచ్చగొట్టి కావ్యాలు వ్రాయించుట సాధారణవిషయము. ఈ తరగతిలో ఓ ఆకు ఎక్కువ చదివినకవి పెద్దన. ఆ కవిశేఖరునకు ‘నిరుపహతిస్థలంబు...ఇత్యాది పంచేంద్రియతర్పక సామగ్రి జతపడి సుఖయుక్తమైన వర్తమానస్థితి దానిని కొనసాగించు భవిష్యత్ ప్రతిశ్రవము కలిసి వచ్చినగాని, కావ్యేందిరను పలుకరింపవలె ననిపించెడిదిగాదు. అందరికి ఇంత పెద్దచూపున్నచో అదృష్టము కలిసిరాదు. పులగము, పచ్చిపులుసు, వంకాయ, కాకరకాయవంటివికూడ ఎసగొల్పి పథ్యములు చెప్పించిన సందర్భము లున్నవి. చలిది అన్నము ఉల్లిపాయిలాంటివికూడ ఈ కృతిప్రేరకగౌరవములో ఓటుహక్కును సంపాదించుకొన్నవి. హేతువు లౌకికదృష్టిలో సామాన్యము కావచ్చు. కాని విలువను మనము ఫలమునకే యీవలయును. ఆవు గడ్డి తినుట దాని పాలతీపికి విలువ తగ్గింపదుగదా!


ఇక కేవలము నేటివారియందును ఒకటిరెండుదాహరణములు మాపిన చాలు ననుకొందును. బొబ్బిలిలో ఒక కవిగారుండెడివారు. ఆయనకు విరుగుడుపాలు యిష్టము. భార్య విసుక్కొనుచు పాలు విరిగినవని చెప్పిననాడాయన మంచిపద్యములు వ్రాసెడివాడు. సోమరాజు రామానుజరావుగారికి ఓ కప్పు టీ - ఓ దేవాలయప్రదక్షిణము - ప్రోత్సాహమిచ్చేవట “పాడుము నూరుకుంటున్నప్పుడు” చాలమంది పండితులు ప్రసన్నముగ నుందురు.

పడమటిదొరల కబ్బపు కబుర్లలోను ఇట్టివి కొన్ని వినిపించును. షిల్లరు మాగిన సీమరేగుపళ్ల వాసనకు అవశుడై రచన సాగించెడివాడట. వాల్టర్ డీలామేర్ ఓ పొగపట్టు పట్టినగాని కలము పట్టెడివాడు గాదట. పడెక్కి టీ - స్పెండరికి కాఫ్ రచనోద్దీపనలట.

పై చెప్పిన హేతువులు సాధారణులలో కావ్యప్రారంభమును నెలకొల్పు నను కొనకూడదు. మాగిన రేగుపళ్ల వాసన ఓ వ్యక్తిని షిలర్‌గాగాని, - రమణీయప్రియమాలిక తెచ్చియిచ్చు కప్పురవిడెము - పెద్దనగాగాని మార్చలేవు. జానకాలములో బయటి షికారుకు వెళ్ళి ఎందరో పిట్టలను కొట్టుట చూచుచునేయున్నాము. ఐనను నాటికి నేటికి వుద్దీప్తుడు వాల్మీకి ఒక్కడే. పర్యాంతర ప్రణయప్రబంధము సాగించేవారు చాల మంది గలరు. కాని మరల మరియొక పండితరాయలు పుట్టలేదు.

ఈ ఉద్దీపన హేతువులు మనకు భావకవులలో లభియించినంతగా వస్తుకవులలో దొరకవు. భావకవి స్వీయవిషయమే వ్రాయ సాహసించును. గనుక. దృష్టప్రేయసియో అదృష్టప్రేయసియో కృష్ణపక్షమో సంసారపక్షమో రచనహేతువుగ గ్రహించుట సుకరము. వస్తుకవులలో ముఖ్యముగ రూపక రచయితలలో ఈ విషయము ఉత్ప్రేక్షాసాధ్యము.

రచయితలైనవారికి ఆధునికవాతావరణమున ఉద్దీపనలకు లోటు లేదు. స్త్రీపురుషుల సబ్రహ్మచర్యము - సినిమాలు - సచిత్రవారాపత్రికలు - విందులు - సమాజోత్సవములు - దేశయాత్రలు వివిధవాఙ్మయపరిచయ భాగ్యము - ఆరామవిహారసౌకర్యములో వంటివేగాక - కాఫీశాలలో ఊకదంపుపత్రికలో రూపాయికి ఎనిమిది మచ్చుఫోటోల వరకు పలురకములు ప్రోత్సాహకములు. ఇంతటి ప్రోత్సాహసౌకర్యములకు తగిన సాహిత్యముమాత్రము మృగ్యము అనిపించును. ఇంత నాగరకత పరవగా రాము పాదధూళిగా వచ్చినను వచ్చుచున్నను చైతన్యము గనని శిలలవలె నుండెడి యువకుల సోమరితనమును తొలగింపవలె నను సఖినిజేశమే నా యీ రచనకు ఉద్దీపకము.




పరిశోధనా కేంద్రం తాలూకు మహత్తరమైన గ్రంథాలయం



రేడియో యాక్టివ్

సరికొత్త ప



బ్రిటన్‌లో వ్యవసాయ పరిశోధనలు ; రాథమ్‌స్టెడ్ పరిశోధనా కేంద్రంలో పొద్దుతిరుగుడు వృక్షాల అభివృద్ధికి జరుగుతున్న పరిశోధనలు.

వైద్యపరిశోధనలు

బ్రిటన్‌లో వైద్యశాస్త్రంలో పరిశోధనలు జరిపేందుకు ఒక కర్మాగారం ఈ మధ్య కట్టారు. ఇది చాలా అందమయింది. దీన్ని జార్జిరాజు ప్రారంభించారు. ముప్ఫై సంవత్సరాలనుంచి ఈ పరిశోధనకర్మాగారం పనిచేస్తున్నది గాని, దీనికి ఇంతవరకు ఒక ప్రత్యేక భవనం అంటూ లేదు. హాంప్‌స్టెడ్‌లో అద్దె ఇళ్లలో ఇది వుంటూ వుండేది. కాని 1937లో దానికి ఒక భవనాన్ని నిర్మించడం ప్రారంభించారు. అది ఇప్పటికి పూర్తి అయింది. ఈ పరిశోధనాలయాన్ని 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ రిసర్చ్' అంటారు.

ఈ భవనం వైశాల్యం 9 వేల చదరపు అడుగులు, మూడు అంతస్తులు 800 మంది వాస్తుశిల్పులు ఈ నిర్మాణంలో పనిచేశారు. వీరు గాక ఇంకా అనేకమంది వాస్తుశాస్త్రనిపుణులు చేయూత నిచ్చారు. వైద్యశాస్త్రంలో బహుతరకాలైన పరిశోధనలు జరగడానికి



పదార్థముల పరిశోధన


రిశోధనలు

వీలుగా ఈ భవనం నిర్మించబడింది.

ఈ భవనం మూడు అంతస్థులలోను పరిశోధనలు జరుగుతూవుంటాయి. ముఖ్యంగా రసాయనిక-చికిత్సలవిషయంలో పరిశోధనలు జరపడానికి ఎక్కువ వీలుసౌకర్యాలు ఇక్కడ కల్గించబడినాయి. మొదటి అంతస్తులో రసాయనశాస్త్రంలో పరిశోధనలు జరుగుతూ వుంటాయి.

ఉష్ణప్రాంతాల్లో ప్రబలంగావున్న వ్యాధులనుగూర్చి పరిశోధించటానికి ప్రత్యేకంగా క్రిమిపరిశోధనాలయం నిర్మించబడింది. రసాయనిక చికిత్సల్లో పరిశోధనలు జరుపుతున్నవారు ముఖ్యంగా మలేరియా, బోద, రక్తవిరేచనలు మొదలైనరోగాలనుగూర్చి పరిశీలిస్తున్నారు. క్రిమివ్యాధుల్లో క్షయను గురించి పరిశోధనలు జరుగుతున్నాయి. పుట్టుకతో వచ్చే మరికొన్ని వ్యాధులనుగూర్చి కూడా ఇచ్చట పరిశోధనలు సాగుతున్నాయి.

అతిసూక్ష్మములు, అగోచరములు, అయిన క్రిములు కొన్నివున్నాయి. వీటిమూలంగా అనేకవ్యాధులు కల్గుతున్నాయి. వీటికి తగిన చికిత్సలనుగూర్చి ఇప్పుడు ఇక్కడ ఎక్కువ పరిశోధనలు జరుగుతున్నాయి. ఇందుకోసం అనేకకర్మాగారాలు ఇచ్చట నేటాయించబడినాయి వీటివల్ల వచ్చే జబ్బుల్లో ఇన్ఫ్లూయంజా అనేజ్వరం ముఖ్యమైంది దీనికి తగిన చికిత్సకోసం ఇక్కడి శాస్త్రజ్ఞులు ఎక్కువ కృషిచేస్తున్నారు.



జాతీయపరిశోధనల కేంద్రం డైరెక్టర్ సర్ ఛార్లెస్ హారింగ్టన్

తొందరికి చికిత్స

తొందరితో పుట్టినవారియొక్క, మాటామామూలుగా ఉండేలాగు శస్త్రచికిత్స చేయవచ్చునని డా. హెర్బర్ట్ కాన్వె చెబుతున్నాడు. ఇదివరలో శస్త్రచికిత్స ద్వారా తొందరివారిలో సగంమందికి మాత్రమే మాటా, ఆకారమూ చక్కబడుతున్నది. కొత్తరకం శస్త్రచికిత్సద్వారా నూటికి 95 గురంది బాగుపడగలరట. బిడ్డ పుట్టిన 48 గంటలలోగా శస్త్రచికిత్స జరగాలి. తరువాత బిడ్డకు 17వ ఏడు వచ్చేదాకా మన స్తత్వవేత్తలు వగైరాల సహాయం ఉండాలి.

గట్టి కొయ్యతో కాగితం ఉత్పత్తి

ఇప్పటి వరకు అమెరికాలో కాగితంఉత్పత్తి కొరకు మెత్తని కొయ్య ఉపయోగిస్తున్నారు కాని ఇప్పుడు గట్టి కొయ్యనుకూడా రసాయనికాల సహాయంతో కాగితపు పిండిగా మార్చగలుగుతున్నారు. నూటికి 95 వంతులు కొయ్యపిండిఅవుతున్నది. అయితే ఈ పిండి ప్రస్తుతం కొన్ని రకాల కాగితాలు తయారు చేయడానికే ఉపయోగపడుతున్నది. ఇతరరకాలు తయారు చేయడానికి పరిశోధనలు జరుగుతున్నాయి.



బ్రిటన్‌లో జాతీయవైద్యపరిశోధనాలయం-జీవశాస్త్రశాఖ - ఇన్ఫ్లూయన్జా క్రిములను కోడిగుడ్లకు ఇంజక్షన్ చేస్తున్నారు.

చిత్రసమీక్ష:

నలభై అయిదేళ్ల చలనచిత్రపరిశ్రమ


మూలం :
బి. డి. గర్గ

అనువాదం :
శ్రీ ఎస్. వసంతకుమార్

అది 1904 వసంవత్సరం. ఆరోజు బొంబాయిలో ఎవరిని పలకరించినా సరే ఒకటే హడావుడి. ఆ రోజే బొంబాయిచరిత్రలో మొట్టమొదటిసారిగా మూకీసినిమాలు ప్రారంభించినరోజు. మొట్టమొదటి మూకీచిత్రం "క్రీస్తు జీవితం" ఆ చిత్రం బాక్సాఫీస్ హిట్ అయింది. తర్వాత 'ది ఎరైవల్ ఆఫ్ ట్రైన్ ఎట్ చర్చిగేట్' అనే చిన్నచిత్రం ప్రదర్శింపబడింది. ప్రేక్షకులు ఈ చిత్రం చూసి ఒన్సుమోర్ అని కరతాళధ్వనులు పలికారు. మన చలనచిత్రపరిశ్రమలో ఇదే తొలిఅధ్యాయం.

తర్వాత 1912 లో బొంబాయిలోని కారొనేషన్ థియేటరులో 'రాజాహరిశ్చంద్ర' ప్రదర్శింపబడింది. దీని నిర్మాత చలనచిత్ర పితామహుడైన ధుండిరాజ్ ఫాల్కే. ఫాల్కే తన "హరిశ్చంద్ర" చిత్రం విజయం పొందటంతో 'సేతుబంధన్' 'కృష్ణజననం' 'లంకాదహన్" మొదలైన చిత్రాలు నిర్మించాడు. తరువాత బాబూరావ్ పెయింటర్ అనే మహారాష్ట్రియుడు "సైరంధ్రి" అనే చిత్రం తనే ఛాయాగ్రాహకుడుగా నిర్మించాడు. అయితే ఆరోజుల్లో సాహసించి ఏ స్త్రీకూడా సినిమాలలో నటించటానికి ఒప్పుకోలేదు. ఎందువల్లనంటే సంఘంలో తనకు స్థానముండదనే భయంవల్ల. మొట్టమొదటిసారిగా స్త్రీలు సినిమారంగంలో ప్రవేశించింది 1920 లో. వారి పేర్లు "పుతలీజిల్లాబాయ్, ఎర్మిలైన్. తర్వాత గులాబ్, గోహార్, సుల్తానా, జుబేదా, సీతాదేవి, సులోచన. ఆనాటి తారలందరిలో సులోచన మిక్కిలి అందకత్తె. తగిన అవయవసౌష్టవానికి తోడు, స్వారిచేయటం, కత్తితో యుద్ధంచేయటంకూడా ఆమెకు తెలుసు. అప్పుడు ఆమెకి నెలకి 150 రూ॥ జీతం. ఆనాటి తారలందరిలోకి ఆమెదే ఎక్కువ జీతం. తరువాత కొద్దిరోజులవరకూ ఈ పురాణచిత్రాలన్నీ విజయవంతంగానే నడిచినై. కాని ప్రజలు ఈ పురాణాలతో విసుగెత్తి చిత్రాలలో ఒకమార్పును వాంఛించారు. తత్ఫలితంగానే సాంఘికచిత్రాలు తయారయినై "ఇరవయోశతాబ్దం" "షిర్లీ దొంగ" "బ్రీఫ్‌లెస్ బారిష్టర్" మొదలైన చిత్రాలు నిర్మించారు. కాని సాధారణంగా ఈ చిత్రాలన్నిటిలోనూ భార్యాభర్తల ప్రేమ, మధ్యలో అది వైఫల్యం చెందటం, కథానాయికకష్టాలు, చివరకి ఇరువురూ కలుసుకోవటం – మొదలైన దృశ్యాలే ఉండేవి. కోహినూర్ వారి 'టెలిఫోన్‌గర్ల్" శారదావారి "లవ్‌రివార్డ్" ఇంపీరియల్ వారి "పాగల్ ప్రేమి" చిత్రాల కథావస్తువులన్నీ ఒక్కటే ఇంచుమించుగా. క్రమేపీ ఈ చిత్రాల వ్యామోహం విద్యార్థులలో కూడ ప్రవేశించి చాలమంది సినిమారంగంలో ప్రవేశించారు. ఇందులకు సుప్రసిద్ధమరాటీ రచయిత మామావరేర్కర్ చాలా కృషి చేశాడు. ఆయనకృషిఫలితంగానే చైరాజ్, దీక్షిత్, నయాంపల్లి, ముబారక్, దుర్గాఖోటే, పృథ్వీరాజ్, జగదీశ్ శేట్, మోహన్ భవనాని, మొదలైన యువకులంతా ఉత్సాహంతో ప్రవేశించారు. ఉత్సాహవంతులైన ఈ యువకులను చూచి విశ్వకవి రవీంద్రనాథ్ టాగూర్, శరత్‌చంద్రచటర్జీ, మున్షీ ప్రేమచంద్, మొదలైన సాహితీపరులు కూడా ఈ పరిశ్రమయందు ఆసక్తి చూపిరి.

మహాత్మాగాంధీయొక్క హిందూముస్లిం ఐకమత్యతను గురించిన బోధనలు విని ఇంపీరియల్ కంపెనీకి చెందిన అర్దెషిర్ ఇరాని "బాంబ్" అనే చిత్రాన్ని నిర్మించాడు. ఇందులో సులోచన, కవాస్‌జీ, మొదలైన



ఫిలిం పరిశ్రమస్థితిగతుల పరిశీలనసంఘానికి దక్షిణభారతఫిలింవాణిజ్యసంఘం ధ్యక్షుడు హెచ్. ఎం. రెడ్డిగారు మెమొరాండం సమర్పించినప్పటి ఫోటో. ఇందులో (ఎడమనుంచి కుడికి) వరుసగా బి. ఎస్. సర్కార్, ఎస్. కె. పాటిల్, వి. శంకరన్, హెచ్. ఎం. రెడ్డి, మోటూరి సత్యనారాయణ, వనకుడురుకాంతారాం కలరు.

వారు పాల్గొన్నారు. కాని ప్రభుత్వం దాన్ని నిషేధించింది. తరువాత "ఖుదాకీషాన్" అనే పేరుతో ఆ చిత్రం తిరిగి రిలీజయింది. నావల్ గాంధి అనే ఉత్సాహవంతుడైన యువకుడు రవీంద్రనాథ్ టాగూర్ వ్రాసిన ఒక నవల ఆధారంగా "బలిదాన్" అనే చిత్రం నిర్మించాడు. కాని M. భవనాని నిర్మించిన "టాయ్‌కార్ట్" అనే చిత్రం వీటన్నిటికంటె ఉత్తమమైనది. ఇందులో J. K. నంద చారుదత్తుడుగా ఉత్తమంగా నటించాడు. ఏనాక్షి రామారావు కోర్టు డాన్సరుగా నటించింది. వీరితోపాటు ఈ చిత్రంలో కమలాదేవిచటోపాధ్యాయ నలినీతార్కాడ్ కూడా పాల్గొన్నారు. ఈ చిత్రం దిగ్విజయంగా అన్ని చోట్లా ప్రదర్శింపబడింది. అది 1930 వ సంవత్సరం ఆనాటి సినిమా ప్రేక్షకులలోనూ. దర్శకులలోనూ, నిర్మాతలలోనూ టెలిఫోన్ మ్రోగుతుందనీ, ఇంజను కూత కూస్తుందనీ, సినిమాలలోని వ్యక్తులుకూడా మాట్లాడతారనే విషయం తెలిసి టాకీచిత్రాలు తీయటానికి ప్రయత్నించారు. అర్దెషెర్ ఇరానీ, ఇంపీరియల్ ఫిలింకంపెనీ తరఫున ప్రప్రథమంగా 'ఆలంఆరా' అనే టాకీచిత్రం నిర్మించాడు. ఇందులో జుబేడా, మాస్టర్ విటల్, జగదీశ్ శేటి మొదలగువారు పాల్గొన్నారు. మొట్టమొదటిసారిగా "ఆలంఆరా" చిత్రం లామింగ్టన్‌రోడ్డులోని ఒక మోటారు కంపెనీలో ప్రదర్శించారు. అప్పటివరకూ బొంబాయిలో టాకీచిత్రాలు ప్రదర్శించటానికి వీలైన థియేటరు ఒక్కటీ లేదు కాని తరువాత ఫజిల్ బాయ్ కొంత మిషనరీతో "మెజస్టిక్" థియేటరులో టాకీచిత్రాలు ప్రదర్శించటానికి వీలు కలిగించాడు. "మెజస్టిక్" థియేటరే ప్రప్రథమంగా టాకీచిత్రాలు ప్రదర్శించిన మొదటి థియేటరు. 1931 లో "ఆలంఆరా" చిత్రం మెజస్టిక్‌లో చాలా జయప్రదంగా నడిచింది. ఒక్కొక్క టిక్కెట్టు 50 రూ, కి కూడా కొన్నారు. "ఆలంఆరా" తరువాత మదన్ థియేటర్స్‌వారి "షిరీన్ ఫర్హాద్" ప్రభాత్‌వారి "కింగ్ ఆఫ్ అయోధ్య" "జల్తీనిషాని" చిత్రాలు తయారయినై. అవి ఉత్తమకళాఖండములుగా పరిగణించబడినై. ఆతర్వాత చాలా స్టంటుచిత్రాలు తయారయినై. "దగాబాజ్ ఆషక్", "తుఫాన్ మెయిల్", "బుల్‌బులె బాగ్దాద్", "నాటీమెయిడ్" మొదలైన స్టంటుచిత్రాలు ఆ నిర్మాతలకి ధనపు సంచులు చేకూర్చిపెట్టినై. 1933 వ సం,లో న్యూథియేటర్స్‌తరఫున దేవకీబోస్ "పూరన్‌భక్త" అనే చిత్రం నిర్మించాడు. మొట్టమొదటిసారిగా ఈ చిత్రంలో నేపథ్యసంగీతం ప్రవేశపెట్టబడింది. ఈ చిత్రంలో 'రాయిబోరల్' ఇచ్చిన సంగీతం ఏ ప్రేక్షకుడూ మరువలేడు. ఆ సంవత్సరంలోనే శాంతారాం "అమృతమంథన్" దేవకీబోస్ "సీత" బారువా "దేవదాస్" చిత్రాలు నిర్మించారు. ఒక సంవత్సరంలోనే మూడు ఉత్తమచిత్రాలు నిర్మించబడటం నిజంగా ఎంతైనా గర్వించదగిన విషయం. "అమృతమంథన్" చిత్రంలో శాంతారాం కొంత పేరు సంపాదించాడు. "పూరన్‌భక్త" చిత్రంతో ప్రేక్షకుల మన్ననల నందిన దేవకీబోస్ "సీత" చిత్రంతో శాశ్వతంగా ప్రేక్షకుల హృదయంలో స్థానం సంపాదించగలిగాడు. అప్పటిదాకా ఒక చిన్న దర్శకుడిగానే ఉన్న బారువా "దేవదాస్" చిత్రంతో ఉన్నతస్థానాన్ని అందుకోగలిగాడు. ఈ చిత్రంతో సైగల్ పాటకుడుగానే గాకుండా ఉత్తమనటుడని గూడా నిరూపించుకొన్నాడు. తన పాత్రకి జీవం పోశాడని శరత్‌బాబుగూడా సైగల్‌ని ప్రశంసించాడు. "దేవదాస్" చిత్రంలో సైగల్ పాడిన పాటలు ప్రతినోటా మారుమ్రోగినై. వాల్ట్‌డిస్నీ తీసిన "సిల్లిసింఫనీస్" చిత్రం చూచిన తరువాత మన నిర్మాతలకుగూడా రంగుల చిత్రాలు తీయాలనే వాంఛ ప్రబలిపోయింది. ఆర్దెషెర్ ఇరాని "కిసాన్‌కన్య" అనే సినీకలర్ చిత్రాన్ని నిర్మించాడు. తర్వాత "మదర్ ఇండియా" చిత్రం నిర్మించాడు. ఇది చూచి ప్రభాత్‌వారు 'సైరంధ్రి' చిత్రంకూడా సినీకలర్‌లోనే నిర్మించారు. కాని మొత్తం అవి అంత చెప్పుకోదగ్గ విజయం పొందలేదు. 'ఖజాంచి' చిత్రం విడుదలతో గులామ్‌హైదర్ సంగీతదర్శకుడుగా పేరుపొందాడు. పంజాబ్‌నివాసి అయిన మథోక్ (పొయెట్‌లారెట్) గూడా బొంబాయిలోనే స్థిరనివాసం ఏర్పరచుకున్నాడు. చాలాకాలంవరకు ఫిలింపరిశ్రమలో ఉత్తరహిందూస్థానమే పైచేయిగా ఉంది. కాని ఇప్పుడిప్పుడే దక్షిణహిందూస్థానం ఉత్తరానికన్నా చిత్రపరిశ్రమలో ముందంజ వేసింది. ఇందుకు నిదర్శనం జెమినీవారి 'చంద్రలేఖ' నిషాన్ చిత్రాలు. అయితే ఇకముందు మన చలనచిత్రపరిశ్రమలో ఇంకా ఏమేమి మార్పులు వస్తయో ఎదురుచూద్దాం.

సినిమా : 9-8-50

★ మత్స్యకన్య ★

నవీనా ఫిలిమ్స్ 'మత్స్యకన్య' లేక 'అహూతి' చాలా అసాధారణచిత్రం కథ, తద్వివరణ, ఛాయాగ్రహణం, నటన-అన్నిటిలో ఆ అసాధారణత్వం అగపడుతుంది మామూలుగా వచ్చే సాంఘికచిత్రాలలో గానీ, జానపదచిత్రాలలో గానీ కనవచ్చే అసహజత, అసంబద్ధత ఇందులో కనిపించవు ఆ చిత్రాలలో సామాన్యునికి అసామాన్యంగా కనిపించే తళుకుబెళుకులు చూపి, అతనిలో అక్రమమైన ఆశలు, అకారణమైన అసంతృప్తి రేపి అతని జీవితాన్ని దుఃఖభాజనం చేస్తున్నాయి. కాలక్షేపంకోసం, రోజల్లా పడిన శ్రమను కనుమరగించుకోవాలని చూసే చిత్రాలు నల్లమందు విషంవలె కనపడకుండా, క్రమక్రమంగా అతనిలో దురాశలు, దుర్వాంఛలు రేపి దురాగతాలకు దారితీస్తున్నాయి. మనదేశం సత్యదూరం కాగు సినిమాలు, చిత్రాలు ప్రజలకు విద్యా, విజ్ఞానము, వికాసము కలిగించడానికి శక్తివంతమైన సాధనాలని వక్కాణించేవారు నేడు సర్వసాధారణంగా తయారవుతున్న చిత్రాలవల్ల, వాటిలో ప్రదర్శితమవుతున్న కుహనా సుఖసౌభాగ్యాలవల్ల మంచిచెడ్డల విచక్షణ ఎరుగని, అమాయకప్రజా మానసాలు ఏ విధంగా మలినమవుతున్నాయో ఏమాత్రం గ్రహించడంలేదు అట్టి మాయభావాల దుష్ప్రచారాన్ని అరికట్టేందుకు ఏమీ చేయడం లేదు

ఈ చిత్రం పైన చెప్పినదానికి కేవలం భిన్నమైనది ఒక పల్లెగూడెంలోని ప్రజల నిరాడంబరజీవనాన్ని వాస్తవికంగా, ప్రతిభావంతంగా ప్రతిబింబిస్తుంది అందులోని మంచిచెడ్డలను సూచనప్రాయంగా చూపుతుంది. వారి మనోవైఖరులను, కష్టసుఖాలను, ప్రేమాదరాలను, త్యాగసహనాలను చక్కగా వెల్లడిస్తుంది. ఆ పరిసరాల అందచందాలనూ, ప్రశాంతతనూ మనస్సుకి పట్టిస్తుంది. ప్రేక్షకులలో అక్రమమైన అందరాని వాంఛలను, ఆశలను ఎంతమాత్రమూ కలిగించదు

ఇందులోని ఛాయాగ్రహణం ప్రత్యేక ప్రశంసాపాత్రము. సముద్రము, గుట్టలు బయళ్లు, తోపులు, చెట్లు, ఈ సుందర ప్రకృతిని భావయుక్తంగా వాడుకోవడంలోనూ, నావలపై ప్రయాణాలూ, పందేములూ, నీటిలో సొరచేపతో నాయకుని పోరాటం చూపడంలోనూ ఛాయాగ్రాహకుడు అద్భుత ప్రతిభ చూపాడు. రెండు చుట్టు గుడిశెలుతప్ప మరే 'సెట్టింగూ' లేకుండా కేవలం 'ఔట్ డోర్'లో తీసిన చిత్రం మనదేశంలో ఇది ఒకటే నేమో! ఇది నిజంగా చెప్పుకోదగ్గ విశేషం.

ప్రేక్షకుని మనస్సును ఆద్యంతం ఆకట్టే ఆకట్టేట్టు కథాగమనం ఏర్పాటు చేయడంలోనూ, నటీనటులచే, ఒకటి రెండుచోట్ల తప్ప, ఫిలిం అంతటా అతిసహజంగా భావ ప్రకటన చేయించడంలోనూ సహజచమత్కృతి గలిగినట్టీ, భావస్ఫోరకాలైనట్టీ, మనస్సును కదిలించేటట్టీ సన్నివేశాలను ఎంచుకొని, నిర్వహించడంలోనూ డైరెక్టరు అసాధారణచాకచక్యం చూపాడు. నాయకుడు తన ప్రేయసిని తనఒడిలో, చేతులలో ఉంచుకొని, ఆమె కడసారికోరిక ప్రకారం పాటపాడుతూ అది పూర్తి అయే సమయంలో ఆమె ప్రాణాలు పోయాయని గ్రహించే దృశ్యము, ఆ వెనువెంటనే అతడు చేసే శోకారావము డైరెక్టరుచాకచక్యానికీ, నటుని ప్రతిభకూ కూడా నిదర్శనము నటీనటులంతా కూడా చాలా సహజంగా నటించారు

'నీరాభోగ నందా' అని అసలు హిందీలో తయారైన ఈ చిత్రానికి నవీనాఫిలిమ్స్‌వారు జగన్నాథ్ గారి పర్యవేక్షణలో తెలుగు సంభాషణలు, పాటలు, సంగీతం డబ్ చేయించారు తెలుగున ఈ ప్రయత్నం చేయడం కూడా ఇదే ప్రథమం పాటలు, సంభాషణలు శ్రీరంగం శ్రీనివాసరావు వ్రాశారు నాయికా నాయక భూమికల పాటలను బాలసరస్వతి, ఘంటసాల వెంకటేశ్వరరావు పాడారు సంగీతం ఎస్. రాజేశ్వరరావు కూర్చారు.

ఈ తెలుగుచిత్రంలో ప్రత్యేకం ప్రశంసనీయమైనది, నేపథ్యసంగీతం (అదికూడా వీర సమకూర్చినట్లయితే), సంగీతం పర్యవేక్షకుడు సంభాషణలు, పాటలు అంతటా స్ఫుటంగా వినబడేటట్లు శ్రద్ధవహించినట్లైతే బాగుండేది. సంభాషణలు, పాటలు పాత్రల పరిసరాలకు అనుగుణంగా, ఇంకా కొంచెం వాస్తవికంగా ఉండవలసిందనిపించింది.

ఏది ఎట్లావున్నా చిత్రనిర్మాణవిలువలు తెలుసుకోదలచువారు తప్పక ఒక్కసారైనా చూడవలసిన చిత్రమిది.

ఈ చిత్రం ఈ 4వ తేదీనుంచీ చెన్నపట్నంలోని సాగర్, క్రౌన్ టాకీస్‌లలో ప్రదర్శితమవుతున్నది. [శ్రీ]



శ్రీ రాజరాజేశ్వరీవారి 'సౌదామిని'లో నాయిక ఎస్. వరలక్ష్మి.

'దహేజ్'

వి. శాంతారాం గారి క్రొత్త చిత్రం 'దహేజ్' 'ప్రభాత్'లో 4వ వారం ప్రదర్శితమవుతోంది. జయశ్రీ, కరన్ దివాన్, పృథ్వీరాజ్ ప్రధానభూమికలు నిర్వహించిన ఈ చిత్రం, హిందూసమాజంలో వివాహాలప్పుడు కట్నాలు ఇచ్చే ఆచారం ఎట్లా కొంపలు కూలుస్తోందో కళ్లకు కట్టినట్లు చూపుతుంది కథాసంవిధానంలో అద్భుతనైపుణ్యం, ఉజ్వలమైన ఛాయాగ్రహణం పృథ్వీరాజ్ అసమాన నటనాచాతుర్యం చిత్రాన్ని మరుద్దామన్నా మరవనీయవు పాటలూ నృత్యాలూ కూడా ప్రశంసావహంగా వున్నాయి.

'ఇదయా గీతం'

సిటాడెల్ వారి క్రొత్త తమిళచిత్రం 'ఇదయగీతం' ఈ 29 నుంచీ కాసినోలో ప్రదర్శితమవుతున్నది జోసెఫ్ తాలియా (జూనియర్) డైరెక్టుచేసిన ఈచిత్రంలో టి ఆర్. రాజకుమారి, మహాలింగం, వీరప్ప, సారంగపాణి నటించారు.

15వ శతాబ్దపు రాజపుటానా వాతావరణంతో, ఒక కన్యకోసం రాకుమారుల సోదరులిద్దరి సంఘర్షణ ఇతివృత్తంగా గల ఈ చిత్రం రంజకంగా వున్నట్లు తెలుస్తున్నది.



కొరియా యుద్ధం

[తమాషా నాటిక]

శ్రీ యం. వి. యల్. యస్. రాజు

(1 వ రంగము)

యమలోకం

(యమధర్మరాజు ఒకమంచం పైన పరుండి ఉంటాడు. ప్రక్కన యమకింకరులు వివిధభయంకరాయుధాలతో నిలువబడి ఉంటారు. మరొకప్రక్క గాయకులు నిలువబడియుందురు)

1 వ కింకరుడు:—నిద్రించారు ప్రభువులు. పోదాం.

2 వ కింకరుడు:—ఈ రెండవ మహాయుద్ధంలో చాలా అలసిపోయారు. అందుచేత చటుక్కున నిద్రపట్టేసింది, పోదాం.

(ఇంతలో చిత్రగుప్తుడు ఖాతా పుస్తకాలతో ప్రవేశం)

చిత్ర:—ప్రభువులవారు నిద్రపోయారు. ఐనా లేపక తప్పదు— ఈ మాయదారి భూలోకంగొడవలు మా డిపార్ట్‌మెంటుప్రాణాలు తీస్తున్నవి. ప్రభూ! కాలస్వరూపా! దండధరా! మహిషవాహనా!

యము:—ఎవరు వారు?

చిత్ర:—చిత్తం ధర్మస్వరూపా! నేను మీ పెద్దగుమాస్తాను. చిత్రగుప్తుణ్ణి.

యము:—ఏం వచ్చావ్. ఎందుకు లేపావ్? అలసి అలసి కొంచెం కళ్ళు మూసేటప్పటికి. మళ్ళా చిట్టా పట్టుకొని తయారయ్యావూ? ఏమొచ్చింది? మళ్ళా ఎక్కడైనా అంటుకుందా?

చిత్ర:—చిత్తం. క్షమించండి. తక్కినలోకాల్లో పనులు క్రమప్రకారం మన డిపార్టుమెంటు చూచుకొంటూ ఉంది. కాని ఈ పాడు భూలోకంలోనే, అంతా అడ్డదిడ్డంగా తిరుగుతోంది. వెధవ యుద్ధం. మీరు చెప్పినట్టు మూడు నిమిషాలుకూడా లేదు ముగిసి. వ్రాయలేక నేనూ, తిరగలేక మీరూ, బండమొండిప్రాణాలు తీయలేక మన కింకర్లూ..చాలాచిక్కుపడ్డాం. ఇంతలోనే మళ్ళీ. ఇది వచ్చిపడింది.

యము:—చెప్పవోయ్. ఎక్కడ? ఏమిటి?

చిత్ర:—ప్రభూ! చెప్పడానికేముందీ? భూలోకంలో కొరియాలో అంటుకుంది. ప్రస్తుతం కొరియా దేశం ఉత్తరకొరియా, దక్షిణకొరియా అని రెండుభాగాలుగా చీలిపోయి రష్యాక్రిందా— అమెరికాక్రిందా ఉన్నాయి. అవి వాట్ల చెప్పుచేతల్లో ఉన్నాయి. ఆ కీలుబొమ్మప్రభుత్వాలు రెండూ ఇప్పుడు యుద్ధానికి దిగాయి. ఒకపక్షాన అమెరికాకూడా దిగింది. ప్రపంచంఅంతా పందాన్ని చూస్తూ, కాస్తూ కూర్చుని వున్నది.

యము:—అదా? భూలోకంలో నుండి ఢాంఢాం అని శబ్దాలు వినిపిస్తుంటే ఏమిటో అనుకున్నాను.

చిత్ర:—చిత్తం చిత్తం. అవి యేమిటో కావండీ. బాంబులండీ. వెధవయుద్ధం, మళ్ళీ వచ్చిపడిందండీ. ఇది ప్రపంచంఅంతా ప్రాకేలాగు కనిపిస్తోంది. వీళ్ళ ప్రాణాలు తీయలేక మన ప్రాణాలు పోతవి.

యము:—అయితే ఇప్పుడు నీవు వచ్చినపని?

చిత్ర:—అదే. వాళ్ళందరినీ మన లోకానికి తీసుకురావాలా, లేక కొందరిని వైకుంఠానికీ, మరికొందరిని కైలాస, బ్రహ్మలోకాలకూ, ఇంకా స్వర్గానికి పంపించవలసి ఉంటుందా? క్రొత్తచిట్టాఅవర్జాలు మొదలుపెడుతున్నాను. ఆ వివరాలు తెలిసికొందామని వచ్చా.

యము:— ఆ వివరాలు ఆ లోకాల గుమస్తాలకు వ్రాసి కనుక్కోలేకపోయావూ?

చిత్ర:—చిత్తం. చిత్తం. కనుక్కున్నానండి. వాళ్ళంటారూ,— ఈ యుద్ధంలో వచ్చేవాళ్ళంతా వట్టి స్వార్థపరులు; దైవభీతి లేనివాళ్ళు. వాళ్ళతో మాలోకాల కేమీ

సంబంధం లేదు. అందరికీ మీరే ఏర్పాటుచేయించండి. ఏ రెడ్ క్రాస్ వాళ్ళో చస్తే అప్పుడుమాత్రమే మా బాధ్యత అని. ఇక, స్వర్గంలో క్షీరస్వర్గం డిపార్టుమెంటుకార్యదర్శి కూడా ఇదేధోరణిలో వ్రాశాడు. "ఇప్పుడు యుద్ధంలో చచ్చే వాళ్ళల్లో - ఎవ్వళ్ళకీ వీరస్వర్గానికి రావడానికి అధికారం లేదు. అసలు వీళ్ళల్లో వీరత్వం ఎక్కడ ఏడ్చింది? అంతా బానిసముండా వాళ్ళు - అంతా సైతాన్ చేతి బానిసలు. వీళ్ళ బాధ్యతంతా మీదే" అని.

యము :—నిజమే. అయితే యీ పాడుబరువంతా మన నరకం డిపార్టుమెంటువారిమీద పడ్డదన్నమాట?

చిత్ర:- చిత్తం. ఇప్పుడిది కొరియా యుద్ధమైనా ప్రపంచ యుద్ధంగా మారుతుందని మన జ్యోతిష్కులు చెప్పుతున్నారు. అబ్బ! ఇంతమంది చచ్చినవాళ్ళకి ఎక్కడ చోటు చూపగలం? ఎల్లా ఏర్పాట్లు చేయగలం?

యము:—సరే. ఇంతకుముందు ఎప్పుడైనా మన నరకం పూర్తిగా నిండిందా?

చిత్ర :—లేదు. స్వామీ! ఈసారిమాత్రం ఆలాటి ప్రమాదం ఉంది—సిబ్బంది హెచ్చించాలి.

యము:—ఐతే—భూలోకంలో అందుకు అర్హత ఉన్నవాళ్ళు ఎవళ్ళైనా కింకరుల పోస్టుకి దరఖాస్తు పెట్టుకున్నారా?

చిత్ర :—చిత్తం దక్షిణాఫ్రికాలోనూ, హిందూదేశంలోనూ, పాకిస్థాన్‌లోనూ, ఇదివరకు కొందరు దరఖాస్తుపెట్టుకున్నారు. వాళ్ళ కప్పుడే ఉద్యోగాలిచ్చేం. వాళ్ళు మన కింకరులకన్న భేషైనవాళ్ళు. దయాదాక్షిణ్యాలు లేకుండా ప్రాణాలు తీయడంలో మంచి ట్రైనింగు పొందేరు. ఐనా, ఇంకా చాలాసిబ్బంది అవసరం.

యము :—చూద్దాం సరే. ప్రస్తుతపు యుద్ధంలో జరుగుతున్న చిత్రాలు ఏమైనా తెలిసినవా ?

చిత్ర :—ఇంతవరకూ, అంతగా చిత్రాలు లేవు. కాని ప్రభూ! కొన్ని దేశాల ప్రభుత్వాలు మన ప్రభుత్వాన్ని మీరిపోయినవి. ఈ ప్రాణాలు తీసే హక్కు పూర్తిగా మనచేతిలోనుండి లాక్కుంటారేమో అని భయం వేస్తుంది. ఇకముందు మంచి మంచి చిత్రాలు యీ యుద్ధంలో జరగ్గలవని నారదులవారు సెలవిచ్చారు. తరువాత "ఆటంబాంబు" అనే ఒక నూతన వాహనాన్ని నిర్మించేరట నరుల్కు.

యము :— అది యేమిటోయ్! పోయినయుద్ధంలో ఆ వాహనం మీదేగా జపాన్‌వాళ్లు ఒకేసారి లక్షలకిలక్షలు ఓగేరు. దానితో యుద్ధం ఆఖరు అయిందిగా?

చిత్ర:—చిత్తం. ఏలినవారికి జ్ఞాపకం వుంది. ఆ వాహనంమీద లక్షల జీవాలు ఒకేసారి బయలుదేరడం మనలోకానికి సరాసరి వచ్చివేయడం జరుగుతుందట. అంతే కాకుండా అది బయలుదేరినచోటినుండి సరాసరి మన లోకానికి పెద్ద రహదారి యేర్పడుతుందట! దాన్నుపయోగించినతరువాతకూడా కొన్ని సంవత్సరాలవరకూ అట యేర్పరచిన దారిలో నిత్యం ఎంతోమంది నెమ్మదినెమ్మదిగా వస్తూనే ఉంటారట మన లోకానికి! ఇదివరకు ఏదో ఒక నగరంవారు వచ్చారుకాని ఈ యుద్ధంలో ప్రపంచంఅన్నిప్రాంతాలనుంచీ వస్తారట స్వామీ !

యము :—అయితే - జీవహరణాధికారబాధ్యతతో నే నొక నూతనచట్టాన్ని చేస్తున్నాను. దాన్నమలులో పెట్టు. వాళ్లకోసం మనవాళ్ళెవళ్లూ వెళ్ళనక్కరలేదు. సరాసరి వాళ్లే యీ శాసనం ప్రకారం ఆలాటి వాహనాలమీద మన లోకానికి రావచ్చును. తర్వాత వాళ్ల పేర్లు నీవు కష్టపడి వ్రాయనక్కరలేదు. మన లోకంలో ప్రవేశించే పెద్ద దేవిడీద్వారంవద్ద ఒక పుస్తకం, కలం సిరాబుడ్డీ పెట్టించు. వచ్చేవాళ్లందరూ అందులో సంతకం చేసి మరీ వస్తారు. అక్కడే ఒక ప్రకటన చేస్తూ నోటీసుబోర్డు పెట్టు. ఏమిటంటే — దేవిడీదగ్గర పుస్తకంలో సంతకం చేయకుండా నరకంలో ప్రవేశించినవాళ్ల నధికంగా శిక్షిస్తామని వ్రాయించు. ఇక వెళ్లు, ఆc. చూడూ, బ్రహ్మలోకంలో కాని, విష్ణులోకంలోకాని, స్వర్గంలో కాని, కైలాసంలో గాని నరకజీవుల కోసం క్రొత్తభవనాలు నిర్మించడానికి అవకాశం ఉంటుందేమో వ్రాసి తెలిసికో ;—తర్వాత— యుద్ధంలో ముఖ్యులైనవాళ్లు చావవలసివచ్చినప్పుడుమాత్రం నాకు తెలియజేయి. అవసరమైతే అందుకోసం నేను వెళతాను. ఇంకో మాట. ఇప్పుడు వచ్చేవాళ్ళని పాత వాళ్లతో కలంకుండా క్రొత్త గదుల్లో వేయించు. యుద్ధం పూర్తి

అయాక విచారణ జరుపుదాం. అంత వరకూ అన్నాహారాలూ, నీళ్ళూ, గాలీ లేకుండా చూడు. లేకపోతే మన నరకంపై దురాక్రమణ చేసి, మన పదవులను లాగుకొనడానికి వీళ్లు పథకాలు వెయ్యగలరు. తర్వాత చిక్కుల్లో పడిపోతాం. ప్రతీగదికీ తాళాలు వేసి సీలువేసేయ్. వెళ్లు.

చిత్ర :—చిత్తం. సెలవా ?

యము :—ఊఁ.

(చిత్రగుప్తుడు దండం పెట్టి వెళ్లిపోతాడు)

2 వ రంగం

బ్రహ్మలోకం

[బ్రహ్మ ఏదో వ్రాసుకొంటూ వళ్లు విరుచుకొని ఆవలిస్తూ ఉండగా నారదుడు ప్రవేశం]

నార :—సురజ్యేష్ఠా! నమస్కారం.

బ్రహ్మ :—కుమారా! విజయీభవ. ఏమి సమాచారం ?

నార :—మీరు ఆలాగున్నారేం ? కొంచం బద్ధకంగా ?

బ్రహ్మ :—(ఆవులించి, చేతులు ఝాడించి, వళ్లు విరుచుకొని) బద్ధకంగానే ఉంది. నిద్ర వస్తున్నది. ఒక్క క్షణం పడుకోవాలి.

నార :—(నవ్వుతాడు)

బ్రహ్మ :—ఏమి నారదా! నవ్వుతున్నావ్ ?

నార :—అబ్బే! సరిపడిందని. మీకు నిద్రవచ్చే టైమయింది. అక్కడ భూలోకంలో మీసృష్టికి ప్రళయం వచ్చికూర్చొంది. అర్థమైందా. ఇదీ కారణం!!

బ్రహ్మ :—ప్రళయమా ? జలప్రళయమా ?, అగ్నిప్రళయమా? వాయుప్రళయమా ? ఏమిటది ?

నార :—అన్నీ కలసిన ఆటం బాంబు, హైడ్రోజన్ బాంబుల ప్రళయం కొరియా అనే దేశంలో ఇప్పుడిప్పుడే మొదలు కాబోతూ ఉంది. ఇక్కడ మీకు బద్ధకం ఆవులింతలూ మొదలుపెట్టినవి కాని, స్వామీ ఈమధ్య మీదయవల్ల ఆహారం పుష్కలంగానే లభిస్తున్నది సరే కాని ఈ తరంవాళ్ళకి మీరు అర్ధాయుష్షే వ్రాశారా ?

బ్రహ్మ :—(నవ్వి) నేను పూర్ణాయుర్దాయమే వ్రాశాను అయితే చిత్రగుప్తుడు ఏదో గమ్మత్తు చేసి, దాన్ని సగానికి సగం తగ్గించివేస్తున్నాడు. (ఆవులించును)

నార :—నమస్కారం యిక మీ నిద్ర ఆపడం ఎవళ్లశక్యమూ గాదు. ఈ దెబ్బతో భూలోకం సర్వనాశనం అవుతుంది కాబోలు. అయితే స్వామీ ఇంకొక్కమాట! ఈ యుద్ధానంతరం కొంతకాలం వరకూ తమకు విశ్రాంతికాబోలు ?

బ్రహ్మ :—(నవ్వుతూ) అవచ్చు. ఇక నీవు వెళ్లు.

నార :—చిత్తం (పాడుకుంటూ పోవును)

3 వ రంగం


విష్ణులోకం.

(విష్ణువు శేషశాయిపై పవళించి యుండగా లక్ష్మి పాదముల నొత్తుచుండును. ధర్మదేవత దుఃఖిస్తూ ప్రవేశిస్తుంది)

ధర్మ :—(కండ్లు తుడుచుకొని) దేవాదిదేవా! ఆర్తశరణ్యా! అఖిలాండకోటిబ్రహ్మాండనాయకా! నమస్కారం.

విష్ణు :—శుభం. ఏం ధర్మదేవతా! ఇలాగు వచ్చేవ్ ? భూలోకం విడిచి ఇలాగు వస్తే— ఆ లోకంలో ఎన్ని చిక్కులు

(31-వ పేజీ చూడుడు)



అమెరికా ఉచిత నాట్య విద్యాకేంద్రాలలో శిక్షణ పొందుతున్న పాఠశాలా విద్యార్థినులు

బాలానందం :

జీవహింస

పూర్వకాలములో మాండవ్యుడనే మహాముని వుండేవాడు. అతడు చిన్నతనంలో తూనీగలను పట్టి ముండ్లు గుచ్చి, అవిబాధపడుతూ వుంటే చూసి తాను చాలా సంతోషిస్తూవుండేవాడు. చిన్నతనంలో యిలాంటి చేష్టలు యెన్నో చేసేడు. అయినప్పటికీ యుక్త వయస్సు రాగానే ఒకచోట ఆశ్రమము యేర్పాటు చేసుకొని మహామునియై తపస్సుచేస్తూ కూర్చున్నాడు. ఒకనాడు ఆశ్రమానికి దగ్గరగా వున్న వూళ్లో దొంగలుపడి ఒకయింటిలో సొమ్ము దోచుకొని పారిపోతున్నారు. అది చూచి ఆవూరి కాపలావాళ్లు దొంగలను పట్టుకోడానికి గాను వారి వెంట తరుముకు వచ్చేరు. దొంగలు పరుగెత్తుకుంటూ వచ్చి మాండవ్యుని ఆశ్రమంలో దాక్కున్నారు. ఈసందట్లో దొంగలవద్ద వున్న నగలు కొన్ని జారి తపస్సుచేసుకుంటూవున్న మాండవ్యుని దగ్గర పడ్డాయి. ఆమునితపస్సుచేసుకుంటూ వుండటంవల్ల యీ గొడవ అతనికేమీ తెలియలేదు. పిమ్మట దొంగలను తరుముకొనివచ్చిన కావలివాళ్లు ఆశ్రమంలోనికి వెళ్ళి మునిదగ్గరపడివున్న ఆభరణాలను చూచి "దొంగలీ మార్గమున వచ్చిరా" అని అతనిని పెక్కుసార్లు అడిగారు. కాని ముని తపోనిష్ఠలో వుండుటచేత యేమీ సమాధానం చెప్పలేదు. తరువాత ఆ కావలివాండ్రు ఆశ్రమమంతా వెదకి దొంగలను పట్టుకొని, ఆ ఋషి కూడా దొంగలలో ఒకడేనని, తమని మోసంచేయడానికి ఇలా వేషం వేసుకొని కూర్చున్నాడని శంకించి అతన్ని కూడా వారితో పాటు బంధించి రాజుదగ్గరకు తీసుకొని పోయేరు. రాజాస్థానములో న్యాయాధికారివీరి నందరిని విచారించి, కొఱత విధించేడు. రాజాజ్ఞప్రకా-

శ్రీమతి యం. సత్యవతి

రము తలారులు దొంగలనందరినీ తీసుకొనిపోయి కొఱత వేసిరి. కొంతకాలానికి దొంగలందరూ చనిపోయేరు. కాని మాండవ్యుడు మాత్రము చనిపోకుండ కొఱ్ఱునందు బాధపడుతూ వున్నాడు.

ఇట్లుండగా ఒకనాడు కొందరు ఋషులు ఆకాశమార్గంలో పోతూ వుండటంమాండవ్యుడుచూచి వారిని పిలచి కొంతసేపు ముచ్చటించేడు. ఇదంతా చూసిన తలారులు రాజు దగ్గరకు పోయి జరిగిన సంగతంతా చెప్పేసరికి రాజు పరుగెత్తుకొనివచ్చి బాగుగా ఆలోచించక మునినికూడా కొఱతవేయించినందుకు తలారులపై కోపించి మాండవ్యుని విడిపించాడు. తలారులు కొఱ్ఱును తీయడానికిప్రయత్నించగా అది యెంతకూ వూడిరాలేదు. అందుచేత ఆ కొఱతమ్రానును అతని దేహమునందు వున్నంత మట్టుకూ వుంచి, తక్కినదానిని నరికివేశారు. అదిమొదలు ఆ ఋషి గర్భమునందు కొఱత మ్రాను గుచ్చుకొని వుండుటచేత అతనికి అణి మాండవ్యుడు అనే పేరు వచ్చినది.

కొంతకాలానికి అతడు తన భౌతికదేహాన్ని చాలించి, యమలోకానికి పోయేడు. అక్కడ యమలోకపాలకుని జూచి అణిమాండవ్యుడు ఏపాపమూ యెరుగని నాకిట్టి కొరత వేయదగునా? అని అడిగాడు. అందుకు యముడు "నీవు మిగుల ధర్మాత్ముడవే. అయినను బాల్యమున తూనీగలు మొదలగు పురుగులను హింసించి, అవి బాధపడుతూవుంటే చూసి ఆనందించేవాడివి. ఆకారణంచేత నీకు యిప్పుడు కొరత వేయవలసివచ్చినది" అని బదులు చెప్పాడు. ఆమాటలకుముని కోపించి, "బాల్యమునందు అజ్ఞానమువలన చేసిన తప్పుకు కొరత వేయించేవు కాబట్టి నీవు హీనజాతియందు పుట్టుదువుగాక అని శపించేడు. దానివలన యముడు భూలోకములో విదురుడనుపేర శూద్రస్త్రీకి జన్మించాడు.

బాలానందం:

బిళ్ళగన్నేరు

శ్రీమతి నందివాడపుతలీ

లక్ష్మీదేవి తన పరిచారికలను పిలిచి "ఇవాళ స్వామిపుట్టినరోజు. తోటలో ఉన్న మంచిపూలన్నీ కోసుకురండి. దండ గ్రుచ్చుతా" నంది.

పరిచారికలు పూలు కోయడానికి తోటకి వెళ్లారు. వారిలో ఒకామెకి గులాబీపువ్వు కోయబోతోంటే ముల్లు గ్రుచ్చుకుంది. ఆమెకి కోపం వచ్చి "ఛీ ఇది స్వామికి తగ" దనుకొని ప్రక్కనున్న చెట్టుపూలు కోయడానికి వెళ్లబోతోంటే పువ్వాపింది.

"న న్నెందుకు కొయ్యలే" దని అడిగింది. పరిచారికకు గులాబీతో దెబ్బలాడడం ఇష్టం లేదు. ఎందుకంటే గులాబీతో తగవులాడుతూ కూర్చుంటే పూలు కోయడ మాలస్యమౌతుంది. లక్ష్మీదేవి కోప్పడుతుంది. అదీ కాక ఆమెకి గులాబీరం గెంతో యిష్టం.



అందుకని "దానికి చాలా పూలున్నాయని వెళ్తున్నా" నంది.

"నా పూలు కోయకుండా వెళ్లడానికి వీలులే" దంది గులాబీ.

గులాబీమాటకి ప్రక్కనున్న పరిచారికకి కోపం వచ్చింది.

అసలు మొదట ఇక్కడికి రావడం బుద్ధిపొరబాటైంది. అమ్మగారు మంచిపూలు కోయమన్నారు. పోసీ నీ పూలుకూడా కోద్దామని వస్తే ముల్లు గ్రుచ్చుకుంది. నయమే ఆకుతో పువ్వు కోద్దా మనుకున్నాం. అమ్మగారికి కనక గ్రుచ్చుకుంటే మా పని అయేదే" అంది.

"నేను మంచిపువ్వును కానా?" అంది కోపంగా గులాబీ.

"ఏమో నమ్మా మాకు తెలియదు. మేం తగవులాడ్డానికి రాలేదు. పూలుకోయమని అమ్మగారు పంపితే వచ్చాం. ఆలస్యమైతే ఆమె కోప్పడుతుంది. మమ్మల్ని పోనియ్యి" అంది పరిచారిక సంపంగచెట్టువేపు నడుస్తూ.

"నా పూలు కోయకుండా సంపెంగని కొయ్యడానికి వీల్లేదు. నాకంటె అందమైనదా అది?" అంది గులాబీ మళ్లీ.

అది విని సంపెంగ, "అక్కా నువ్వు పొరబడ్డావ్. నీమాత్రం అందంగా నేను లేకపోలే" దంది.

"ఎవ రందంగా ఉన్నారో, తెలుస్తుందిలే యివాళ" అని గులాబీ రివ్వున లక్ష్మీదేవిదగ్గరకు బయదేరింది.

పరిచారికలు యింకా పువ్వులు తేలే దేమని లక్ష్మి తోటకి వచ్చింది. పరిచారిక జరిగినదంతా చెప్పింది. ఆమెను చూసి సంపెంగ భక్తితో నమస్కరించి

"తల్లీ మాలో ఎవ రందమైనవారో చెప్పి తగవు తీర్చమని ప్రార్థించింది. గులాబీ కన్నీరు కారుస్తూ తనకు జరిగిన అవమానం చెప్పింది. కాని లక్ష్మీదేవికి గులాబీ తన పరిచారికతో అంత గర్వంగా దెబ్బలాడినందుకు కోపం వచ్చింది.

"నువ్వందమైనదానవే ననుకో, అయినా అంత అహంకారంకూడదు. అణగిఉండడం నేర్చుకో" అని గులాబీతో అంది. గులాబీ ఏదో మళ్లీ జవాబు చెప్పబోయింది. లక్ష్మికి చెప్పలేనంత కోపం వచ్చింది.

"ఆ పొగరు కూడదనే చెప్తున్నా. నీ కింకా బుద్ధి రాలేదు. ఎంత అందం ఉంటే ఏం లాభం? ఇట్టే

ఎండకి వాడిపోతావు. మర్నాటికల్లా రేకులతో సహా రాలిపోతా"వని శపించింది.

ఎదురుగుండా ఉన్న సంపెంగను చూసి "నీకేనా ఉండద్దూ జ్ఞానం! దాంతో సమానంగా పోట్లాడుతావా? ఎవరందంగా ఉంటే ఏం? మహాలంకకర్త్తె నని పొంగిపోతున్నావు కాబోలు. ఈరోజునించీ నీ కందం ఉండదు. కాని అందానికి బదులు, నువ్వు నాయెడ చూపిన భక్తికి మెచ్చి సువాసన నిచ్చాను. అన్ని పూలకన్నా నీకు వాసన ఎక్కువుంటుంది" అంది.

సంపెంగ వినయంగా లక్ష్మీదేవికి ప్రణమిల్లింది. పక్కనున్న ముళ్లగోరింత, బిళ్లగన్నేరు మొదలైన చిన్నమొక్కలన్నీ భయంతో లక్ష్మీదేవికోపానికి వణికిపోతున్నాయి. లక్ష్మీదేవికి వాటిని చూస్తే నవ్వువచ్చింది. భయం లేదని బుజ్జగించింది. అప్పుడు బిళ్లగన్నేరుకు ధైర్యం వచ్చింది.

"అమ్మా ఎవరందమైనవాళ్ళో నిర్ణయించారు కారు. మీరు వెళ్లగానే మళ్లీ తగవు ప్రారంభమౌతుందేమో!" అంది.

"ఔను. సరిగ్గా జ్ఞాపకం చేశావ్. నేను ఏమీ తేల్చకుండా వెళ్లిపోయేదాన్నే, నువ్వు జ్ఞాపకం చెయ్యకపోతే. నువ్వన్నట్లు నే వెళ్లడం చూసి మళ్లీ దెబ్బలాడుకునేవారప్పుడు. అందంగాను, సువాసనతోనూ ఉన్న నిన్నే అందమైనదానివని నిర్ణయించాను" అంది.

బిళ్లగన్నేరు సంతోషం పట్టలేకపోయింది. పరిచారికలతో లక్ష్మీదేవి వెళ్లడం చూసి, ప్రక్కనున్న ముళ్లగోరింతతో—

అమ్మయ్యా, ఆవిడ వెళ్లాక ప్రాణం కుదుటపడింది. ఆవిడకోపం చూసి హడలిపోయాను. వాళ్లిద్దరిలాగే నాకేం శాపం యిచ్చిపోతుందో అని ప్రాణాలరచేతిలో పెట్టుకుని కూర్చున్నా. ఆ పరిచారిక సజ్జలో పూవుల్లాగ దేవుడి కాళ్లముందర పడివుండకుండా హాయిగా ఇక్కడ ఉంటాను" అంది.

లక్ష్మీదేవి బిళ్లగన్నేరు కంత గొప్పదన మిచ్చినందుకు ముళ్లగోరింతకెంతో విచారంగా ఉంది. ఈ సంగతి లక్ష్మితో చెప్తే, బిళ్లగన్నేరుని శపించి తన కేదో గొప్పపదవి యిస్తుందని ఆశించి, గబగబా వెళ్లి తోటనుంచి వెళ్లిపోతోన్న లక్ష్మితో బిళ్లగన్నేరుమాటలు చెప్పింది.

బిళ్లగన్నేరుమాటలకి లక్ష్మీదేవికి కోపం వచ్చింది.

"నువ్వే దేవుడి కాళ్లముందూ పడివుండనక్కర్లేదు. లే కంపుకొట్టుకుంటూ యిక్కడే పడి ఉండు" అని శపించి వెళ్లిపోయింది.

ఆనాటినుంచీ బిళ్లగన్నేరుకు పాడువాసన వచ్చింది. అప్పటినుంచీ బిళ్లగన్నేరు పూజకి పనికిరాకుండా పోయింది.



అమెరికా విమానవాహక నౌక "వ్యాలీ ఫోర్జ్"

కొరియా యుద్ధం

(27-వ పేజీ తరువాయి)

వస్తావో? కొంచెం కబురు పంపిస్తే నేను రానూ?

ధర్మ:—మహాప్రభూ! భూలోకంలో ఇంకా నాకు చోటెక్కడ? (దుఃఖిస్తుంది) (లక్ష్మీదేవి నవ్వుతుంది)

విష్ణు:—ఏం ప్రేయసీ! నవ్వుతున్నావ్?

లక్ష్మి:—అవిన్నీ ముందడగండి. ఎందు కేడుస్తున్నదో?

విష్ణు:—ధర్మదేవతా! నీదుఃఖానికి కారణం యేమిటి?

ధర్మ:—మహానుభావా! ఇప్పుడు భూలోకంలో మహాయుద్ధం జరుగబోతున్నది. ఇప్పుడే మొదలైంది. ఒకవైపు అమెరికావాళ్లున్నారు. వాళ్ల వెనుక కొన్ని దేశాలున్నవి. ఇంకోవైపు రష్యావాళ్లున్నారు. వాళ్లవైపు కొన్ని దేశాలున్నవి. ఈ రెండుపార్టీలూ కసాయికాండఅంతా నా కోసమేనని ప్రచారం చేసికొంటున్నారు. ఇదంతా అబద్ధం. శుద్ధఅబద్ధం. ఈ యుద్ధం వాళ్ల వాళ్ల స్వార్థాల కోసమే గాని నాకోసం ఎంత మాత్రం కాదు. నన్ను నిలువునా చంపివేసి ఇదంతా నాకోసమే అని వీళ్లకి వీళ్లు, వాళ్లకి వాళ్లు నమ్మకంగా చెప్పతున్నారు. నాఅక్క—శాంతిదేవత కొనఊపిరితో ఉంది. ఇదంతా ఆవిడకోసమే అనికూడా వీళ్లు చాటుతున్నారు. ఇదంతా వట్టిదని మేం చెప్పబోతే ఒకళ్లూ నమ్మడంలేదు. ఆత్మరక్షణకోసం ఆయుధాలు నిర్మించుకొంటున్నామని చెప్పడం మానవజాతికి సహజమైపోయింది. ఆయుధం కేవలం అహంకారరక్షణకే పనికివస్తుంది. ఆత్మరక్షణకు ఏ ఆయుధాలూ అవసరం లేదు—వ్యక్తికైనా, సంఘానికైనా, ఆసంగతి గాంధీమహాత్ముడు చెప్పనే చెప్పాడు. నీవూ చెప్పావు కృష్ణుడివై అర్జునుడికి గీతపేరుతో. నిన్నమొన్నటివరకూ గాంధీజీ ఇదే చెప్పి తన ఆత్మను కాపాడుకొనడానికి తన శరీరాన్ని వదిలేడు. ఆత్మని ఆత్మే కాపాడుతుందిగాని అహం కాపాడలేదుగదా? అహంకారాన్ని బలపరిచే ఆయుధం ఏలాగు కాపాడుతుంది? ఇప్పుడు మాపేరుమీద మహాఘోరాలు జరుగుతున్నవి భూలోకంలో. చూస్తుంటే గుండె పగిలిపోతుంది. సర్వలోకరక్షకా! యిది మహా అన్యాయం. (దుఃఖిస్తుంది. లక్ష్మీదేవి మళ్ళీనవ్వుతుంది.)

విష్ణు:—ఏం ప్రియురాలా! ధర్మదేవత దుఃఖిస్తుంటే నీవు నవ్వుతావేం?

లక్ష్మి:—నాథా, నవ్వవలసిన విషయాలకు ఏడ్వడం ఎందుకు? ధర్మదేవతవేదాంతం విన్నవాళ్లు నవ్వక ఏడుస్తారా? పైగా ఈ యిద్దరిదేవతల అవస్థ చూస్తుంటే నవ్వురాక మానుతుందా? నా మాయకు లోబడి, నా అండ చూచుకొని భూలోకంలో మానవులు అనేకఘోరాలు చేస్తున్నమాట నిజమే. ఈ శాంతిదేవత ధర్మదేవతల మాటలు నరులు వింటే అసలు కథ కంచికే వెళ్తుంది. వాళ్లు స్వార్థం కోసం కాక ఇదంతా ధర్మంకోసమే అని నటన చేస్తూఉండడం—ఇందులో ఏడ్వవలసిం దేముంది? అది వాళ్లస్వభావం. ఈ దేవతగాంధీజీ అంటుంది. అటువంటి పుణ్యాత్ములెవరో కొంతమంది మానవహింసాస్వభావాన్ని గెలిచి శాంతికాములైతే లాభం యేమిటి? ప్రపంచం అంతా మారినప్పుడు గదా ఈ యుద్ధాలు నశించడం? (నవ్వి) యీ మహాలక్ష్మిమాయలోనుండి తప్పించుకొని ప్రజలు యుద్ధాలు మానడం మాటలు కాదు. పాపం యీ ధర్మదేవత అనుకుంటుంది, "ఈ ప్రపంచం అంతా నా వల్లే జరుగుతుంది" అని. కాని నా ప్రభావం ఆమె కేం తెలుసు? (నవ్వుతుంది)

విష్ణు:—(చిరునవ్వుతో) మంచి నాటకమే. ధర్మదేవతా! విచారించకు. ఏ నాటకమైనా నాచిత్తంలేనిది జరగదు. ఇలా జరగడం నాకు మహానందం. నా ప్రియురాలు తనకు తెలియకుండానే ఇందుకు సహాయపడుతుంది. నీపేరు చెప్పి చేసే ఈ కసాయికాండకు అంతా వాళ్ళే బాధ్యులవుతారు. వాళ్ళే దాని ఫలితం అనుభవిస్తారు. నీ కేమీ భయం లేదు. నీ పరివారానికీ భయంలేదు. ఈ నాశనకాండ పూర్తిఅయ్యేక మిగిలినవాళ్లు, నిన్నూ, నీసోదరి శాంతిదేవతనూ నెత్తిపై పెట్టుకొని పూజిస్తారు.

లక్ష్మి:—విన్నావా? ధర్మదేవతా! యివన్నీ దేవరహస్యాలు. ఇక నిర్విచారంగా వెళ్లు.

నారద:—(ప్రవేశించి) నమస్కారం పూజ్యదంపతులారా! ఈ ధర్మదేవత ఇక్కడికు వచ్చి దుఃఖపడుతుం దేమి? ఈవిడగారి

కోసం భూలోకంలో ఎంతో తతంగం, ఎన్నో ఏర్పాట్లు జరుగుతున్నవే—

(అందరూ నవ్వుతారు)

విష్ణు :—మహాభక్తులంతా ఈవిడను రక్షించడానికే దెబ్బలాడుకుచస్తున్నామని చాటుకుంటారట! 'ఆసంగతి నాకేమీ తెలియదు మొర్రో' అని ఏడుస్తూ వచ్చింది. ఎంత వెర్రిదో చూడు. అందుకే ధర్మదేవత వెర్రిదంటారు.

నారద :—(చిరునవ్వుతో ఆవిడ ఇదంతా ఓర్చుకోలేదులెండి. నాకు మాత్రం మహానందంగా ఉంది. నటనసూత్రధారీ! ఈ యుద్ధాన్ని ఆపడానికి గాంధీజీశిష్యుడూ, భారత ప్రధానీ అయిన నెహ్రూ ఏదో ప్రయత్నం చేస్తున్నాడు. కొంపదీసి ఈప్రయత్నం ఫలించి వీళ్ళల్లో వీళ్ళు సంధిచేసుకోరుగదా! అంత పనే జరుగుతే, అర్ధాకలితో నీనామ సంకీర్తనం నే చెయ్యలేను. భక్తుణ్ణి.

ధర్మ :— } (నవ్వుతారు)
లక్ష్మి:— }

విష్ణు :—ఆ భయం లేదు. మొన్న నేను బ్రహ్మను కలిసికొన్నప్పుడు ఒకమాట చెప్పాడు.

నారద :—ఏమిటో ఆ మాట?

విష్ణు :—అబ్బే! ఈ మధ్య మృత్యుదేవత తపస్సు చేసింది తనకోసం! అతను ప్రత్యక్షమై ఏమి కావాలన్నాడట! నాకు ఆకలి దుర్భరంగా ఉంది. ఒకేసారి లక్షలాదిజీవాలను మింగాలని ఉంది. ఆవర మివ్వమందట. సరేలే, భూలోకంలో ఆటంబాంబుగా జన్మించు, నీ కోర్కె నెరవేరుతుందని వరమిచ్చాడట. ఇప్పుడు ఆవిడగారు అణువుబాంబురూపంలో భూలోకంలో పుట్టి ఆహారంకోసం ఎదురుచూస్తూన్నది. ఆవిడనాపడం ఇప్పుడు బ్రహ్మవశం కూడకాదు. పైగా ఈ వరంసంగతి చెప్పి అతను నన్ను ఏవిధంగానూ అడ్డురావద్దని బ్రతిమాలాడు. ఇప్పుడు అర్థమైందా? నీకూ, మృత్యుదేవతకూ కడుపునిండటానికి యీ యుద్ధం సంకల్పించబడింది. ధర్మదేవతా! విన్నావుగదా? ఈయుద్ధానంతరం ఇదంతా స్వార్థంకోసమే గాని, నీకోసం కాదని వ్రాసిపారేసే కవులను, చరిత్రకారులను సృష్టించివేయమని మా అబ్బాయికి ఉత్తరం వ్రాస్తా వెళ్ళు.

ధర్మ:—మహాప్రభూ! నీ లీలలు అగమ్యగోచరం! సెలవు.

నారద :—ధర్మదేవతా నేనూ వస్తున్నా, భూలోకానికి. దేవా, సెలవు.

(నిష్క్రమిస్తారు)

విష్ణు :—ప్రేయసీ! ఒకమాట! నీవున్నచోట ధర్మదేవతను చేరనీయ వెందుచేత?

లక్ష్మి :—మీకు తెలియదా? ఆవిడ చేరిందా ప్రజలు నన్ను తృణప్రాయంగా చూస్తారు. అందుచేత!

విష్ణు :—ఔను, నిజమే. ఐతే నన్నునమ్మినచోట మీ ఇద్దరికీ స్థానం ఉంటుందే!

లక్ష్మి:—నిజం. కాని ఈ మానవులు మిమ్మల్ని నమ్మితే నన్ను నమ్మరు. నన్ను నమ్మితే మిమ్మల్ని నమ్మరు. ఇది మహావిచిత్రం.

(నవ్వుతుంది)

౪ వ రంగం

(భూలోకం. హిందూదేశంలో ఎక్కడో ఒకచోట, ఒక దుకాణం వద్ద ఒక షావుకారు, ఒకపెద్దమనిషి)

ఒ. పె :—షావుకారూ! అగ్గిపెట్టె ఒక టియ్యవయ్యా :

షా :—ఆరుకాన్లు తెలిసిందా?

ఒ. పె:—ఏం వచ్చిందీ? ఆరుకాన్లెందుకూ?

షా :—(చిరునవ్వుతో) యుద్ధం వచ్చింది, అందుకు.

(ఆ పెద్దమనిషి నిష్క్రమిస్తాడు. ఇంకొకడు వస్తాడు.)

2వపె :—ఏమయ్యా! బియ్యం ఎలాగు ?

షా :—రూపాయికి సేరు.

2వపె :—చింతపండు ?

షా :—వీశె మూడు రూపాయలు.

2వపె :—బాగుంది. బెల్లం?

షా :—నిన్న రూపాయిన్నర. ఈవేళ రెండున్నర.

2వపె :—వేళాకోళం ఆడుతున్నావా?

షా :—మీతోడు. పాలడబ్బా రాజమండ్రిలో ఈవేళ రు. 1-12-0 నిన్న రూపాయణా అంటే రూపాయకి ముప్పావలా లాభం! మేం నయం కాదూ?

2వపె :—(నవ్వుతూ) బాగా నయంలే. కానీ, కానీ, మీవే రోజులు!

[సమాప్తం]

సాలెపట్టు

(17-వ పేజీ తరువాయి)

పాతబొంగే. కొద్దిమనిషి పల్చటి శరీరం. హత్యచేయబోయేముందో స్త్రీలా వేషం వేశాడు. అంచేత స్త్రీయే హత్యచేసిందని అక్కడివారంతా భావించారు. రూప్‌నాథ్ నగలన్నీ అతనివద్దనే దొరికినవి. అతన్ని విచారించేందుకు సిద్ధమవుతున్నారు.'

చెమటపట్టిన నొసలు వణుకుతున్న చేతితో తుడుచుకున్నాడు, కుమార్. పాపం యింతకీ ఆ పిల్ల అమాయకురాలే నన్నమాట! ఏది ఎలా వున్నప్పటికీ, ఎందుచేత పోలీసులను తప్పించుకుని పారిపోతున్నదీ; ఆమె చేసిన నేరమేమిటో కాని ఆమెమాత్రం రూప్‌నాథ్‌ను హత్యచేయలేదు. తనను తాను ఆమెను గురించి తప్పుటభిప్రాయం కలిగినందుకు నిందించుకున్నాడు. కాని క్షణకాలం నమ్మరాని ఆలోచన ఒకటి కలిగింది. రాత్రి తను చూసింది; స్త్రీవేషంలో వున్న మహదూలాల్ ఏమోనని, ఆ విషయం ఇప్పుడే తేలిపోతుంది. ఆమె ప్రతాప్ బిల్డింగ్స్‌లో కనిపించకపోతే పోలీస్‌స్టేషనులో విచారించవచ్చు.

వెంటనే నెం. 3 గదికి వెళ్ళాడు. ఆమె, రాత్రి తను ప్రేమించిన యువతే, వచ్చి తలుపు తీసి లోపలికి ఆహ్వానించింది. ఆమె రెండుచేతులూ తన చేతుల్లోకి తీసుకున్నాడు.

'మీరు రానే రారేమో అనుకున్నాను.' చిన్నగా అన్నది. ఆమెముఖం పరిశీలనగా చూశాడు. ఆ కళ్ళల్లో ఆజ్యోతులే ఇప్పుడూ జ్వలిస్తున్నాయి.

'ఆలస్యమైంది క్షమించు. కాని నిన్ను చూడకుండా ఎలా తప్పించుకుంటాను?' అంతే నిజంగా తన ఊహాగానం చెప్పలేదు. ఎలా చెప్తాడు?

'చూడండి. మీకు నా చరిత్ర అంతా చెబుతా మనిపిస్తోంది' అతనిపక్కనే కూర్చుని చెప్తున్నది.

'రాత్రి మా బాబాయియింట్లోంచి పారిపోయి వచ్చాను. నా తల్లిదండ్రులు పోయినప్పట్నుంచీ ఆయనదగ్గిరే వుంటున్నాను. నా బుద్ధి ఎగిరినప్పట్నుంచీ నానాహింసలు ఆయన పెట్టాడు. ఆ క్రూరత్వం ఎలాగో ఇన్నాళ్లూ భరించాను. చివరికి క్షమించరానిగా బర్దది ఆయన వ్యవహారం. రెండో పెళ్ళికి, ఓ వినాయకుడికి - పదిలక్షలున్నాయట. నన్ను బలవంతాన యిచ్చి పెళ్ళిచేద్దామని ప్రయత్నిస్తున్నాడు. ఇహ భరించలేక పారిపోదామని చాలాకాలంనుంచీ ప్రయత్నించాను. నా మనసు ఆయనకి ఎలా తెలిసిందో, నాకు గట్టిగా చెప్పాడు. నేను గడపదాటిన మరుక్షణాన్నే పోలీసులను వెతకటానికి పెట్టిస్తానని చెప్పాడు. సరే, మా స్నేహితురాలి గదికి ఎలాగైతేనేం సుఖంగానే చేరాను మీ దయవల్ల.'

నిశ్చలంగా వుందామని కుమార్ ఎంతగా ప్రయత్నించినప్పటికీ ఆమె చేతులు పట్టుకున్నప్పుడు అతనిచేతులు వణికినై. 'ఈ విషయాలన్నీ నిన్నెందుకు చెప్పలేదు? లేనిపోని బాధలన్నీ తప్పేవిగా!'

'మీరు నన్ను మళ్లా ఆయనకి అప్పచెప్పుతారేమో నని భయపడ్డాను. ఆయన మీకు తెలుసునాయె. హీరాచంద్ మీకు తెలియదూ? మిమ్మల్ని గురించి చాలాసార్లు చెప్పాడులెండి. ఆయనస్నేహితుల యిళ్ళల్లో ఎక్కడా ఆశ్రయం తీసుకునేదానిని కాదుగాని, మీయింటిదగ్గర కొచ్చేప్పటికి, ఎవరో నన్ను అనుసరిస్తున్నట్లు అనుమానం కలిగి వెంటనే మీ తలుపు తట్టాను.'

'హీరాచంద్?... నా కాయన పెద్ద స్నేహితుడు కాడే. ఏదో వ్యాపారవిషయాల్లో కొంత పరిచయముంది. ఆయన చాలా మూర్ఖుడని, మొండివాడనీ తెలుసు. ఆయన కో మేనకోడలు అందాల పిల్ల వుందనీ, చాలా బాధలు పెట్టుంటాడని విన్నాను. కాని నే నెప్పుడూ అనుకోలేదు, ఇంత అందంగా వుంటుందని, అబద్ధాలు చెప్పేదానికంటే నిన్నే ఈ కథ అంతా చెప్తే ఎంత బాగుండేది! నీకు గుర్తువుందా నే నేమన్నానో "ఒక్క అబద్ధం చెప్పటానికి నూరు అబద్ధాలతో సాలీడు గూడు అల్లాలి" అని నీకథ ముందుగానే తెలిస్తే...'

'ఇప్పుడుమాత్రమేం? మీరు సాయం చేయునేచేశారు. ఒకవేళ మీకు చెప్పివుంటే ఏమి జరిగేది?'

తన ఊహాగానం ఆమె ఊహించకుండా ఉండేందుకు కుమార్ నిశ్శబ్దంగా ఉన్నాడు.


'కాని, ఇవ్వాళ నిజం ఏమి దాచకుండా చెప్పేద్దామనుకున్నా. కాని మీరు నాలుగింటికి వస్తానని చెప్పి, రాలేదు. నా సంగతే మరిచిపోయివుంటా రనుకున్నాను. నన్నుగురించి మీరు ఏమనుకున్నారు? ఏదో పెద్ద నేరం చేశానని,-ఊఁ?

'ఆఁ లేదు. ఏవిధంగా భావించవలసిందీ నాకు తెలియలా' సాలీడుగూడు అల్లినది తనే అని ఇప్పుడే గ్రహించాడు. కుమార్.

'సరే, ఇహ ఏమి చేద్దామని నీ వూహ?'

'ఇంకా ఏమి తేల్చుకోలేదు. మా నాన్నగారు చనిపోతూ యిచ్చిన నగలు తెచ్చుకున్నాను. అవి అమ్మి కొంతకాలం నెట్టుకొస్తాను. సరే, ఎక్కడైనా వుద్యోగం దొరికితే చేద్దామని. రోజుకు రెండు మూడు గంటలు పనివినా సరే. ఎంతకాలమని స్నేహితుల యిళ్లలో? మీరు నాకువుద్యోగం సంపాదించగల రనుకుంటా.'

ఆ యువతి చేయి పుచ్చుకుని కుమార్ మృదువుగా మందహాసం చేశాడు. 'మా బాబాయి ఒకవేళ చూసినా తీసుకువెళ్ళటానికి వీల్లేని వుద్యోగమే ఇస్తాను. ఆ వుద్యోగంలో రోజుకు రెండు మూడు గంటలపని కాదు. రోజల్లా పనే. మొట్టమొదట మాయింట్లో కాలుపెట్టినప్పుడు ఏమడిగావో గుర్తు వుందా? నీ జీవితమల్లా మా యింట్లోనే నీవు "తల దాచుకోవాలి". అంతకాలమూ నీ హృదయంలో నాకు స్థాన మివ్వాలి.'



ప్రతీక్ష

(11-వ పేజీ తరువాయి)

కూతుర్ని చూసి. అమ్మా! వచ్చావా? అంటూ కావిలించుకుని బావురుమన్నాడు తండ్రి. శారద విషయాలన్నీ చెప్పింది. భర్తకు మదరాసులో ఉద్యోగం దొరికిందనీ, నెల్లాళ్ళలో యిల్లూ, అవీ కుదుర్చుకుని, వచ్చి తీసికెళ్తానన్నారనీ, యీ నెల్లాళ్లూ యిక్కడే ఉండామని వచ్చాననీ, ఇంకా ఏవేవో చెప్పింది. అన్నీ విన్నాడు తండ్రి.

"ఏమోనమ్మా! ఉద్యోగమేతగలడతాడో, వురె పెట్టుకుంటాడో? అతని మాటల్లో నాకేం నమ్మకం లేదు. అతడెందుకూ పనికిరాడనే నా విశ్వాసం. ఆ తర్వాత నీ అదృష్టం" అన్నాడు తండ్రి.

తండ్రిమాటలు శారద హృదయాన్ని ఎంతో గాయపర్చాయి. డబ్బులేనివాడు గాబట్టి, తన భర్తని తండ్రి అంత నీచంగా అగౌరవంగా మాట్లాడుతున్నాడు. వెధవ డబ్బు! పాకేది సంపాదిస్తోంది. మనిషిఅంటే ఇంత తేలికా అనుకుంది. మరి జవాబు చెప్పలేదు శారద.

రోజులు గడచిపోయాయి. మూర్తి వెళ్లి అప్పుడే యిరవై రోజు లైంది. ఆనాడే వచ్చింది ఉత్తరం. ఉద్యోగంలో కుదిరాడనీ, ఇల్లుకూడా చూశాడనీ, విదియా సోమవారం వస్తున్నాడనీ, తీసికెళ్లడానికి. - శారదా, తండ్రీ, యిద్దరూ చూశారు.

శారద, "మాశావా? నాన్నా! నా మాటలు నమ్మవు కావు? ఇప్పుడైనా నమ్మకం కలిగిందా? రత్నం ఎంతకాలం రాళ్లలో పడివున్నా అది ఏనాటికయినా, ఎవరిచేతనయినా గుర్తింపబడకపోదు" అంది. తండ్రి మౌనంగా పెదవి విరిచాడు సమాధానంగా- ఆ రోజు గడచిపోయింది.

విదియా సోమవారం శారద ముస్తాబై ఎంతో ఉత్సాహంగా ఉంది. మూర్తి మెయిల్ దిగితే, రెండుగంటలకల్లా ఇంటికి వస్తాడు. తన భర్తతో మద్రాసు వస్తుంది. మద్రాసులో ఎంతో హాయిగా ఉంటుంది. తాను ఎంతోకాలంనుంచి ఊహించి, కన్న కలలన్నీ నిజమయ్యే దినాలు సమీపిస్తున్నాయి. జీవితంలో కష్టాలూ, ఆపదలూ, మనుష్యులకు రాకపోతే మానులకు వస్తాయా. నిజంగా మూర్తి ఎంత మంచివాడు? సంసారంలో ఆర్థికబాధలవల్ల అప్పుడప్పుడు అతన్ని నొప్పించేమాటలుగూడా తననోట జారేయి. కాని అవేవీ తను మనస్సులో పెట్టుకోనేలేదు. తనకిమాత్రం సంపాదించుకోవాలనీ నలుగురిలాగా గౌరవంగా బ్రతకాలనీ, పెళ్ళాన్ని సంతోషపెట్టాలనీ లేదాయేం? ఏదో గ్రహచారవశంవల్ల ఇన్నాళ్లబట్టీ సరి అయిన ఉద్యోగం దొరకలేదు. అసలే అభిమానంకల మనిషి. విధిలేకగాని అలాంటి షుగర్ ఫ్యాక్టరీలో ముప్పైకో, నలభైకో కూలిపని చేశేమనిషేనా మూర్తి? ఎంత తెలివయినవాడు? ఎటువంటి ఉన్నతభావాలు కలవాడు? అతను మనస్సులో ఎంతో ఖేద పడుతూనే వుండేవాడు: తన సంపాదన నిత్యజీవితాన్నే ధైర్యంగా యెదుర్కోడానికి చాలడంలేదనీ తనమీద ఎన్నో ఆశలూ కోరికలూ పెట్టుకుని తనవాళ్ళందర్నీ కాదని తన్నే ప్రేమించి పెళ్లిచేసుకున్న భార్యని సంతోషపెట్టలేకపోతున్నాననీ కాని ఏం చేస్తాడు. దేనికయినా రోజులు రావాలిగదా. ఈమాత్రం జ్ఞానం లేక దరిద్రుడనీ స్థిరబుద్ధిలేనివాడనీ, అప్రయోజకుడనీ, సోమరి అనీ, భర్తనుగూర్చి తనముందే తండ్రియెడల తనకు అంతకుముందున్న పూజ్యభావం క్రమంగా సన్నగిల్లింది. ఎంత సంస్కారం లేని హృదయం తండ్రిది? క్రమంగా ఆయనలోనూ పరివర్తన రాకపోదు. ఇంక అతనికేం భయంలేదు. లోకం ఏమనుకున్నా తండ్రియేమనుకున్నా తనకి లెక్కలేదు. తాను భర్తతో మద్రాసు ఎలాగా వెళ్ళిపోతుంది. తనజీవితం మద్రాసులో ఎంతో శోభగా ఉంటుంది. తనకి చిన్నప్పట్నించీ మద్రాసులో కొంతకాలం ఉండాలని భర్తతో సాయంసమయాల్లో బీచికి కార్లు చేయాలనీ సినిమాలకు వెళ్ళాలనీ "ఫలానా మూర్తిగారి భార్య ఈమె" అని నలుగురూ అనుకోవాలనీ ఆమె కోరిక. అప్పుడే ఒంటిగంటయింది. ఇంకో గంటకల్లా మూర్తి వస్తాడు. స్టేషన్లో దిగి జట్కాలో రావాలి. వచ్చేసరికి బహుశా మూడవచ్చు. కాఫీనీళ్ళు పెట్టి స్నానానికి వేడినీళ్ళు తోడి, సబ్బుబిళ్లా తువ్వాలూ, సిద్ధంగా వుంచింది. క్రమంగా ఆమె ఆలోచనలతోనే మూడయింది. టయము సమీపిస్తోంది. శారద ఒకసారి లోపలికివెళ్లి అద్దంలో చూసుకుని ఇవతలకొచ్చింది. భర్త బండిదిగి రాగానే తనని గూర్చి ఆశ్చర్యపోవాలి, అంతలా ఆమె ఎప్పుడూ అలంకరించుకోలేదు-ఇంకా బండిరాలేదేం చెప్మా? ఒకవేళ నడిచిగా వస్తున్నాడేమో? ఆమె ఆలోచిస్తూంది. తండ్రి పొలంలోకి కాబోలు బయల్దేరుతూ, "అలా పొలంలోకి వెళ్తున్నానమ్మాయ్! ఏమిటో వెర్రిదానివి; వాడి మాటలు నువ్వు నమ్మి మోసపోతున్నావు. ఈవేళ వస్తాడనే నీ పిచ్చి నమ్మకం. బహుశా రాడు. నాకు నమ్మకం లేదు. వస్తే మాత్రం సంతోషమే. నేను పొలంలోకి వెళ్లానని చెప్పు" అంటూ వెళ్లాడు.

పొరుగింటి శ్యామల వచ్చి శారదని చూసి, "ఏవమ్మాయ్! బలే కులాసాగా ఉన్నావ్? మీ ఆయనగారు ఇవ్వాళే వస్తారా ఏమిటి? మదరాసువెళ్లి మమ్మల్నందర్నీ మరచిపోతావు కాబోలు?" అంది.

చాల్లేవే! నువ్వుమాత్రం వెళ్లవా యేమిటి? నీ మొగుడితో హైదరాబాదు" అంది శారద.

ఇంతట్లోనే ఎర్రసైకిలు ఒకటి ఆ ఇంటి ముందు ఆగింది.

"కామేశంపంతులుగారు" టెలిగ్రాం అన్నాడు పోస్టుమన్ను!

"ఏదీ ఇలా ఇయ్యి-ఏమిటి? టెలిగ్రామా! ఎక్కణ్ణుంచి?"

అంటూ చించింది శారద కవరు. ఇంగ్లీషులో కామేశంపంతులు, రామనగరం, మీ అల్లుడుమి, స్తర్ జె. ఎస్. మూర్తి గతరాత్రి సూళ్ళూరుపేట మెయిల్ ప్రమాదం కారణంగా క్షతగాత్రులయి హాస్పిటల్లో జేర్చబడి మరణించినవారిలో ఒకడుగా గుర్తింపబడినాడు. జేబులోని రికార్డువల్ల అడ్రసు గుర్తింపబడినది. పబ్లిక్ రిలేషన్సు ఆఫీసర్" అని వుంది. శారద నిలువునా కొయ్యబారిపోయింది.

*   *   *

అప్పటినుంచి ఇప్పటివరకూ వరండాలో సాయంత్రం ఆరు గంటలనుంచి రాత్రి తొమ్మిది గంటలవరకూ శారద మూర్తికోసం ప్రతీక్షిస్తూనే వుంది. కాని మూర్తి ఇప్పటివరకూ రాలేదు.

మనదేశం

(8-వ పేజీ తరువాయి)

సమస్య ఒకటైతే చికిత్స భిన్నంగా ఉండడం ఇదే మన ప్రభుత్వాలు నేడు చేస్తున్న పొరపాట్లకు మూలం. మన నాయకులు దృష్టి మార్చుకుని వాస్తవస్థితిగతుల్ని అవగాహన చేసుకోనంతకాలం దేశంలో సమస్యలు పరిష్కారం కావడం అసంభవం. ఆపైన దోషం అంతా ప్రభుత్వానికి పూర్తి సహకారమీయని ప్రజలపైన ఆరోపించడం వల్ల ప్రయోజనం పీసమైనా ఉండబోదు. అంతేకాదు. ఎప్పటికప్పుడు కొత్త సమస్యలు ఉత్పన్నం కాగలవు.

ఆహారసమస్య *

ఆహారసమస్యపై చర్చకు సమాధానమిచ్చిన మున్షీగారు దేశంలో వాస్తవంగా ఆహారం కొరత లేదన్నారు. బీహారు, చెన్నరాష్ట్రం, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలలో అక్కడక్కడ కొద్ది ఇబ్బంది కలిగిందేమోగాని, వాస్తవంగా ఆకలివల్ల ఎవరూ చనిపోలేదనీ, అంత ప్రమాదం సంభవించబోదనీ చెప్పారు. అయితే ఆహారంపైన కంట్రోల్ తొలగించడం ఇప్పుడసంభవమన్నారు. ఆహారం అధికంగా పండించే రాష్ట్రాలు సేకరించడానికంత ఉత్సాహం చూపడం లేదు. కొరవగా ఉన్న రాష్ట్రాల్లో అనవసరపు భయాలు, పుకార్లు, అధికంగా ఉన్నాయన్నారు. దేశంఅంతటా తృప్తికరంగా ధాన్యం సేకరించబడినట్లయితే ఎక్కడా కరువు సంభవించదు. కాని ఒకొక్క రాష్ట్రంలో ఒకొక్కవిధంగా సేద్యం, ధాన్యసేకరణ మొదలైనవి జరుగుతున్నందువల్ల కంట్రోల్ అనివార్యమయిందన్నారు. దేశంలో రెండు తెగల మనుష్యులున్నారన్నారు మున్షీగారు. ఒకరకం కంట్రోల్ మనుష్యులు మరొకరకం కంట్రోల్ రద్దుమనుష్యులు. మంత్రి గాకపూర్వం కంట్రోల్ రద్దు కక్షలో ఉండేవారట మున్షీగారు. మంత్రి అయినతరవాత బాధ్యత గుర్తెరిగినందువల్ల కంట్రోల్ మనిషిగా మారిపోయారట. ఇటువంటి మార్పుకి బాధ్యత ఒక్కటే కాకుండా కొరియాయుద్ధం కూడా ఒక కారణంట.

భయభీతులమూలంగా దేశంలో లేని కొరత ఏర్పడుతుందన్నారు మున్షీగారు. కాని కొరత తీర్చాలంటే ముందుగా భయభీతుల్ని కాశీలో విడిచిపెట్టాలి. పుకార్లు మానెయ్యాలి. అయితే భయభీతుల్ని కంట్రోల్ చెయ్యడం ఎల్లాగ? వస్తువుల కంట్రోల్నే సక్రమంగా నిర్వహించడం ప్రభుత్వానికి కష్టంగా ఉందే!

ఆర్థికసమస్య

ఆర్థికసమస్యగురించివచ్చిన విమర్శలకి సమాధానమిస్తూ ఆర్థికమంత్రి చింతామణిదేశ్‌ముఖ్‌గారు దేశంలో ఆర్థిక పరిస్థితి గడ్డుగా ఉన్నప్పటికీ, గుండెబేజారెత్తిపోవలసిన పనిలేదన్నారు. అదెల్లాగంటే ప్రభుత్వాలు చేసిన ఋణాలకి ప్రజలు కావలసినంతగా ఇవ్వగలగడమే సూచనన్నారు.

ఈ క్రిందఅంశాల్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఆర్థికసమస్యని పరిష్కరించచూస్తున్నదన్నారు:

1. ధరలుహెచ్చు మీరిపోడానికి వీల్లేకుండా ద్రవ్యవ్యవహార నిర్వహణ. 2. ఖర్చుల్లో పొదుపు. 3. పొరుగుదేశాలతో మంచిగా ఉంటూ దేశంలో ఎక్కువ ఆపదలేకుండా చూడ్డం. 4. ఆహారధాన్యాలు, ప్రత్తి, నారపంటల్ని స్వయంసమృద్ధిగా పండించుకోడానికి ప్రయత్నించడం. 5. పారిశ్రామికవస్తూత్పత్తి పెరుగుదలకు అనువైన వాతావరణం కల్పించడం. 6. పల్లెప్రాంతాల్లో వీలైనంతవరకు నిరుద్యోగం, నిర్వ్యాప్తి తగ్గించడానికి కృషి చెయ్యడం. 7. ధరల నడకల్ని ఒకకంట కనిపెడుతూ, అట్టే తందనాలాడితే నొక్కిపట్టడం. 8. దేశంలో కల వస్తుసంపదని సద్వినియోగం చెయ్యడం.

దేశంలో ఆర్థికపరిస్థితి క్లిష్టంగా ఉన్నప్పటికీ బాగుపడుతున్నదని మంత్రి దేశ్‌ముఖ్‌గారన్నారు. ఇందుకుగాను ధరలపోకడల్ని తార్కాణంగా చూపారు.

1949 డిసెంబరునుంచి 1950 జూన్ వరకూ ధరలు అమెరికాలో నూరింట 15.2 వంతులు బ్రిటన్‌లో నూరింట 67.2 వంతులు పెరిగితే భారతదేశంలో నూరింట 3.7 వంతులే పెరిగినాయట.

ధనాదాయం పట్నాలనుంచి పల్లెలకు పోయి దాక్కుంటున్నందువల్ల పెట్టుబడికిప్పుడింత ఇబ్బంది కనపడుతున్నదనీ, పల్లెల్లో దాగిన ధనాన్ని సద్వినియోగం చెయ్యడానికి రాష్ట్రప్రభుత్వాలకు ఇప్పుడు మంచి వీలున్నదనీ దేశ్‌ముఖ్‌గారు చెప్పారు. కాబట్టి ఆ ధనాన్ని సంచయం చేసుకోడం మేలుకాని రాష్ట్రప్రభుత్వాలు మాటిమాటికీ ఢిల్లీప్రభుత్వాన్ని "డబ్బుతే డబ్బుతే" అని అడగడం బాగులేదన్నారు.

మద్రాసుప్రభుత్వ ఋణం

గారు చెప్పినదానికి ఒక తార్కాణం కూడా కొందరు చూపుతున్నారు. మద్రాసు ప్రభుత్వం నాలుగుకోట్ల రూపాయలఋణం కావలసివచ్చి మార్కెట్‌కి ఎక్కింది. (బొంబాయి మధ్యప్రదేశ్ ప్రభుత్వాలమాదిరిగానే) నాలుగు కోట్లలో మూడుకోట్లు [illegible]శం మీద, కోటిపైగా తిరునల్వేలిజిల్లాలోనూ లభ్యమయింది. తిరునల్వేలిజిల్లాలో వచ్చిన కోటి 28 లక్షల్నీ ఆ జిల్లాలో మణిముక్తానది ప్రాజెక్టునిర్మాణంకోసం ప్రత్యేకిస్తారట. ఈ కోటి 28లక్షల్లోనూ ప్రజలు స్వయంగా ఇచ్చినది 7లక్షలే. ఒక లక్ష ట్యుటికొరిన్ పోర్టుట్రస్ట్‌వారిచ్చారు. 48లక్షలు ప్రజలపరంగా ఇండియన్ బాంకు ఇచ్చింది. 72లక్షలు మిగతా బాంకులిచ్చాయి. ప్రభుత్వం తీసుకున్న మిగతా ఋణం 3కోట్లలో కోటి రూపాయలు తాత్కాలికం పెనీవారిచ్చారు.

తిరునల్వేలిజిల్లావారు ఇచ్చిన ఋణం చూసి మురిసిపోతున్నారు. తుంగభద్రకీ ఆమాదిరే చెయ్యాలన్నారు తాతాచారిగారు మద్రాసుశాసనసభలో. ఆ మాట కొస్తే ఏ ప్రాజెక్టుకిమాత్రం ఆపని చెయ్యకూడదు? బాంకుల చలవే ఉండాలిగాని. (అదీ మనకి చిక్కే. తెలుగుదేశంలో పుట్టి పెరిగి పెద్దవైనవి ఒకటో రెండో తప్ప అపాటి ఆదుకునే బాంకులు లేవు.)

మద్రాసుశాసనసభ *

మద్రాసుఉభయశాసనసభల సంయుక్తసమావేశంలో గవర్నరుగారు ఉపన్యసిస్తూ, ఆహారసమస్య, విద్య, ఓటర్ల జాబితాలు, హరిజనాభ్యుదయం, గృహనిర్మాణం, బస్సురవాణా, కొత్తశాసనాల ప్రసక్తి తెలిపారు. ఆహారం కొరతబాగ కొంత వరకూ 1952కి తగ్గుతుందన్నారు. తుంగభద్ర, దిగువభవానీ, మలంపుజప్రాజెక్టులవల్ల 1952కి చాలా భూమి కొత్తగా సాగులోకి వస్తుందన్నారు.

దేశంలో ఏర్పడిన కొరతమూలంగా ఇప్పుడు రేషనింగ్ అమల్లో ఉన్న ప్రాంతాల్లో రేషన్‌ప్రమాణాన్ని 8 ఔన్సుల

నుంచి 7 ఔన్సులకి తగ్గించక తప్పలేదన్నారు. అయితే ఆకొరవని గోధుమతో భర్తీచేస్తున్నారు. 1952కి ఆహారం అధికంగా వొచ్చేలోగా ఈ సమస్యని పరిష్కరించడానికిగ్గాను ఉన్న భూమిలోనే ఫలసాయాన్ని పెంచడానికీ, సేకరణ మరింత జోరుగా సాగించడానికీ, ఇంకా తేవాలని భారతప్రభుత్వాన్ని కోరడానికే మద్రాసు ప్రభుత్వం నిశ్చయించుకుంది. ఈ పద్ధతుల మూలంగా అందరికీ ఏఅర్ధాకలిగానో అన్నమిచ్చి "ఆకలిచావులు" లేకుండా కాపాడగలరు. ఇది కాక రైత్వారీ భూముల్లో రెవిన్యూశిస్తునిర్ణయవిధానాన్ని సంస్కరించడానికి ప్రభుత్వం తలపెట్టి ఒక విచారణాసంఘాన్ని నియమించింది. వీరింకా విచారిస్తున్నారు. దేశంలో శాంతిభద్రతలు తృప్తికరంగానే ఉన్నాయి. కమ్యూనిస్టు ముప్పు చాలావరకు తగ్గిపోయింది.

మణిముక్తానది ప్రాజెక్టునిమిత్తం కోటి 78 లక్షల్ని ఆ జిల్లావాసులు ప్రభుత్వానికి ఋణమివ్వగలిగారనేసరికి కొందరు శాసనసభ్యులికి మంచి ఉత్సాహం కలిగింది. ఈమాదిరిగానే రామపాదసాగరం, కృష్ణా, పెన్నా ప్రాజెక్టులనిమిత్తం ఏర్పాట్లు చెయ్యడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉండాలన్నారు తాతాచారిగారు. కాని పాపం మంత్రుల్లో ఒక్కరైనా మళ్ళీ ఈ ప్రమేయం తేలేదు.

ఇరిగేషన్, హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టుల నిర్మాణంవిషయంలో మద్రాసు మంత్రులు ప్రదర్శిస్తున్న సాహసాన్ని, ధైర్యాన్ని, పట్టుదలని తాతాచారిగారు కొనియాడారు.

చెన్నపట్నంలో బస్సురవాణాని ప్రభుత్వం అధీనంచేసుకున్నతరవాత వారు పెట్టిన ఖర్చులు వచ్చిన లాభాలు వగైరా తెలియచెయ్యాలని ముత్తయ్యచెట్టిగారన్నారు, నష్టం వచ్చిందనే వదంతిని జ్ఞప్తికి తెస్తూ. దీంతో కొందరు మంత్రులికి పౌరుష మొచ్చింది. బస్సురవాణా ప్రభుత్వంచేతుల్లో అద్భుతంగా నడుస్తోందని చెప్పి, ఇంకా మరికొన్ని ప్రాంతాలకూడా ప్రభుత్వం స్వాధీనం చేసుకోదలిచిందని మంత్రిగారన్నారు. ఇంకెక్కడెక్కడ బస్సుకంపెనీలకి బాగా లాభాలొస్తున్నాయో, వాటి. పనికూడా పడతామని బెదిరిస్తున్నారన్నమాట.

దక్షిణాదిని కరువు చెలరేగిపోతోందని కొందరు సభ్యులన్నారు. అన్నం లేక అనేకులు ఆకు, అలం తిని బతుకుతున్నారనీ, వీళ్ళకి అతిసారపురోగం పట్టుకోడానికి ఆట్టే రోజులు పట్టవనీ చెప్పారు. అంతకంటె జోరుగా బియ్యపు బస్తాల్ని తాడేపల్లిగూడెంనించి పరుసు లెత్తిస్తున్నారని మంత్రులు చెప్పారు. చెంగల్పట్టు జిల్లాలో (అంటే చెన్నపట్నంలోని మంత్రుల మోచేతి కింద) జూలైమాసంలోనే 500 ఎకరాల్లో కోతలైనాయనీ, కాని అందులో ఒక్క గింజైనా దక్కకుండా భూగర్భంలోకి (బ్లాక్‌మార్కెట్ లోకి) నిర్భయంగా వెళ్ళి దాక్కుందనీ వరదాచారిగారు చెప్పారు. కంట్రోల్ తీసేస్తే చాలు కరువు పోతుందన్నారు.

కూర్మయ్యగారు మాట్లాడుతూ వ్యవసాయసంస్కరణల పేరు చెప్పి మధ్యరకంమనుషులు లబ్ధి పొందారే కాని అసలు కష్టపడేవాళ్ళ నోట్లో రాయి పడిందనీ, విద్య ఉద్యోగాలు మొదలైన సౌకర్యాల్లో హరిజనుల పేరు చెప్పి ఇతరులు నొల్లుకుంటున్నారనీ వాపోయారు. రాఘవయ్యగారు మహమ్మద్ ఇస్మాయిల్ గారు కులనివృత్తి ప్రసక్తి తెచ్చారు. మద్రాసుప్రభుత్వం చేసిన ఋణంలో వీరి బలం ఆట్టే కనబడలేదనీ, అండర్ రైటర్లకి కమిషన్ తుడిచిపెట్టుకుపోయిందనీ నటేశన్‌గారన్నారు.

మంత్రి గోపాలరెడ్డిగారు సమాధానమిస్తూ ఆహారసమస్యని పరిష్కరించడానికి

(37-వ పేజీ చూడుడు)

భూదేవతకి ప్రజలభారం దుర్భరంగా ఉన్నదా?

★

(గత సంచిక తరువాయి)

[యం. ఇల్యిన్ వ్యాసం ఆధారంగా]

అమెరికాలో నాయకులి కిందు రెండు వింత సమస్యలు వచ్చిపడ్డాయి. ఒకటి- ఆకలి తీర్చలేని అదనపు జనాభా, రెండు నానాటికి పెరిగిపోతున్న ప్రభుత్వపు ఆహారపదార్థాల నిలవలు.

రెండు సమస్యలూ ఒకేసారి ఎలా ఉత్పన్నమైనాయని ఆశ్చర్యం కలగవచ్చును. కాని పరిస్థితే వింతగా ఉంది.

అమెరికన్ వ్యవసాయశాఖకార్యదర్శి బ్రానన్ మార్చి 31 వ తేదీని ఇలా అన్నాడు. "మాంసం, పాలు, వెన్న, కోడిగుడ్లు మొదలైన వస్తువుల వాడకం నానాటికి తగ్గిపోతోంది. ప్రభుత్వంవద్ద మిగిలిపోతున్న నిలవలు పెరిగిపోతున్నాయి."

అయితే ఇలా మిగిలిపోతున్న ఆహారపదార్థాల్ని ఆకలితో బాధపడుతున్న దేశాలకి తరలిస్తారా అంటే అదీ లేదు. అలా మిగిలిపోవలసిందే. కుళ్ళిపోవలసిందే.

ఈరీతిగా ఆహారపదార్థాల్ని నిలవచేసి ధ్వంసం చెయ్యడం ఎందుకు? ఆ వస్తువుల ధరలు తగ్గిపోకుండా గిట్టుబాటులో ఉంచడానికి. ధరలు తగ్గుతాయంటే అమెరికన్లకి హడల్. ఆర్థికమాంద్యం 1931-32 లో సంభవించినట్లుగా వచ్చిపడుతుందేమోనని వారి భయం. కాబట్టి ధరల పోటీ రాకుండా ఆ ధరల్ని నిలవబెట్టడానికి ఎంత గిరాకీ అవసరమో చూసి వీలైనంత కొనేసి నిలవచేసి చివరకి ధ్వంసం చెయ్యడానికిగాను 400 కోట్ల డాలర్లు ఖర్చుపెడుతోంది అమెరికన్ ప్రభుత్వం.

అమెరికాలో పరిస్థితి ఇలా వుంటే, భూమిపైన ప్రజలందరికీ ఆహారం చాలదని వారి విజ్ఞానశాస్త్రవేత్తలు చెప్తున్నారు. ప్రపంచంలో సాగుచెయ్యడానికి చాలినంత సారవంతమైన భూమి లేదంటారు. సంపదుత్పత్తికి మానవుల అధీనంలో ఉన్న ప్రకృతి కృశిస్తున్నదంటారు. ఆహారపదార్థాలే కాకుండా కొన్నిదశాబ్దాల్లో ప్రపంచంలో కల బొగ్గుగనులు, ఇనుము, కలప మొదలైనవన్నీ ఖాళీ అయిపోతాయంటున్నారు.

అమెరికాలో అంతపనీ జరుగుతోంది. బొగ్గుగనుల్ని చిత్తంవచ్చినట్లు ధ్వంసం చేస్తున్నారు. పెచ్చు లాభాలొచ్చేవరకు గనులు తవ్విస్తారు. గనిలో సరుకు కొంచెం తగ్గుదలమాపగానే దాని కర్మానికి దాన్ని వొదిలేసి పోతారు. నూనిగనుల గతీ ఇంతే. ఇంకొకడికి చుక్కైనా దక్కకుండా గోకెయ్యాలనే ప్రతివాడూ ప్రయత్నిస్తాడు. అలాగే కలపకూడా.

సహజసంపదని పొదుపుగా వాడవలసిన మాట, అలా వాడకపోతే త్వరలో అఖరయ్యే మాట నిజమే. కాని విజ్ఞానశాస్త్రం వృద్ధి పొందుతున్నకొద్దీ, సంపదల్ని పొదుపుగా అందరికీ అందుబాటుగా వాడ్డం నేర్చుకోవాలి. ఓపిక ఉండాలే కాని ప్రకృతిలో వస్తుసంపదను అపారంగా తీసుకోవచ్చును. ఇనుపగనులు కృశిస్తున్నాయి. ఇతరత్రా ఇనుము సంపాదించగల మార్గాలున్నాయి. గ్రానైట్ రాయిలోనుంచి ఇనుము తియ్యవచ్చును. మామూలుమట్టిలోనుంచి అల్యూమినియం తియ్యవచ్చును. మెగ్నీషియం, బెరైలియం, మొదలైనవాటికి నిజంగా కరువు లేదు. నేలపై పొరలోనే దొరుకుతాయి. ఎరువులోకి అవసరమయ్యే నత్రజని చిలీదేశంలోని సాల్ట్‌పీటర్‌లోనే లభ్యమౌతుందనుకునేవారు. కాని ఇప్పుడది గాలినుంచి పొందవచ్చును.

వస్తువువిలువ సరీగా తెలుసుకోగలగాలే గాని సంపదకు లోటు లేదు. ఇసుక, మన్ను, నీరు, గాలి, సూర్యరశ్మి మొదలైనవానిని వస్తూత్పత్తికి వినియోగపరచుకోవచ్చును.

సముద్రాల్ని భూఖండాల్ని సమగ్ర దృష్టితో పరిశీలించి మానవుడు సంపద్వృద్ధికి దీక్షతో కృషిచేయాలి. పర్వతాలూ చదును ప్రదేశాల ఉనికినిబట్టి ఆహారసంపదల ఉత్పత్తిని అనుకూలంగా నిర్ణయించుకోవాలి.

ఏయేవస్తువులు లభ్యం కాగలవో, ఎంత సహజశక్తి వినియోగానికి వస్తుందో ముందు సమగ్రంగా తెలుసుకోవాలి.

[సశేషం]

మనదేశం

(36-వ పేజీ తరువాయి

ప్రభుత్వం ఎన్ని తిప్పలు పడుతున్నదీ విశదంగా చెప్పారు. కమ్యూనిస్టుల్ని చితక్కొట్టేశారనీ, గ్రామరక్షకదళాలు ఇప్పుడు మరీ బాగా పనిచేస్తున్నాయనీ చెప్పారు.

ధరల పెరుగుదలని అరికట్టడానికి భారత ప్రభుత్వము రాష్ట్రప్రభుత్వాలు కలిసి కృషిచేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంలో వైద్యనాథయ్యర్ గారు కవ్వించగా, గోపాలరెడ్డిగారు రాష్ట్రప్రభుత్వానికిప్పుడాట్టే అధికారాలేవనీ, ప్రతి చిన్నవిషయానికీ ఢిల్లీనుంచి ఆజ్ఞలకోసం వేచివుండవలసి వస్తూందనీ చెప్పారు.

మరోవిషయంకూడా చెప్పారు. బ్లాక్ మార్కెటీర్ల దుకాణాలవద్ద (కాంగ్రెస్ ఉద్యమాలరోజుల్లో విదేశీబట్టల షాపులవద్ద మాదిరిగా) ఎవరైనా పికెటింగ్ చెయ్యడానికారంభిస్తే "అది అహింసాసిద్ధాంతాలకి లోబడిఉంటే ప్రభుత్వం తప్పకుండా సహకరిస్తుంది" అన్నారు గోపాలరెడ్డిగారు. అంటే మంత్రి గోపాలరెడ్డిగారు కూడా షాపులవద్దకు కార్లో వచ్చి పికెటింగ్ చేస్తారని కాదు. హింస లేనంతవరకూ ప్రభుత్వం నివారించదు అని వారి అభిప్రాయం కావచ్చును.

ఉత్తరాది-దక్షిణాది ✻

కౌన్సిల్లో చర్చలో మద్రాసువిశ్వవిద్యాలయ వైస్‌ఛాన్సెలర్ సర్. ఏ. లక్ష్మణస్వామి మొదలియార్ దక్షిణాదివారిపైన ఉత్తరాదివారు పెత్తనం చలాయించాలనుకుంటున్నారని ఆరోపించారు. (భక్తవత్సలంగారు గోపాలరెడ్డిగారు కృతజ్ఞతాసూచకంగా చిరునవ్వులు నవ్వారు.) కాని రాజన్ గారు అలాంటిదేమీ లేదన్నారు.

[సీతారామ్]

నేటి ప్రపంచం

(5 వ పేజీ తరువాయి)

ప్రాయం ఇటువంటప్పుడు న్యాయం ధర్మం ఏ పక్షాన ఉందో ఆయా స్థితిగతుల్ని బట్టి ఎప్పటి కప్పుడు నిర్ణయించవలసిందే నంటారు పండిట్ నెహ్రూ. ఇది తటస్థ విధానం కాదని పండిట్ నెహ్రూ అంగీకరిస్తారు.

ఆసియా దేశాలకీ నాడు కమ్యూనిస్టుల పక్షమో; లేక ఏ నియంతృత్వమైనాసరే రాజరికమైనాసరే అమెరికా బలపరుస్తున్నది కాబట్టి అమెరికా సహాయం పొందుతున్న పక్షమో ఎంచుకోవలసిన పరిస్థితి వచ్చింది. ఈ రెండు పక్షాలనూ కాదంటే మరొక పక్షం కనపడదు. కనపడిన వెంటనే అది కమ్యూనిస్టు పక్షమని అమెరికన్ పక్షం వారు, సామ్రాజ్యవాదుల పక్షమని కమ్యూనిస్టులు తిట్టిపోసి భగ్నపరుస్తున్నారు. బర్మా ఇండోనీషియా ప్రభుత్వాలే దీనికి మంచి తార్కాణాలు. థాకిన్ నూ ప్రభుత్వం పాశ్చాత్యులకు విరోధి యని బ్రిటన్లోను అమెరికాలోను ప్రచారం జరుగుతోంది. సామ్రాజ్యవాదుల కీలుబొమ్మ అని కమ్యూనిస్టులు ప్రచారం చేస్తున్నారు. కమ్యూనిస్టులు విప్లవం తెచ్చారు. బ్రిటిష్‌వారి ప్రోద్బలంపైన క్రైస్తవమతస్థులైన కరెన్లు తిరుగుబాటు చేశారు. ఉభయులూ కలిసి బర్మా ప్రభుత్వాన్ని బలహీనపరిచారు. ఆదేరీతిగా ఇండోనీషియాలో యత్నాలు జరుగుతున్నాయి




గోపీనాథ్ బార్డొలాయ్

ఆదివారం ఉదయం హఠాన్మృతి చెందిన అస్సాం ముఖ్యమంత్రి శ్రీ గోపీనాథ్ బార్డొలాయ్.

వాస్తవానికి అమెరికా సహాయంపై, ఆధారపడిన చీనా జాతీయ ప్రభుత్వం, ఫిలిప్పైన్స్ ప్రభుత్వం, ఇండో చీనాలోని బావోదాయ్ ప్రభుత్వం ప్రజలకు జీవనసదుపాయాలు చేకూర్చలేక పోగా దారిద్ర్యాన్ని ఇనుమడింపచేశాయి, ఈ ప్రభుత్వపక్షాలూ, కమ్యూనిస్టుపక్షాలూ తప్ప ప్రజలకింక మరోగతి కానరాదు. ఇటువంటప్పుడు ఒక దేశంలో ఈ దారిద్ర్యంపంపీ ఆదేశం కమ్యూనిస్టుల పాలబడినప్పుడు తిరుగేమిటి? దాన్నెందుకు అమెరికన్లు గుర్తించరు? చీనాలో కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని గుర్తించని పక్షంలో అమెరికా ఏమిచెయ్యదలిచింది? నిజానికి ఏమి చెయ్య తలపెట్టినా ఆసియాఖండంఅంతటా అరాచకం అంతర్యుద్ధాలూ తరవాత ప్రపంచయుద్ధం ప్రజ్వరించక మానవు. ఈ దుర్ఘటన సంభవించకుండా నివారించాలంటే చీనా విషయంలో అమెరికా జోక్యం చేసుకోకుండా ఉండడం అవసరం. ఈ వాస్తవస్థితిని గుర్తించి ఇకనైనా ఆసియా ఖండంలో బలాత్కారబాంధవ్యం డాలర్ దానాలపద్ధతులు మాని అమెరికా యూరప్‌లు ఆసియా వాసుల సమస్యల్ని సరిగ్గా అర్థం చేసుకొని ప్రవర్తించవలసిందే.

అందువల్లనే ఆసియావాసుల అంతరంగాన్ని అమెరికన్లు యూరోపియన్లు అర్థంచేసుకోలేకున్నారు పండిట్ నెహ్రూ. చీనా కమ్యూనిస్టుప్రభుత్వాన్నే భద్రతమండలిలో ప్రవేశపెట్టి ఉన్నట్లయితే ప్రపంచయుద్ధప్రమాదం ఈనాడు ఆవహించిఉండేది కాదు. అమెరికా రష్యాల మధ్య "ప్రచ్ఛన్న యుద్ధమూ," వీటో ప్రయోగాలతో కాలంగడిచేదే. అప్పుడైతే ఆసియా దేశాల సమస్యను మరొకరీతిగానైనా



రవీంద్రనాథ్ ఠాగూర్

ఆగస్టు 7 వ తేదీ సోమవారం నాడు స్వర్గీయ రవీంద్ర కవీంద్రుని వర్థంతి వివిధ ప్రాంతాల్లో జరుపబడింది

పరిష్కరించడానికి అవకాశం చేకూరి ఉండేది.

కాని బావోదాయ్ ప్రభుత్వాలవంటి ప్రభుత్వాల్ని బలపరిచి ఆసియా దేశాల సమస్యల్ని పరిష్కరించడం అసంభవమనే విషయాన్ని ఇంకా అమెరికాను బ్రిటన్ ఫ్రాన్సులు కాని గ్రహించడం లేదు. ఇంకా ఆసియా దేశాల్ని కమ్యూనిస్టు ప్రమాదం నుంచి రక్షించాలనే ఆత్రంతో చీనాకిచ్చిన సహాయాన్నే అన్యదేశాలలో ప్రభుత్వాలకూ అమెరికా ఇస్తున్నది. ఇది నిష్ప్రయోజన మని భారతదేశం అభిప్రాయం [సూర్యనారాయణ]

రుద్రమదేవి

(6-వ పేజీ తరువాయి)

వెంటనే యామె దేవగిరివంకనుండి తనకు వార్తాహరు లంపిన వార్త లన్నియు తీసి పరిశీలించెను. అందులో సందేహింపవలసిన పని లేదని గుండె దిటవుచేసికొని శయ్యపై పరుండి రుయ్యమ్మ నిదురింప బ్రయత్నించెను. నిదుర రాదు. దూరమునుండి, 'ఝుక ఝుంఝుం, ఝుకఝుంఝుం, ఝుకఝుంఝుం' అని తప్పెట్లు చేయు చప్పుడు హృదయమును కలచివేయసాగెను. నిద్దుర రాదు.

"నా కిప్పుడు తగిన మంత్ర ముపదేశించువా రెవరు?"

రుయ్యమ్మ యాలోచన పరిపరివిధముల ప్రసరించెను. వృద్ధు లగు గణపతిదేవు లేమియు రాజకార్యములు పట్టించుకొనుట లేదు. రుద్రమ వచ్చినవెంటనే తీర్థయాత్రలకు బయలుదేర గణపతి దేవులు ఉద్దేశించుచుండిరి. వారి నడిగి లాభము లేదు. జాయప నాయకుడు చేబ్రోలు వెళ్లియుండెను. మహాదేవరాజు అసలే తొందరపాటుమానిసి? కామసాని అంతఃపురవిషయములు తప్ప యితర మెరుగదు. ఎవ రిప్పుడు తనకు తగిన మంత్ర ముపదేశింపు వారు?

రుయ్యమ్మకు ప్రపంచమే శూన్యముగా కనిపించెను. ఈ లోకములో నెవ్వరును లేనట్లే కొంతవడి దానికి తోచెను. అంతలో నాకస్మికముగా దాని హృదయములోనికి బలవంతముగా నొక పురుషమూర్తి ప్రవేశించెను. అతని యున్నత మగు ఫాలము, నాసయు, శ్యామాయిత మగు ఛాయగల యాతని యాకారము, గౌరకన్నులతో రుయ్యమ్మమనస్సులో నిండిపోయెను. కారణజన్ముడైన అన్నమంత్రీశ్వరుడు రుయ్యమ్మకు స్ఫురించెను.

"అన్నమంత్రీశ్వరు లేమందురో ఈ సమయమున సహాయ మర్థించిన?"

తాను మొదలు అన్నమంత్రితో మాట్లాడగలదా? ఇతర పురుషుల నెవరిని జూచినను రుయ్యమ్మకు జంకు లేదు. కాని అన్నమంత్రిని చూచినంతనే ఆమెనోరు కట్టువడును. బుద్ధిలో నొకానొక దీనభావ మావేశించును. కన్నులు చెమరించును. ఏమని యాతని దానడుగును? అందులో నాతడు రాజద్రోహి యని సందేహింపబడి నిర్బంధమున నున్నవాడాయెను! అట్టివానినే తాను ఈ కష్టవిషయమున మంత్రి మర్థించుటా? అత డొకవేళ దుర్మంత్ర ముపదేశించిన ఈ రాజ్య మేమి కావలె? అన్నమంత్రి దుర్మంత్ర ముపదేశించునా?

"ఏవీ యాతనికి సంబంధించిన పత్రములు?"

ఇట్లనుకొనుచు శయ్యపైనుండి లేచి తన సమీపముననే గల పత్రసంచయ మున్న దస్త్రము విప్పి చూచెను. ఆ పత్రము లామె మున్నెన్నియో మారులు పరీక్షించియుండెను. ఏమైనను వానిలో లోపము కనిపెట్టి అన్నమంత్రి నిర్దోషి యని నిర్ధారణ చేయ నిశ్చయించి ఎంతయో ప్రయత్నించియుండెను. కాని ఏమియు లాభము లేకపోయినది! ఈనాడు మరల నవి పరీక్షించెను. మరల లాభము లేకపోయెను. అన్నమంత్రి ద్రోహి కాడన సాక్ష్యము కాదు!

"ఎంతమాట! అన్నమంత్రి ద్రోహియా? కాదు 'కాదు'

ఇట్లని రుయ్యమ్మహృదయము చెప్పుచున్నది. తన యమ్మ రుద్రమ్మకుగూడ నదియే నిశ్చయము!

"అన్నమంత్రిని విడిపించి యీవిషయమున నాతనితో మంత్రాలోచనము చేయుదునా?"

అంతలో రుయ్యమ్మకు సందేహము కలిగెను. తన కున్న యభిమానముచే రాజద్రోహిని విడిపించి యాతని యుపదేశప్రకారము రాజ్యతంత్రము నిర్వహింపజూచుటా?

"ఛీ! ఎంత ప్రమాదము!"

దూరమున మ్రోయుచున్న తప్పెట్లు రుయ్యమ్మహృదయమున ఝుక ఝుం ఝుం ఝుక ఝుం ఝుం ఝుక ఝుం ఝు మ్మని ప్రతిధ్వనింప సాగెను.

౨౨

కరణపాఠశాలలో నారు వేలమంది బ్రాహ్మణులును సంపూర్ణముగా కరణవిద్య నభ్యసించిరి. వారి యధ్యాపకులు వారి నన్ని విధముల పరీక్షించి తృప్తిపడిరి. కాని యొక మహాసభలో వారు పరీక్ష యిచ్చి పట్టాలు పొందనిచో విద్యలో నుత్తీర్ణులైనట్లు నిశ్చయ మేమి? అందుచే నధ్యాపకులు శ్రీరుద్రదేవమహారాజుల సమక్షమున పరిషత్తు సమకూర్ప నిశ్చయించిరి. కాని మహారాజులు గోదావరీతీరమునకు వెళ్లియుండిరి. వారు తిరిగి వచ్చునప్పటి కెంత కాలము పట్టునో! తుదకు విద్యార్థులును అధ్యాపకులును సంప్రదించి తిక్కనసోమయాజులను పరీక్షాధికారులనుగా నుంచుకొని కరణవిద్యాపరిషత్తు సమావేశపరుప నిశ్చయించిరి. అందుకు తిథివారములు లగ్నమును నిశ్చితము లయినవి. తిక్కనసోమయాజులును ఆ సభానిర్వహణమున కంగీకరించిరి.

తెల్లవారినచో నా సభ జరుగవలసియుండెను. అందుకు రాజభవనమునకు ముందున్న విశాలస్థలములో మహాసభామండప మొకటి నిర్మింపబడెను. అది చక్కగా కదళీస్తంభములతో పచ్చని యాకులతో తోరణములతో నలంకరింపబడి యుండెను. అన్ని ప్రయత్నములును ఎంత ముందునుండి చేయుచున్నను చివరిక్షణము వరకు నేదో యొకటి కొదువగానే యున్నట్లుండును. ఇంకను అట్లే యున్నవి. విద్యార్థులును అధ్యాపకులును అర్ధరాత్రము దాటువరకును ఆ తాటియాకుల మహామండపము నలంకరించుచు నక్కడనే యుండిరి. తుదకు పలువురు తమ తమ నివాసములకు పోక యచ్చటనే కునికిరి.

కరణశాలలు ప్రారంభించిన క్రొత్తరోజులలో దానికి ఎన్నో విఘ్నములు చేయ జైనకరణములు ప్రయత్నించియుండిరి. అవి యన్నియు రాజభటుల తీవ్రరక్షణచే నరికట్టబడెను. అంతకంతకు రాజభటుల రక్షణమే అవసరము లేకపోయెను. ఆ పాఠశాలలకు గాని అందలి విద్యార్థులకు గాని ఇప్పు డెట్టి యలజడియు కలుగుట లేదు.

తెల్లవారవచ్చుచున్నది. ఆ మండపమునకు పశ్చిమ భాగమున సూర్యోదయ మైనట్లు కాంతి కనబడినది. కన్నులు నులుముకొనుచు నొక విద్యార్థి లేచి సూర్యోదయ మైనదని యంద

రను లెమ్మని లేపెను. పశ్చిమదిశను సూర్యోదయమే మని యాతని బదరుచు వారు లేచి చూచిరి. చూడగా నిజముగా పశ్చిమ దిక్కుగా నరుణోదయప్రభలు కనిపించెను. అది చూచి నిద్దుర కళ్ళతో వారు నివ్వెరపోవుచుండిరి.

అంతలో నుత్తరదిక్కున గూడ నరుణకాంతులు పర్వెను. వారు ఆశ్చర్యపడునంతలోననె దక్షిణమునను తూర్పుననుగూడ నరుణకాంతులు ప్రసరించెను. చూచుచుండగానే ఆ యరుణ కాంతులు ఆ మండపమును మ్రింగివేయుచుండెను. ఆ మండపమును మహాగ్నియే దగ్ధము చేయుచున్నది. అందును నిద్రించుచున్న విద్యార్థులును అధ్యాపకులును మాత్రము ప్రాణములతో బయటపడిరి. తెల్లవారునప్పటికి ఆ మహామండపములో నొక్క పూరిపుల్లయును మిగులలేదు.

రాజభటులు వచ్చిరి. వా రేమి చేయగలరు ?

జనములు గుంపులు కూడిరి. వా రీ చోద్యమును చూచుచు విస్తుపోవుచుండిరి. ఎవరు దీనికి కారకులు ? జైనకరణములు !— కాదు. ఈ వైదికరణములే జైనులపై తప్పువేసి వారిని శిక్షింపజేసి యా యుద్యోగములు తాము సంపాదించుటకు వేసిన యెత్తుగడ ఇది ! ఇందరు విద్యార్థులు అధ్యాపకులు ఇక్కడనే తెల్లవారులు నుండిరి గదా ! వారికి తెలియకుండ నింత ప్రమాద మెట్లు సంభవింపగలదు ?— కాదు, కాదు ! ఇది జైనుల ప్రయోగము ! జైన సిద్ధుడు శ్రావణబెళ్గొళనుండి తిరిగివచ్చుచు తన తీక్ష్ణదృష్టి యిట్లు పరపెనట ! అతని కోపాగ్నికి దగ్ధమైనది ఈ మండపము ! యథా వాక్కుల అన్నమయ్యచూపుతో నా యవనుని కన్నులు పోలేదా ? ఎవరికి తోచినట్లు వా రనుచుండిరి.

అన్నమంత్రియింటికి వెళ్లి పెద్దలందరును తిక్కనసోమయాజులతో కర్తవ్య మాలోచించిరి. అనుకొన్న లగ్నమునకు ఆ ప్రదేశముననే ఆ మహాసభ చేయవలసినదని తిక్కన సోమయాజులు నిర్ణయించిరి ! తాను మాట తప్పుటకు వీలులేదనియు అనృతదోషము వచ్చు ననియు వారు పైపెచ్చు సెలవిచ్చిరి.

ఆ నాటి మధ్యాహ్నవేళ నా సభ ప్రారంభ మయ్యెను. దుష్టులు పెట్టిన చిచ్చుకు కాలి భస్మమై కొంత యారియు కొంత యారకున్న యా మహామండపముననే అనుకున్నవేళ కా సభ ఉపక్రమింపబడెను.

యజ్ఞాంతమందు యజ్ఞశాల యగ్నిహోత్రుని కర్పించుట విధి కాదా ? ఈ బ్రాహ్మణులు ప్రారంభించిన కరణవిద్యాయజ్ఞము సంపూర్తియైనది. మరి యిక నీ మహామంటపము నాది కదా యని యగ్నిహోత్రుడే తన యధికారము నిట్లు ప్రదర్శించి యాహుతి కొనెనా యన్నట్లున్న దా మహాశాల !

తిక్కనసోమయాజులకు దగ్ధమైన యా మహామండపము చూచి నంతనే ఏమని తోచెనో ! ఆ మహానుభావుడు రత్నశలాకవంటి తన దేహయష్టిని వంచి యా భస్మము చేతులతో గ్రహించి విభూతిధారణ చేయువిధముననే అభిమంత్రించి దేహమున ధరించెను. అది చూచి వెంటనే ప్రక్కనున్న గురునాథుడును మారనయు అట్లే యొనర్చిరి. వారిని చూచి సభయంతయు మహోత్సాహముతో నట్లొనర్చెను. త్ర్యంబకమంత్రము ఉద్ఘోషింపబడెను !

రుద్రుని కంటిమంట కగ్గమైన కాముడు శ్రీమాతృసంబోధనచే సంజీవితుడై యీ రూపముతోడనే భాసించెనా యనునట్లు ఆ మహాసభ విలసిల్లెను.

ఆ పరీక్షాసభ ఎక్కువసేపు పట్టలేదు. మూడుజాములవేళకు అంతయు పూర్తియయ్యెను. ఎవరిని ఏ ప్రశ్న యడిగినను వారు వేదపన్నములు అప్పగించినట్లే వెంటనే ఉత్తరము లీయసాగిరి. మరి వారికి విజయపట్టికలు ఈయవలదా ? పత్రము లన్నియు నప్పటికే వ్రాసి సిద్ధముగా నున్నవి. తిక్కనసోమయాజులు చేవ్రాలు చేయుటయే మిగులు !

కాని తిక్కనసోమయాజులు చేవ్రాలు చేయ నిరాకరించెను. సోమయాజులకు తృప్తి కాలేదు !

“మీ రందరును ఖడ్గము శూలము ధనుస్సు—ఇందులో ఒక్క రణసాధనము ప్రయోగించుటలో నైన ప్రవీణులు కావలెను !”

సోమయాజుల యాజ్ఞ యది ! పిలిచిన పెద్దల నిర్ణయమును ధిక్కరించుటకు అలవాటుపడలే దా నాటి జనములు ! ఆ బ్రాహ్మణు లందరును సోమయాజుల యాజ్ఞకు తలయొగ్గిరి. ఒక్క మాసముదినములు వ్యవధి కోరిరి. గురునాథుడును నెల్లూరినుండి వచ్చిన కరణములు నే యా విద్య నేర్పుటకుగూడ పూనుకొనిరి !

ఒక్కసారిగా వారి విద్యాశాలలు గరిడి నేర్పు శాలలుగా మారిపోయెను !



★ కొరియా యుద్ధం ★




కమ్యూనిస్టు దండయాత్రకు కొరియాలో
దిగుతున్న అమెరికన్ సేనలు



కొరియాలో అమెరికా ఉపయోగించిన బి. 29
రకం బాంబరువిమానం



దక్షిణకొరియా టాంకువిధ్వంసకదళం



5 మిలిమీటర ఫిరంగిని ఉపయోగించుతున్న
అమెరికన్ సైనికులు

Regd. No. M. 4479

ited, Printed & Published by S. Sambuu Prased, at the Andhra Patrika Press, 7, Thambu Chetty St., Madras.